www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం

వచ్చే నెల 11న ప్రమాణ స్వీకారం

2

రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

14

శుక్రవారం | 25-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 190

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: నవమి తె. 3.23 తదుపరి దశమి; నక్షత్రం: పుష్యమి ఉ. 7.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా. 9.35-11.19; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.18, మ. 12.21-1.07; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.43

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆస్తులపైనే మీ ప్రేమ!



అనుబంధాలను మరిచిపోయారు: షర్మిల

నాలుగు గోడలమధ్య మాట్లాడుకోవాల్సింది

ఇప్పుడు తల్లీ చెల్లిని కోర్టుకు ఈడ్చారు

ఇది మామూలు విషయం కాదు జగన్ సార్!

ఓటమి తర్వాత మనసు మారింది

కంపెనీలను వదులుకోవద్దనే ఈ కథలు

షేర్లు బదిలీ చేస్తే బెయిలు రద్దవుతుందా?

ఇది ఈ శతాబ్దపు జోక్: షర్మిల

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల మీద ప్రేమతో రక్త సంబంధాన్ని, అనుబంధాలను మరిచిపోయారని తన సోదరుడు వైఎస్ జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకోవాల్సిన కుటుంబ విషయాలను రోడ్డు మీదకు తీసుకువచ్చారని ఆగ్రహించారు. అది చాలదన్నట్లుగా ఇప్పుడు కోర్టు వరకూ తీసుకువెళ్లారని విమర్శించారు. ఆస్తులు ఇచ్చేది లేదంటూ లేఖ రాయడంతోపాటు, తల్లిపైనా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్టీ)లో జగన్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో

మిగతా 14వ పేజీలో...

ఎందుకంత 'పగ'.. అంటే!



'జన్మతః మన మధ్య సంక్రమించిన బాంధవ్యం, చిన్నతనం నుంచీ పంచుకున్న అనుభూతులు, ప్రశాంతమైన జ్ఞాపకాలన్నీ.. మారిన నీ వైఖరితో గతంగా మారాయి. సోదరుడినన్న ప్రేమ, ఆప్యాయతలు లేకుండా నువ్వు చేస్తున్న చర్యలతో నా హృదయం తీవ్రంగా గాయపడింది. నాపై పదేపదే అసత్యాలు చెప్పావు. తప్పుడు ప్రచారం చేశావు. రాజకీయంగా నాతో విభేదించడమే కాకుండా వ్యక్తిగతంగా నా ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించావు. ఇంత చేశాక నీ మీద ప్రేమ, ఆప్యాయతలు ఎందుకు ఉండాలి. మన మధ్య సఖ్యత, సుహృద్భావ పరిస్థితులు లేవన్న దాంట్లో రహస్యమేమీ లేదు. మారిన పరిస్థితుల నేపథ్యంలో... ఆస్తుల్లో వాటాలకు సంబంధించిన ఒరిజినల్ ఎంఓయూ అమలు చేసేందుకు సిద్ధంగా లేను. సరస్వతీ పవర్‌లో వాటాలను ఇస్తూ చేసిన డిక్లరేషన్‌ను రద్దు చేసుకుంటున్నాను. న్యాయస్థానంలో కేసులు తేలాక, నీ వైఖరి మారితే... అప్పుడు అన్నా చెల్లెళ్ల బంధం మళ్లీ చిగురించే అవకాశం ఉంది!"

– ఆగస్టు 27న షర్మిలకు రాసిన లేఖలో జగన్

"ఆస్తుల కోసం గొడవలు పెట్టుకోవాలన్న ఉద్దేశం నాకు లేదు. సామరస్యంగా పరిష్కరించుకోవాలని, నాలుగు గోడల మధ్య మాట్లాడుకోవాలని నాకూ తెలుసు. కానీ... కుటుంబ విషయాలను జగన్ రోడ్డు మీదకు తీసుకొచ్చారు. ఇప్పుడు కోర్టు వరకూ తీసుకువెళ్లారు. తల్లినీ, చెల్లినీ కోర్టుకు ఈడ్చడం సాధారణ విషయం కాదు జగన్ సార్!"

- మీడియాతో షర్మిల



కృష్ణానదిపై నిర్మించనున్న 3.2 కి.మీ. వంతెన నమూనా

అమరావతి రైలు మార్గం ఇలా.. ఎర్రుపాలెం - చెన్నంరావుపాలెం - గొట్టిముక్కల - పరిటాల - కొత్తపేట - కృష్ణానది వంతెన - వడ్డమాను - తాడికొండ - కొప్పురావూరు - నంబూరు

అమరావతి 2.0.. ఆరంభంలోనే కేంద్రం శుభవార్త చెప్పింది. రాజధాని రైలుమార్గానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇటీవలే.. రాజధాని అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించింది. ఇప్పుడు అదే రాజధాని ప్రాంత రైల్వే ప్రాజెక్టుకు మోదీ సర్కారు పచ్చజెండా ఊపి రూ.2,245 కోట్లు మంజూరు చేసింది.

అమరావతికి రైల్వే లైన్!

దూరం : 57 కి.మీ.
వేగం : 160 కి.మీ.
వంతెన : 3.2 కి.మీ.

రూ.2,245 కోట్లతో నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఓకే

అమరావతి 2.0కు అన్నీ శుభాలే

నిన్న రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు

ఎర్రుపాలెం-నంబూరు మధ్య 57 కి.మీ. రైలు మార్గం

కృష్ణా నదిపై కొత్తగా 3.2 కి.మీ. పొడవైన వంతెన

పరిటాల వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్

బందరు, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులతో కనెక్టివిటీ


దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో అనుసంధానం

దక్షిణ, ఉత్తర భారతాలను కలుపుతూ నిర్మాణం

దేశమంతా సంధానానికి మార్గం సుగమం



రైల్వే మంత్రి వైష్ణవ్



నాలుగేళ్లలోపే పూర్తి చేస్తాం

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

మూడేళ్లలో పూర్తయ్యేలా చూడండి

భూసేకరణకు ఇప్పటికే నోటిఫికేషన్

కాబట్టి పనులు త్వరగా పూర్తిచేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో బాబు సూచన

శ్రీకాకుళంలో 6 లేన్ల ఎలివేటెడ్ కారిడార్

రణస్థలం వద్ద 252.42 కోట్లతో ఏర్పాటు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

14

న్యూఢిల్లీ, గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్.. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో కలిసి తెలుగు మీడియాతో మాట్లాడారు. రైల్వే లైన్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయాన్ని

మిగతా 12వ పేజీలో...

ఎన్‌హెచ్ పనులకు ఉచితంగా ఇసుక

భూసేకరణ 3 నెలల్లో: ముఖ్యమంత్రి

శారదా పీఠానికి మరో షాక్



తిరుమలలో శారదా పీఠం అక్రమంగా చేపట్టిన నిర్మాణం

తిరుమలలో అక్రమ, అదనపు స్థలం కేటాయింపు రద్దు

గతంలో 20 వేల చదరపు అడుగుల ఆక్రమణ

అందులో అనుమతి లేకుండా నిర్మాణాలు

అక్రమాన్ని క్రమబద్ధీకరించిన జగన్

నాటి టీటీడీ బోర్డు నిర్ణయం.. సర్కారు ఓకే

తాజాగా ఈ ప్రతిపాదనలు రద్దు

ఆక్రమిత స్థలంలో నిర్మాణాల విషయంలో

చర్యలు తీసుకోవాలని టీటీడీకి ఆదేశం

తిరుపతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ శారదా పీఠానికి రాష్ట్ర ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. తిరుమలలో ఈ పీఠానికి జగన్ సర్కారు 'అక్రమంగా' కట్టబెట్టిన అదనపు స్థలం కేటాయింపును రద్దు చేసింది. అంతేగాక శారదా పీఠం ఆక్రమించిన ఈ స్థలంలో నిర్మాణాల విషయంలో నియమ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవాలని టీటీడీని ఆదేశించింది. తిరుమలలో శారదా పీఠం గతంలో తనకు టీటీడీ కేటాయించిన 5 వేల చదరపు అడుగుల స్థలం గాక అదనంగా 20 వేల చదరపు అడుగుల స్థలాన్ని ఆక్రమించింది. అందులో

మిగతా 2వ పేజీలో...

మరో 95 విమానాలకు..

దేశంలో ఆగని బెదిరింపులు.. పది రోజుల్లో 250కిపైగా..

అత్యధికం ఒకే సోషల్ మీడియా ఖాతా నుంచి రాక

ఒట్టివేనని తేలుతుండటంతో విమానాల మళ్లింపు బంద్!

నిందితుల వివరాలివ్వండి.. ఎక్స్, మెటాలను కోరిన కేంద్రం

విభాగాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలి: మోదీ 2

తిరుపతిలో 4 హోటళ్లకు బాంబు బెదిరింపులు

'వైసీపీ' అధికారికి అందలం!

13

శ్రీశైలం ఈవోగా కీలక పోస్టింగ్.. అర్హులైన డిప్యూటీ కమిషనర్లను పక్కన పెట్టి చంద్రశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యత

అధికారులు, టీడీపీ శ్రేణుల విస్మయం.. గతంలో ధూళిపాళ్ల ట్రస్టు ఆస్పత్రి మూసివేయించేందుకు ఆయన యత్నాలు

3 ఉమ్మడి జిల్లాల్లో పనిచేసే ఈవోలు, మేనేజర్లకు వేధింపులు

ముడుపులు తీసుకుని అక్రమ పదోన్నతులిచ్చినట్టు ఆరోపణలు

10 గిగావాట్ల పవర్!

ఏపీలో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు పెడతాం

మంత్రి లోకేశ్‌కు 'సెరెంటికా' ప్రతినిధుల ప్రతిపాదన



సెరెంటికా గ్లోబల్ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 10 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వేదాంత గ్రూప్ కంపెనీ సెరెంటికా గ్లోబల్ ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్

మిగతా 12వ పేజీలో...

ఏఐ వర్సిటీ ఏర్పాటుకు సలహాలివ్వండి

ఎన్‌విడియా సీఈవోతో మంత్రి లోకేశ్ భేటీ

ఒడిసాలో 'దానా' కల్లోలం

తీరానికి దగ్గరగా తీవ్ర తుఫాన్.. నేటి ఉదయంలోపు తీరంపైకి

7 జిల్లాలకు రెడ్, 5 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. 3 లక్షల మంది శిబిరాలకు తరలింపు

అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు, పెనుగాలులు.. కూలిన చెట్లు, స్తంభించిన రాకపోకలు

పూరీ జగన్నాథుడి ఆలయ రక్షణకు చర్యలు.. కోణార్క్ సూర్యదేవాలయం 2 రోజులు మూత

ఉత్తరాంధ్ర రేవుల్లో మూడో నంబరు హెచ్చరిక

2

అరచేతిని అడ్డుపెట్టి..



- చైనాలో స్టోర్లు, షాపింగ్ మాల్స్‌లో అరచేతితో చెల్లింపులు
- సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేసిన పాక్ కంటెంట్ క్రియేటర్

న్యూఢిల్లీ, అక్టోబరు 24: ఏదైనా స్టోర్‌కో, షాపింగ్ మాల్‌కో వెళితే సరుకులు కొన్నాక నగదు రహిత చెల్లింపులు మామూలైపోయాయి. డెబిట్, క్రెడిట్ కార్డుతోనో, యూపీఐ యాప్స్ ద్వారానో డబ్బు చెల్లిస్తుంటాం! మరి.. ఇవేవీ లేకుండా కేవలం 'అరచేతి' ద్వారా చెల్లింపులు చేయగలిగితే? మీరు చదివింది వాస్తవమే. స్కానర్ ముందు అరచేతిని ఉంచితే చాలు.. కొన్న సరుకుల విలువ మేరకు బిల్లు చెల్లింపు జరిగిపోతుంది. ఈ వినూత్న సాంకేతిక పరిజ్ఞానం చైనాలో వచ్చేసింది. పాకిస్థాన్‌కు చెందిన రానా హంజా సైఫ్ అనే కంటెంట్ క్రియేటర్ చైనాలోని జూజౌ పట్టణంలోని ఓ స్టోర్‌లో ఈ 'పామ్ పేమెంట్ సిస్టమ్' ద్వారా జరుగుతున్న చెల్లింపులను చూసి ఆశ్చర్యపోయాడు. చైనాలో ఈ తరహా చెల్లింపుల కోసం ఆయన తన అరచేతిని స్కాన్ చేయించుకొని రిజిస్టర్ చేసుకున్నారు. తర్వాత తన చేతితోనే చెల్లింపులు చేశారు. ఈ తతంగాన్నంతా ఆయన వీడియోగా తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. సాంకేతిక, మౌలిక రంగాల్లో ముందంజలో నిలిచి ప్రపంచ దేశాలకే సవాలు విసురుతున్న చైనా 'ప్రస్తుతం 2050'లో ఉంది అని వీడియో కింద క్యాప్షన్ పెట్టారు. సైఫ్. పామ్ పేమెంట్ విధానంపై నెటిజెన్లు సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేస్తున్నారు. 'త్వరలో ఇది ప్రపంచ వ్యాప్తం కానుందేమో' అని ఓ నెటిజెన్ కామెంట్ చేశారు. దీనిపై సైఫ్ తరహాలోనే ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గొయాంకా గతంలోనే ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. బీజింగ్‌లోని మెట్రోలో ఓ మహిళ తన చేతితో చెల్లింపు చేస్తుండటాన్ని అందులో చిత్రీకరించారు.

ఎలా పనిచేస్తుందంటే..

అరచేతి ద్వారా చెల్లింపులు చేయాలంటే యూపీఐ యాప్స్ తరహాలోనే కొన్ని లాంఛనాలు పూర్తిచేయాలి. మన అరచేతిని ప్రత్యేక స్కానర్ ద్వారా స్కాన్ చేయించాలి. ఆ తర్వాత ఆ స్కాన్ చేసిన అరచేతి నకలును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసి ఉన్న మొబైల్ నంబరుతో కూడిన యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఒకసారి రిజిస్ట్రేషన్ పూర్తయితే.. ఎక్కడైనా కేవలం అరచేతిని ఉపయోగించి నగదు రహిత చెల్లింపులు చేయొచ్చు. ఇది చైనాలో మాత్రమే అమల్లో ఉంది.



ఒడిసాలో 'దానా' కల్లోలం

- తీరానికి దగ్గరగా తీవ్ర తుఫాన్.. నేటి ఉదయంలోపు తీరంపైకి

భువనేశ్వర్, అక్టోబరు 24: తీవ్ర తుపాను దానా ఒడిసా రాష్ట్రంపై విరుచుకుపడుతోంది. గురువారం తీరానికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న తీవ్ర తుపాను శుక్రవారం ఉదయం నాటికి ఉత్తర ఒడిసాలోని భితార్కనికా, ధామ్రా ప్రాంతాల మధ్య తీరం దాటనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఆ సమయంలో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ఏడు జిల్లాలకు రెడ్, ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉందని తెలిపింది. గురువారం నుంచే ఒడిసాలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు గంటకు 95 నుంచి 110 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. అత్యధికంగా పారాదీప్‌లో నాలుగు గంటల్లోనే 62 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఐఎండీ తెలిపింది. ఇప్పటికే 3 లక్షల మందిని వివిధ తుపాను శిబిరాల్లోకి తరలించామని సీఎం మోహన్‌చరణ్ మాఝీ తెలిపారు. 7,285 తుపాను కేంద్రాలను ఏర్పాటు చేసి, 91 వైద్య బృందాలను కూడా నియమించారు. తీవ్ర తుఫాన్ తీరం దాటిన తరువాత ఉత్తర వాయవ్యంగా పయనించాల్సి ఉన్నప్పటికీ, మధ్య భారతంలో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో నైరుతి దిశగా పయనిస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీంతో తీరందాటే సమయంలో ఒడిశా తీర ప్రాంత జిల్లాలు, తీరందాటిన తరువాత దిశ మార్చుకునే సమయంలో మధ్య ఒడిశా ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. సముద్ర తీర పట్టణం పూరీలోని జగన్నాథుడి ఆలయంపై తీవ్ర తుపాను ప్రభావాన్ని తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రోజువారీ పూజా కార్యక్రమాలు కొనసాగిస్తూనే.. ఆలయ భద్రతకు తగిన చర్యలు చేపట్టామని ఎస్‌జేటీఏ(శ్రీజగన్నాథ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్) తెలిపింది.

ఉత్తరాంధ్ర పోర్టుల్లో మూడో నంబరు హెచ్చరిక

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తీవ్ర తుఫాన్ దానా ప్రభావంతో ఉత్తరాంధ్రలోని కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, గంగవరం ఓడరేవుల్లో మూడో నంబరు హెచ్చరికను జారీచేశారు. అలాగే, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవుల్లో రెండో నంబరు హెచ్చరిక ఎగురవేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున ఉత్తరాంధ్రలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. కాగా... తీవ్ర తుపాను 'దానా' శుక్రవారం తెల్లవారుజామున ఒడిశాలోని పూరీ-సాగర్ ద్వీపం మధ్య తీరం దాటుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. సముద్రం కల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.

శ్రీశైలానికి భారీగా వరద

- 4 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల

శ్రీశైలం, మాచర్ల రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద కొనసాగుతోంది. జూరాల నుంచి 70,552 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1,18,776 క్యూసెక్కులు మొత్తం 1,89,328 నీరు శ్రీశైలానికి వస్తోంది. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 885 అడుగులకు చేరింది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో అధికారులు శ్రీశైలం డ్యాం 4 గేట్లను 10 అడుగులమేర ఎత్తి 1,12,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,276 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 2,10,149 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 20 గేట్లను ఎత్తి 1,62,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు సాగర్ కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,826 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

వైసీపీ నేతల భూకబ్జాలకు అంతేలేదు

- చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేటాయించిన స్థలాలను వైసీపీ నేతలు కబ్జా చేసి వ్యభిచారం నిర్వహిస్తుంటే.. దానిపై కేసులు పెట్టినా నాడు పోలీసులు పట్టించుకోలేదని, తిరిగి తమపైనే అక్రమ కేసులు పెట్టి వేధించారని టీడీపీ దివ్యాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు టీడీపీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు శ్రీరాంచినబాబు అర్జీలు స్వీకరించారు. పెద్దిరెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి తన భూములను ఆక్రమించుకున్నారని, దానికి అప్పటి అధికారులు సహకరించారని.. తమ భూమిని ఇప్పించాలని చిత్తూరు జిల్లా సదుం మండలానికి చెందిన కె.చోలేశ్వరరావు కోరారు.

రేపటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సభ్యత్వ నమోదును పటిష్టంగా చేపట్టాలని, కార్యకర్తల నిధిని రూ.100 కోట్ల మేర సమకూర్చుకోవాలని పార్టీ భావిస్తోంది. శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకోవాలనుకున్న వారి నుంచి రూ.లక్ష వసూలు చేయాలని, ప్రస్తుతం పార్టీ కార్యకర్త చనిపోయినప్పుడు బీమా కింద రూ.2 లక్షలు ఇస్తుండగా.. దానిని రూ.5 లక్షలకు పెంచాలని నిర్ణయించారు.

సీఐడీ కస్టడీకి పానుగంటి చైతన్య

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి, విధ్వంసం కేసులో ప్రధాన నిందితుడైన వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యను సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటల వరకు మూడు రోజుల పాటు చైతన్యను సీఐడీ అధికారులు విచారించనున్నారు. ఆ తర్వాత ఆయనను జైలులో హాజరుపరచాల్సి ఉంది. 2021 అక్టోబరు 19న పానుగంటి చైతన్య నేతృత్వంలో సుమారు 200 మంది వరకు వైసీపీ మూక టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసి, విధ్వంసం సృష్టించింది. కాగా ఇటీవల ఈ కేసుకు సంబంధించిన అన్ని ఫైళ్లను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చైతన్యను కస్టడీకి ఇవ్వాలంటూ మంగళగిరి రూరల్ పోలీసులు అప్పట్లోనే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ అనంతరం పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది.

ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా పనిచేయాలి: సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటం అందరి తక్షణ కర్తవ్యమని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. గుర్లలో డయేరియా ప్రబలడంపై ఆరుగురు వైద్య నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో మానవ వనరులైన ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రైవేట్ వైద్య సిబ్బందిపై ఉందన్నారు. గుర్లలో డయేరియా కేసులు నమోదైన తేదీలు, ప్రభుత్వ వైద్య సిబ్బంది చేపట్టిన చర్యలు, వ్యాధిని అదుపులోకి తెచ్చిన వైనాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏపీఎంఎస్ఐడీసీపై కూడా మంత్రి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రుల అవసరాల మేర మందులు, సర్జికల్ పనిముట్ల సరఫరా కాకపోవడంతో నెలకొన్న ఆందోళనకు త్వరలో తెరపడనుందన్నారు. గత ప్రభుత్వం రూ.900 కోట్ల బిల్లులు బకాయిలు పెట్టిందన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఫ్యామిలీ ప్యాక్

ప్రతి పార్టీలో రక్త సంబంధీకులకే సీట్లు.. పట్టున్న నియోజకవర్గాల్లో పాగాకు ప్లాన్



వర్లి నియోజకవర్గం నుంచి నామినేషన్ వేస్తున్న శివసేన (యూబీటీ) నేత ఆదిత్య థాక్రే; చిత్రంలో ఉద్ధవ్ థాక్రే తదితరులు

ముంబై, అక్టోబరు 24: దేశంలో ప్రతి రాజకీయ పార్టీ కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలని చెబుతుంటాయి.. కానీ ఆచరణలో మాత్రం ఆ సూత్రాన్ని విస్మరించి.. తమ రక్త సంబంధీకులకే సీట్లు కేటాయిస్తుంటాయి. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అక్కడ అన్ని పార్టీలు తమ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించాయి. అందులో ప్రతీ పార్టీ వారి ముఖ్య నేతల తనయులు, భార్య, సోదరి, సోదరులకు ఏదో ఒకచోట సీటు కేటాయించింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ తనయ శ్రీజయ చవాన్ ఇటీవల కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరగా.. వారి కుటుంబానికి కంచుకోట అయిన నాందేడ్ జిల్లాలోని భోకర్ నియోజకవర్గాన్ని బీజేపీ ఆమెకు కేటాయించింది. అలాగే ముంబై బీజేపీ అధినేత ఆశిష్ షేలర్ పశ్చిమ బాంద్రా నియోజకవర్గం నుంచి పోటీకి దిగనుండగా.. ఆయన సోదరుడు వినోద్ షేలర్‌ను పశ్చిమ మలాడ్ నియోజకవర్గం నుంచి బీజేపీ బరిలోకి దింపింది. శ్రీగొండ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే బాబన్‌రావ్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా అక్కడి నుంచి ఆయన భార్య ప్రతిభా పచ్‌పూతేను బీజేపీ పోటీ చేయిస్తోంది. కాంకావ్లి నియోజకర్గ ఎమ్మెల్యే నితేశ్ సోదరుడు నీలేశ్ ఇటీవల బీజేపీ నుంచి ఉద్ధవ్ శివసేనలో చేరగా.. ఆయనకు పార్టీ కుడాల్ నియోజవర్గాన్ని కేటాయించింది. రాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ సోదరుడు కిరణ్ సామంగ్‌కు శిందే శివసేన రాజాపూర్ సీటు నుంచి బరిలోకి దింపుతోంది. అలాగే ఆ పార్టీ ఎంపీలు సందీపన్ భూమరే, రవీంద్ర వైకర్ తమ వారికి సీట్లు దక్కించుకోవడంలో సఫలమయ్యారు. భూమరే కుమారుడు విలాస్.. పైథాన్ నియోజకవర్గం నుంచి, వైకర్ భార్య మనీశా తూర్పు జోగేశ్వరీ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. ఎన్సీపీ నేత పంకజ్ భుజ్‌బల్ నాసిక్ జిల్లాలోని యోలా నియోజకవర్గం నుంచి, ఆయన సోదరుడు చాగన్ భుజ్‌బల్ ఇండిపెండెంట్‌గా అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. ఉద్ధవ్ థాక్రే కుమారుడు ఆదిత్య థాక్రే వర్లి నియోజకవర్గం నుంచి ఆయన సోదరుడు వరుణ్ సర్దేశాయ్ తూర్పు బాంద్రా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. శరద్ పవార్ మనవడు రోహిత్ పవార్ అహిల్యానగర్ స్థానం బరిలోకి దిగారు. ఇలా అన్ని పార్టీలు.. ముఖ్య నేతల కుటుంబసభ్యులకు సీట్లు కేటాయించాయి. కొన్ని నియోజకవర్గాల్లో అక్కడ పట్టున్న నేత ఆకస్మికంగా మృతి చెందడంతో వారి వారసులకు పార్టీలు సీట్లు కేటాయించాయి. ఏదీ ఏమైనా గెలుపే లక్ష్యంగా మహారాష్ట్రలో ప్రతి పార్టీ పూర్తి ఫ్యామిలీ ప్యాక్‌తో బరిలోకి దిగాయి.

48 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో నిలువనున్న అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను గురువారం కాంగ్రెస్ ప్రకటించింది. ఇందులో 48 మందికి చోటు కల్పించింది. సకోలి నుంచి మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే, కరాడ్ సౌత్ నుంచి మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్, బ్రహ్మపురి నుంచి విజయ్ వాడెట్టివర్, నాగ్‌పూర్ నార్త్ నుంచి మాజీ మంత్రి నితిన్ రౌత్, సంగమనేర్ నుంచి మాజీ మంత్రి బాలాసాహెబ్ థోరట్‌ను పోటీలోకి దింపుతోంది.

గడియారం అజిత్ పవార్ వర్గానికే!

శాసనసభ ఎన్నికల వరకే వర్తిస్తుంది

ప్రచారంలో స్పష్టంగా పేర్కొనాలి: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కూడా గడియారం గుర్తును నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అజిత్ పవార్ వర్గానికే కేటాయించాలని సుప్రీంకోర్టు గురువారం నిర్ణయించింది. ఇది ఈ ఎన్నికల వరకే వర్తిస్తుంది. గడియారం గుర్తు ఎవరిదన్నది సుప్రీంకోర్టు తుది తీర్పులో తేలుతుంది. అజిత్ పవార్ వర్గం గడియారం గుర్తును ప్రదర్శించే అన్ని ప్రకటనల కింద ఇదే విషయాన్ని గమనిక (డిస్క్లైమర్)గా పేర్కొనాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ గడియారం గుర్తును ఈసీ అజిత్ పవార్ వర్గానికే కేటాయించగా, సుప్రీంకోర్టు డిస్క్లైమర్ పెట్టాలన్న షరతుతో ఆమోదించింది. శరద్ పవార్ వర్గానికి ఎన్సీపీ శరద్ పవార్‌గా ప్రచారం చేసుకొనేందుకు అనుమతించింది. ఆయనకు కొమ్ముబూర గుర్తును తాత్కాలికంగా కేటాయించింది. గత ఎన్నికల్లో డిస్క్లైమర్ నిబంధనను అజిత్ పవార్ వర్గం యథేచ్ఛగా ఉల్లంఘించిందని శరద్ పవార్ వర్గం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురాగా, ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని తేలితే తామే సుమోటోగా చర్యలు చేపడతామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం అజిత్ పవార్ వర్గం ఎన్సీపీని హెచ్చరించింది. గడియారం గుర్తును ఎవరికీ కేటాయించకుండా ఉంచాలని, ఇద్దరికీ చెరో కొత్త గుర్తును కేటాయించాలని శరద్ పవార్ వర్గం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

- నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ, అక్టోబరు 24: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నాను నియమిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 51వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన నవంబరు 11న బాధ్యతలు చేపడుతారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ ప్రకటించారు. 2025 మే 13 వరకు అంటే సుమారు ఏడు నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ అయిన జస్టిస్ ఖన్నా పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సిఫారసు చేశారు. దానిని ఆమోదించిన కేంద్రం ఈ మేరు ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ ఖన్నా 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. పలు కీలక తీర్పులు వెలువరించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం స మాచార హక్కు చట్టం పరిధిలోకి వస్తుందని పేర్కొం టూ 2019లో రాజ్యాంగ ధర్మాసనం తరఫున తీర్పు రాశారు. అమీష్ దేవ్‌గన్ కేసులో విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ నిర్ణయాన్ని వెలువరించారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్టు నిర్మాణంలో చట్టపరంగా తగిన నిబంధనలు పాటించలేదంటూ అసమ్మతి తీర్పు రాసిన ఇద్దరు న్యాయమూర్తుల్లో ఆయన కూడా ఉన్నారు.ఈవీఎం-వీవీప్యాట్ రసీదుల లెక్కింపు కేసును విచారించిన ధర్మాసనంలోనూ ఆయన ఉన్నారు. వీవీప్యాట్ స్లిప్‌లను 100% మేర లెక్కించాలన్న వినతిని తిరస్కరిస్తూ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు.

శారదా పీఠానికి మరో షాక్

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వంలో నాటి టీటీడీ బోర్డు ఈ స్థలాన్ని క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోగా, సర్కారు యథాతథంగా ఆమోదించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను రద్దు చేసింది. 2007లో తిరుమలలో హిందూ మతానికి సంబంధించిన 31 మఠాలు, పీఠాలు, సత్రాలు తదితర ధార్మిక సంస్థలకు టీటీడీ స్థలాలు కేటాయించింది. విశాఖ శారదా పీఠానికి కూడా తిరుమల గోగర్భం డ్యామ్ సమీపంలో 5 వేల చదరపు అడుగుల స్థలాన్ని లీజుపై కేటాయించింది. అయితే ప్రారంభంలోనే శారదా పీఠం తమకు కేటాయించిన స్థలానికి మించి ఆక్రమించింది. అనుమతికి మించి కట్టడాలు కూడా నిర్మించింది. 2019 ప్రారంభంలో టీటీడీ అధికారులు 31 మఠాలు, సత్రాలకు గానూ కొన్నింటిలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విశాఖ శారదా పీఠం, శ్రీరంగనాథస్వామి మఠం, శ్రీ సిద్ధేశ్వరీ పీఠం-మౌనస్వామి మఠం కేటాయించిన దాని కంటే ఎక్కువగా టీటీడీ స్థలాలను ఆక్రమించినట్టు తేలింది. ఆయా మఠాలు తమ భవనాల వెనుక భాగంలో అదనంగా స్థలాలను ఆక్రమించడంతో పాటు ఆక్రమిత స్థలాల్లో అనుమతి లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. దీంతో టీటీడీ అధికారులు కొండపై ఉన్న మొత్తం 31 మఠాలు, సత్రాలలో పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టారు. విశాఖ శారదా పీఠం తనకు కేటాయించిన 5 వేల చదరపు అడుగులకు అదనంగా మరో 2,150 చదరపు అడుగులు ఆక్రమించినట్టు తేలింది. ఈ స్థలాన్ని టీటీడీ క్రమబద్ధీకరించే సమయానికి ఆశ్చర్యకరంగా 2150 చదరపు అడుగుల అదనపు స్థలం కాస్తా 20 వేల అడుగులకు పెరిగిపోయింది.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

తిరుమలలో విశాఖ శారదా పీఠం నిర్వాహకులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారు. 2007లో చేపట్టిన తొలి నిర్మాణంలోనే అడ్డగోలుగా వ్యవహరించారు. సెల్లార్ 1లో వాస్తవానికి టీటీడీ ఎలాంటి అనుమతీ ఇవ్వకపోయినా 272 చదరపు మీటర్లలో నిర్మాణాలు చేపట్టారు. సెల్లార్ 2లో 25 చదరపు మీటర్లలో నిర్మాణానికి అనుమతి ఇస్తే 334 చదరపు మీటర్లు అదనంగా నిర్మాణాలు చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 238 చదరపు మీటర్లలో నిర్మాణాలకు అనుమతి ఉండగా అంతకంటే 124 చదరపు మీటర్లలో అదనంగా కట్టడాలు చేపట్టారు. మొదటి అంతస్థులోనూ 238 చదరపు మీటర్లకు అనుమతి ఇవ్వగా, అదనంగా 124 చదరపు మీటర్లలో కట్టేశారు. రెండో అంతస్థులో కూడా అనుమతి ఇచ్చిన దానికి మించి 124 మీటర్లలో కట్టడాలున్నాయి. మూడో అంతస్థులో ఎలాంటి అనుమతి లేకపోయినా 182 చదరపు మీటర్లలో నిర్మాణాలున్నాయి. టీటీడీ ఈ భవనంలో మొత్తం 740 చదరపు మీటర్ల పరిధిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వగా, శారదా పీఠం నిర్వాహకులు మాత్రం 1905 చదరపు మీటర్లలో నిర్మాణాలు చేపట్టారు. అంటే.. అనుమతి ఇచ్చిన దానికంటే 1165 చ.మీటర్లు అదనంగా నిర్మాణాలు చేశారు. దానికి తోడు సెల్లార్ 1, మూడో అంతస్థ అక్రమంగా నిర్మించారు.

> **టీటీడీ తదుపరి చర్యలపై ఉత్కంఠ**
>
> తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో టీటీడీ తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. తిరుమలలో శారదా పీఠం నిర్వాహకులు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు ఏమవుతాయన్నది ప్రశ్నగా మారుతోంది. టీటీడీ కేటాయించిన దానికి మించి ఆక్రమించుకున్న స్థలంలో కట్టిన కట్టడాలను కూల్చి వేస్తుందా? పాత భవనంలో అనుమతి లేకుండా చేసిన అదనపు నిర్మాణాల విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుంది? అన్నది చర్చనీయాంశంగా మారింది.

భవన విస్తరణలోనూ అదే తీరు

2007లో నిర్మించిన తొలి భవనాన్ని విస్తరించే క్రమంలో 2023లో చేపట్టిన నిర్మాణాల్లోనూ అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టారు.మొత్తంగా 937 చదరపు మీటర్లకు ప్లాన్ అప్రూవల్స్ ఉండగా... 685 చదరపు మీటర్లు ఎక్కువగా మొత్తం 1622 చదరపు మీటర్లలో నిర్మాణాలు చేశారు. శారదా పీఠం ఆక్రమించుకున్న స్థలాన్ని రెగ్యులర్ చేయడం కోసం టీటీడీ అధికారులు 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వ ఒత్తిడితో నాటకీయంగా వ్యవహరించారు. స్థలాలు ఆక్రమించిన అన్ని మఠాలు, పీఠాలు, సత్రాలకు నోటీసులు జారీ చేశారు. సంబంధిత ఆక్రమణలు తొలగించాలని అందులో పేర్కొన్నారు. అయితే శారదా పీఠంతో పాటు మరో రెండు మఠాలు తప్ప మిగిలిన సత్రాలు, మఠాలు, పీఠాలు స్పందించలేదని అధికారులు బోర్డుకు నివేదించారు. శారదా పీఠం నిర్వాహకులు తాము ఆక్రమించుకున్న స్థలం తమ పీఠానికి తప్ప ఇతరులకు పనికి రాదని, జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆక్రమిత స్థలంలో భక్తుల కోసం నిత్యాన్నదాన భవనం నిర్మించామని చెబుతూ స్థలాన్ని క్రమబద్ధీకరించాలని కోరినట్టు అధికారులు బోర్డుకు నివేదించారు. ఎస్టేట్స్ కమిటీ కూడా ఇదే సిఫారసు చేయడంతో రూ.26 లక్షలు జరిమానా విధించి అప్పట్లో స్థలాన్ని క్రమబద్ధీకరించేశారు. వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన పనిచేసిన టీటీడీ బోర్డు కూడా విశాఖ శారదా పీఠానికి అనుకూలంగా కొన్ని తీర్మానాలు చేసింది. చివరగా భూమన కరుణాకర రెడ్డి అధ్యక్షతన పనిచేసిన బోర్డు శారదా పీఠానికి అదనపు స్థలం రెగ్యులర్ చేస్తూ (26-12-2023, తీర్మానం నంబరు 443) నిర్ణయం తీసుకుంది. దాన్ని అమలు చేయడంతో పాటు తమ చర్యలను ఆమోదించాలంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. వైసీపీ ప్రభుత్వం యథాతథంగా ఆమోదించేసింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు

కూటమి ప్రభుత్వం రాగానే టీటీడీలో పరిస్థితులను చక్కదిద్దడంపై దృష్టి సారించింది. దానికి తోడు తిరుపతికి చెందిన ఓంకార్ అనే వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. శారదా పీఠం ఆక్రమించుకున్న అదనపు స్థలాలను క్రమబద్ధీకరించిన విషయాన్ని గుర్తించిన టీటీడీ ఈవో శ్యామలరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత బోర్డు నిర్ణయాన్ని ర్యాటిఫై చేయడాన్ని తిరస్కరిస్తూ ఆ నిర్ణయాలను సర్కారు రద్దు చేసింది. ఈ విషయంలో నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని టీటీడీని ఆదేశించింది.

28లోగా రాజీనామా చెయ్యాల్సిందే

- ట్రూడోకు సొంత పార్టీ ఎంపీల అల్టిమేటం

న్యూఢిల్లీ/అట్టావా, అక్టోబరు 24: భారత్‌పై కయ్యానికి కాలు దువ్వుతున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీలోనే అసమ్మతి సెగ తగిలింది. ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని పలువురు లిబరల్ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ నెల 28లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని అల్టిమేటం ఇచ్చారు. బుధవారం నిర్వహించిన పార్టీ అంతర్గత భేటీలో అసమ్మతి సభ్యులు గళం విప్పారు. నేరుగా ట్రూడోపై తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్, సెప్టెంబరుల్లో జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో లిబరల్ పార్టీకి కంచుకోట వంటి రెండు నియోజకవర్గాలను కోల్పోయింది. ట్రూడో నాయకత్వంలో పార్టీ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని సర్వేలు కూడా సూచించాయి. ఈ పరిస్థితికి ట్రూడో వైఖరే కారణమని సమావేశంలో ఎంపీలు మండిపడ్డారు. ట్రూడో రాజీనామా చేయాలంటూ బ్రిటిష్ కొలంబియా ఎంపీ ప్యాట్రిక్ వీలర్ ప్రతిపాదించిన తీర్మానంపై మొత్తం 153 మంది లిబరల్ ఎంపీల్లో 24 మంది సంతకాలు చేశారని, ఈ నెల 28 వరకూ డెడ్‌లైన్ విధించినట్లు సీబీసీ న్యూస్ వర్గాలు తెలిపాయి.

భారత్‌కు కెనడా వెన్నుపోటు: సంజయ్ వర్మ

ఖలిస్థానీ తీవ్రవాదుల పట్ల కెనడా న్యాయ వ్యవస్థ అతి సున్నితంగా వ్యవహరిస్తూ వారికి తమ దేశంలో ఆశ్రయం కల్పిస్తోందని ఆ దేశం నుంచి వెనక్కు పిలిపించిన భారత రాయబారి సంజయ్ వర్మ విమర్శించారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినేలా కెనడా వ్యవహరించిందని, ట్రూడో నేతృత్వంలోని ఆ దేశం భారత్‌ను వెన్నుపోటు పొడిచిందన్నారు. ఖలిస్థానీలు మానవ అక్రమ రవాణాకు పాల్పడటంతో పాటు తమ అక్రమ వ్యాపారాల కోసం గురుద్వారాల ద్వారా నిధులు సేకరిస్తున్నారని ఆరోపించారు.

95 విమానాలకు బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబరు 24: విమానాలకు బాంబు బెదిరింపులు ఆగటం లేదు. గురువారం ఒక్కరోజే 95 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. వీటిలో ఇండిగో, ఎయిరిండియా, విస్తారా, స్పైస్‌జెట్, అలయెన్స్ ఎయిర్, ఆకాశ ఎయిర్ కంపెనీలకు చెందిన విమానాలున్నాయి. నాలుగు విమానాలు హైదరాబాద్ నుంచి రాకపోకలకు సంబంధించినవి. వీటితో కలిపి గత 11 రోజుల్లో మొత్తం 250కిపైగా విమానాలకు ఈ రకమైన హెచ్చరికలు వచ్చినట్లు తేలుతోంది. ఇవన్నీ కూడా దాదాపుగా సోషల్ మీడియా వేదికలుగానే వస్తున్నాయి. అన్నీ ఒట్టివేనని రుజువుతున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో ఢిల్లీ, ముంబైల్లో పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. కాగా.. బెదిరింపుల వల్ల తమ విమానాలను వేటినీ మళ్లించలేదని ఎయిరిండియా అధికారి ఒకరు తెలిపారు. కాగా, విమానాలకు పెరుగుతున్న బెదిరింపు ఘటనలపై అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బెదిరింపుల నేపథ్యంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికలైన ఎక్స్, మెటా (ఫేస్‌బుక్, వాట్సా‌ప్‌ల కంపెనీ)లను సంప్రదించింది. బెదిరింపులకు పాల్పడే వారి వివరాలను అందజేయాలని ఆ సంస్థలను కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కొందరిని గుర్తించామని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నాయి.

> **తిరుపతిలో నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపులు**
>
> తిరుపతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. గురువారం ఆయా హోటళ్లకు ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరుతో ఈమెయిళ్లు వచ్చాయి. స్థానిక పాయ్ వైస్రాయ్, రిగాలియా, రీనెస్ట్, రాజ్‌పార్కు హోటళ్లకు ఈ బెదిరింపులు రావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. రిగాలియాకు ఉదయం 11.56 గంటలకు, పాయ్ వైస్రాయ్‌కు సాయంత్రం 5.30, రీనెస్ట్‌కు 5.29 గంటలకు మెయిల్స్ వచ్చాయి. అప్రమత్తమైన రిగాలియా హోటల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి ఫిర్యాదు చేశారు. నాలుగు హోటళ్లలో పోలీసులు, బాంబ్, డాగ్ స్క్వాడ్ల సిబ్బంది తనిఖీలు చేపట్టారు. బాంబులు లేవని నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వయసు ధ్రువీకరణకు ఆధార్ సరైన పత్రం కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: వయసు ధ్రువీకరణకు ఆధార్ సరైన పత్రం కాదని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జువినైల్ జస్టిస్ చట్టం-2015లోని సెక్షన్ 94 ప్రకారం స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో పేర్కొన్న పుట్టిన తేదీనే ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి వయసును ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయించి, ఆ మేరకు నష్ట పరిహారాన్ని తగ్గిస్తూ పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి వయసును స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ ఆధారంగానే నిర్ణయించాల్సి ఉంటుందని కేసును విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం తెలిపింది. 2015లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.19.35 లక్షల పరిహారం ఇవ్వాలని రోహ్‌తక్‌లోని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసీటీ) ఆదేశించింది. స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ ఆధారంగా వయసు 45 ఏళ్లు అని నిర్ధారించి పరిహారాన్ని లెక్కించింది. ట్రిబ్యునల్ తీర్పుపై హైకోర్టులో అప్పీలు దాఖలు కాగా ఆధార్ కార్డు ఆధారంగా వయసు 47 ఏళ్లు అని లెక్కించి దానికి అనుగుణంగా పరిహారాన్ని రూ.9.22 లక్షలకు తగ్గించింది. దీనిపై మృతుని కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆధార్ ఆధారంగా వయసు లెక్కించడం సరికాదన్న ధర్మాసనం ట్రిబ్యునల్ తీర్పును సమర్థించింది.

కూల్చివేతల బాధితులు కోర్టుకెళ్లొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: ఆస్తుల కూల్చివేతల కారణంగా నష్టపోయిన బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని గురువారం సుప్రీంకోర్టు తెలిపింది. న్యాయస్థానం ఆదేశాలను కాదని ఆస్తులను కూల్చివేసిన రాష్ట్ర ప్రభుత్వాలపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టడానికి మాత్రం నిరాకరించింది. సుప్రీంకోర్టు అనుమతి లేకుండా ఇళ్లను కూల్చివేయొద్దన్న ఆదేశాలను ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ ప్రభుత్వాలు పాటించలేదని, వాటిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ పి.కె.మిశ్ర, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం పరిశీలించింది. బాధితులు కాకుండా వేరే వ్యక్తి ఈ పిటిషన్ వేయడంతో స్వీకరించడానికి నిరాకరించింది. బాధితులు స్వయంగా కోర్టుకు రావచ్చని, ధర్మాసనాలు వాటిపై విచారణ జరుపుతాయని పేర్కొంది.


సింబెక్స్-2024 విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధనౌక

విశాఖలో 'సింబెక్స్-2024' ప్రారంభం

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత్, సింగపూర్ నేవీ దళాలు పాలుపంచుకొనే 'సింగపూర్-ఇండియా మేరిటైమ్ బైలేటరల్ ఎక్సర్‌సైజ్ (సింబెక్స్)-2024' కార్యక్రమం గురువారం విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళంలో ప్రారంభమైంది. ఈనెల 29వ తేదీ వరకు రెండు దేశాలు సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయి. శుక్రవారం వరకు హార్బర్‌లో, 26 నుంచి 29వ తేదీ వరకు సముద్రంలో.. రెండు దశల్లో కార్యక్రమాలు జరుగుతాయి. రెండు దేశాల మధ్య మరింత సహకారం, తీర ప్రాంత రక్షణపై అవగాహన, సముద్ర జలాల పరిరక్షణలో ఉమ్మడి సవాళ్లపై ఈ ఏడాది చర్చించాలని నిర్ణయించారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ శివాలిక్'పై నిర్వహించారు. భారత నౌకాదళం, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ అధికారులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో ప్రబలిన అతిసారం

▸▸ ఇద్దరు మృతి, 14 మందికి అస్వస్థత


దాచేపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితులు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సిరి

దాచేపల్లి/నరసరావుపేట/అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీలో అతిసారం ప్రబలింది. కాలనీలో రెండు రోజులుగా 16 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు(21) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పక్షవాతంతో బాధపడుతున్న బండారు చిన వీరయ్య(63) ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వ్యాధి తీవ్రత అధికంగా ఉండటంతో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అతిసారానికి కారణం కలుషిత తాగు నీరేనని ప్రాథమికంగా అధికారులు తేల్చారు. తాగు నీటి పైపు లైన్లు మురుగు కాలువలో ఉండటం వల్ల నీరు కలుషితమై ఉండవచ్చని భావిస్తున్నారు. తాగునీరు రంగు మారి, వాసన వస్తున్నట్టు నిర్ధారించారు. ఇద్దరు మృతి చెందడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందజేస్తున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి నేతృత్వంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ శిరి గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. కలెక్టర్ అరుణ్ బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో పరిస్థితిని సమీక్షించారు.

మంత్రి నారాయణ సమీక్ష

అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందిన ఘటనపై మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్షించారు. తాగునీటిని ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపాలని అధికారులను ఆదేశించారు. బోర్లను మూసి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. సాధారణ పరిస్థితి వచ్చే వరకు మున్సిపల్, వైద్యఆరోగ్య శాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి: గొట్టిపాటి ఆదేశం

దాచేపల్లిలో అతిసారంతో ఇద్దరు మృతి చెందడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. విస్తృతంగా వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత ప్రాంతాల్లో క్లోరినేషన్ ముమ్మరం చేయాలని, డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

దర్యాప్తునకు సహకరించండి

పెద్దారెడ్డి, ఆయన కుమారులకు హైకోర్టు ఆదేశం
వివరాలు సమర్పించాలని పోలీసులకు నిర్దేశం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసులు నమోదు చేసిన మూడు కేసుల్లో దర్యాప్తునకు సహకరించాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి తదితరులను హైకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లపై వివరాలు సమర్పించాలని పోలీసులను నిర్దేశించింది. తదుపరి విచారణ వరకు వారిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. విచారణను నవంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన కుమారులు, వైసీపీ నాయకులు ఈ ఏడాది మే 14న తమపై రాళ్లతో, మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారని తాడిపత్రి పట్టణం రాగితోటపాలెంకు చెందిన కోర్నపల్లి చిన్న సంజన్న ఈ నెల 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు తమపైనా పెద్దారెడ్డి, ఆయన కుమారులు దాడి చేశారంటూ కానాల రవీంద్రరెడ్డి, షేక్ సాదక్ వలీ రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు పంపారు. వీటి ఆధారంగా పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పెద్దారెడ్డి బృందం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా.. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఇవే కేసుల్లో నిందితులుగా ఉన్న మరికొందరిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

కాలినడకన తిరుమలకు నందమూరి రామకృష్ణ



తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ గురువారం కాలినడకన తిరుమలకు వచ్చారు. చంద్రబాబు సీఎం కావాలని గతంలో ఆయన మొక్కుకున్నారు. ఆ మొక్కు చెల్లించుకునేందుకు గురువారం మధ్యాహ్నం తిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఏనుగు దాడిలో వృద్ధుడు మృతి

పార్వతీపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పెద బొండపల్లికి చెందిన దేవాబత్తుల యాకోబు(74) గురువారం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఏనుగులు దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలైన ఆయన్ని గ్రామస్థులు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'బ్రిక్స్' వేదికగా...

ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మూడోవంతు వాటా ఉన్న 'బ్రిక్స్' కూటమి తన పదహారవ శిఖరాగ్ర సదస్సును దిగ్విజయంగా జరుపుకుంది. ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తున్నందుకు అంతర్జాతీయ న్యాయస్థానం జారీ చేసిన అరెస్టువారెంట్ కారణంగా గత ఏడాది బ్రిక్స్ సదస్సుకు గైర్హాజరైన రష్యా అధ్యక్షుడు ఈ ఏడాది సదస్సును స్వదేశంలో ఘనంగా నిర్వహించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో పాటుగా, ఈజిప్ట్, ఇరాన్, ఇథియోపియా, అరబ్ ఎమిరేట్స్ వచ్చిచేరడంతో ఈ కూటమి ఇప్పుడు 'బ్రిక్స్ ప్లస్'గా మరింత బలపడిన విషయం తెలిసిందే. దాదాపు ముప్పై ఆరుదేశాలు ఈ సదస్సులో వివిధ రూపాల్లో, పాత్రల్లో భాగస్వాములు కావడం బ్రిక్స్ పట్ల దక్షిణాది దేశాలకు ఉన్న నమ్మకానికి ఉన్న నిదర్శనమని విశ్లేషకుల అభిప్రాయం. రష్యాతో పాశ్చాత్యదేశాల వైరం పతాకస్థాయిలో ఉన్న కాలంలో, అది ఆతిథ్యమిస్తున్న ఓ సదస్సు విజయవంతం కావడం ఆదేశం పట్ల ఉన్న విశ్వాసాన్ని తెలియచెబుతోందన్నది మరో అభిప్రాయం. మిగతాదేశాల సంగతి అటుంచితే, బ్రిక్స్ సదస్సు మనకు మాత్రం బాగానే ఉపకరించింది. పుతిన్ చొరవ, మధ్యవర్తిత్వం వల్ల ఐదేళ్ళుగా రగులుతున్న ఇండియా–చైనా సరిహద్దులు కాస్తంత శాంతించబోతున్నాయి. ఇంతకాలానికి ఉభయ దేశాధినేతలు నవ్వుమొఖంతో కనిపించడం, కరచాలనం చేసుకోవడం, ఓ నలభైఐదునిముషాల పాటు ఎదురెదురుగా కూర్చొని చర్చోపచర్చలు చేసుకోవడం స్వాగతించవలసిన పరిణామమే.

ఈ సయోధ్య ఎంతకాలం అన్న ప్రశ్న అటుంచితే, ఘర్షణలు, ఉద్రిక్తతలు లేని స్థితి ముందుముందు కనీసం కొంతకాలం ఉండబోతోంది. ఎవరు రాజీపడ్డారో, మెట్టు ఎక్కిందెవరో, దిగిందెవరో పూర్తివివరాలు వెలువడితే తప్ప తెలియదు కానీ, ఎల్‌ఏసీ వెంబడి పూర్వపరిస్థితులను పూర్తిగా పునరుద్ధరించబోతున్న మాట మట్టుకు ఇంపుగానే ఉంది. పెట్రోలింగ్ పాయింట్లన్నీ చేతికి వచ్చి, సైనిక ప్రతిష్టంభన పూర్తిగా తొలగిపోయి, ఎవరికివారు వెనకడుగువేసే ఈ ఒప్పందాన్ని రెండు దేశాలూ చరిత్రాత్మకంగానే అభివర్ణిస్తున్నాయి. ఒప్పందానికి ఆమోదముద్రవేయడంతో పాటు, రాబోయేరోజుల్లో ఉభయదేశాలు ఎంత చక్కగా, పరస్పర విశ్వాసంతో, సయోధ్యతో మెలగాలో కూడా దేశాధినేతలు సంకల్పం చెప్పుకున్నారు. మోదీ–జిన్‌పింగ్ చేతులు కలిపిన ఆ దృశ్యం చూసినప్పుడు చాలామందికి ఐదేళ్ళక్రితం మహాబలిపురంలో వారి వ్యాహ్యాళి, ఉయ్యాలలూగిన దృశ్యాలు గుర్తుకొచ్చాయి. ఈ అనుబంధం, ఆత్మీయత బూటకమా, వ్యూహాత్మకమా అన్న మీమాంస అటుంచితే, ప్రస్తుత ప్రపంచ పరిణామాల నేపథ్యంలో, ఇది తాత్కాలికమే అయినప్పటికీ స్వాగతించవలసిన మార్పే. నలభైఐదు నిముషాల పాటు ఇద్దరు దేశాధినేతలు విస్తృతమైన ప్రతినిధి బృందాలతో సహా చర్చల్లో కూర్చోవడం విశేషమైన పరిణామం. రష్యా, చైనా అధ్యక్షులు తన పక్కన ఉండగా భారతప్రధాని థంబ్స్ అప్ ప్రదర్శన మారిన వాతావరణానికీ, మూడుదేశాల మధ్యా పెరిగిన సయోధ్య సమన్వయాలకు నిదర్శనం. మోదీ చూపిన ఆ బొటనవేలు అమెరికా, కెనడాలను ఉద్దేశించినది కావచ్చునని కొందరు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. సదస్సు యావత్తూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెరోవైపునా భారత ప్రధాని, చైనా అధ్యక్షుడు కనిపిస్తూ వచ్చారు. ఇక, భారత్ రష్యా సంబంధాలమీద పుతిన్ ప్రశంసనీయమైన వ్యాఖ్యలు చేశారు. అనువాదం అక్కరలేదని, తాను చెబుతున్నదేమిటో భారత ప్రధానికి అర్థమయ్యే స్థాయిలో రెండుదేశాల మధ్యా సాన్నిహిత్యం ఉన్నదని పుతిన్ వ్యాఖ్యానించడం బాగుంది. కొన్ని సందర్భాల్లో ఇటువంటి అతిశయోక్తులు కూడా ఆత్మీయతలను సూచిస్తాయి. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి ప్రధాని మోదీ గతంలో కంటే ఎంతో స్వేచ్ఛగా వ్యాఖ్యానించడానికి ఈ వాతావరణం దోహదం చేసింది. ఇరాన్ తోనూ, దాని మద్దతున్న హమాస్, హిజ్బొల్లాలతోనూ ఇజ్రాయెల్ యుద్ధంలో ఉన్న తరుణంలో ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో మోదీ భేటీ కావడం ఓ విచిత్రమైన దృశ్యం. కజాన్ సదస్సుతో బ్రిక్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చింది. బహుళధ్రువ ప్రపంచం ఆకాంక్షలకు అనుగుణంగా సదస్సు సాగిందని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడం మిగతా ప్రపంచానికి, మరీ ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌కు మేలుచేస్తుందని మనం మరోమారు గట్టిగా చెప్పుకోగలిగాం.

'లడ్కీ బహిన్' గెలుపు గుర్రమేనా?

వచ్చే నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఆ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పుడు మహారాష్ట్రలోను, విశాల భారతదేశంలోను ప్రజల పిచ్చాపాటీలో రెండు మాటలు ప్రధానంగా వినపడుతున్నాయి. అవి: 'లడ్కీ బహిన్'. అది ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలుపరుస్తున్న 'సంక్షేమ' పథకం. దాని కింద సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది: గత ఆగస్టు నుంచి రెండు కోట్ల మందికి పైగా మహిళల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్న డబ్బు పాలక మహాయుతి కూటమి ప్రభుత్వంపై ప్రబలంగా ఉన్న ప్రజా వ్యతిరేకతను తొలగించగలదా?

రాష్ట్రాలలో గానివ్వండి లేదా కేంద్రంలో గానివ్వండి అధికారంలో ఉన్న ఏ పార్టీ ప్రభుత్వమైనా ఎన్నికల ముందు నిర్దిష్ట సామాజిక సమూహాలకు నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. అయితే ఇందుకు ముందెన్నడూ ఇంత హఠాత్తుగా, నిస్సిగ్గుగా, ఆర్థిక పర్యవసానాలను పట్టించుకోకుండా ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం జరగలేదు. నవంబర్ 20న తమ ఓటు వేసేనాటికి లడ్కీ బహిన్ లబ్ధిదారులు అయిన మహిళల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందు చివరి నిమిషంలో ప్రకటించారు)తో సహా రూ.7500 జమ అవుతాయి. ఈ ఉదార ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలసరిన ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మరి మహారాష్ట్ర ప్రభుత్వ రుణ భారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా. ఎన్నికల ముందు మహాయుతి ప్రభుత్వ 'టిజోరి ఖోలో' (ప్రభుత్వ ఖజానాను తెరువడం) రాజకీయాల మూలంగా ఆ రుణ భారం మరింతగా పెరగనున్నదని సీనియర్ బ్యూరాక్రాట్ ఒకరు అన్నారు.

లడ్కీ బహిన్ యోజనను మూడు విధాలుగా చూడవచ్చు. ఒకటి– ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాడీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయం. 2024 లోక్‌సభ ఎన్నికలలో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా కీలక ఓటర్ల బృందాలను ఆకట్టుకోవడానికై కొత్త మార్గాలను అనుసరించేందుకు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి అనివార్యమయింది. మహిళలు, యువత లక్షిత ఓటు బ్యాంకులు కదా. మహిళలకు లడ్కీ బహిన్ పేరిట నేరుగా నగదు సహాయం అందించేందుకు, ఆర్థిక తోడ్పాటు అవసరమైన నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అనే నినాదంతో గణనీయమైన విజయాలు సాధించగా ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల



ముంబై మురికివాడ నివాసి (లడ్కీ బహిన్ లబ్ధిదారు) అయిన ఒక మహిళ నిర్మొహమాటంగా ఇలా అన్నారు: 'నేను ఎవరికి ఓటు వేసినా, అధికారంలోకి ఎవరు వచ్చినా ఏ ప్రభుత్వమూ ఇప్పుడు లడ్కీ బహిన్ పథకాన్ని ఆపలేదు'. ఇటువంటి ఓటర్లు జిత్తులమారి స్వభావం గలవారని నేతలు అనుకోవచ్చుగాక! మరి ఓటర్లు ఒక ఆకు ఎక్కువే చదివినవారే కాదూ? అంతిమంగా నేతలను వారు తప్పక కంగుతినిపిస్తారు, సందేహం లేదు.

ప్రధాన ప్రచారాంశంగా చేయడంలో కనీసం తాత్కాలికంగా సఫలమయింది.

పై దృక్కోణానికి ప్రత్యామ్నాయంగా లడ్కీ బహిన్‌ను పూర్తిగా అనైతిక పద్ధతులలోనైనా సరే అధికారాన్ని కైవసం చేసుకోవడమే ధ్యేయమైన క్షుద్ర రాజకీయాలకు చిహ్నంగా చూసితీరాలి. ఇదే అందరినీ అమితంగా వ్యాకులపరుస్తున్న పరిణామం. గత ఐదేళ్లుగా మహారాష్ట్ర దేశంలోనే ఎక్కడా లేని రీతిలో రాజకీయ అస్థిరత్వంతో కుదేలైపోతోంది. ఈ ఐదేళ్లలో మూడు ప్రభుత్వాలు మారాయి. ఒక ముఖ్యమంత్రిని తెల్లవారుజామున గుట్టు చప్పుడు కాకుండా ప్రమాణ స్వీకారం చేయించారు. రెండు ప్రాంతీయ పార్టీలు చీలిపోయాయి. ధనరాశుల, మంత్రి పదవుల ప్రలోభంతో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. భారత రాజకీయాల సంపూర్ణ నైతిక పతనానికి మహారాష్ట్ర అద్దం పట్టింది. 'వాషింగ్ మెషీన్', 'ఖోఖె చి సర్కార్' (ఒక 'ఖోఖా' ఒక కోటికి సమానం) అనేవి ఇప్పుడు మహారాష్ట్రీయుల రాజకీయ పరిభాషలో అంతర్భాగంగా ఉన్నాయి. ధన బలం, రహస్య బేరసారాలు, ఒప్పందాలు రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా భ్రష్టపరిచాయి. భావజాలం ఏదైతేనేమి రాష్ట్ర శాసనసభ్యులలో మూడోవంతు మంది గత 15 ఏళ్లలో ఒకటి కంటే ఎక్కువ పార్టీలలో ఉన్నవారే!



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

లడ్కీ బహిన్ లాంటి నగదు సహాయం పథకాలను స్పర్థాత్మక 'రేవడి' రాజకీయాలుగా చూడడం మూడో దృక్కోణం (ఇదే చాలా తార్కికమైనది). ఇవి, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర హానికరమైనవి అనవచ్చు. అనడమేమిటి, అలా నిరూపితమయ్యాయి కూడా. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉచితాల సంస్కృతికి వ్యతిరేకంగా ఓటర్లను హెచ్చరించారు. రాజకీయ పార్టీలు వాగ్దానం చేస్తున్న ఉచితాలు దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా ప్రమాదకరమైనవి అని ఆయన స్పష్టం చేశారు 'రేవడి' సంస్కృతిని పెంచుతున్నవారు ప్రజలకు ఉచిత కానుకలు పంపిణీ చేయడం ద్వారా వారిని తమ స్వప్రయోజనాలకు కొనుగోలు చేసుకోవచ్చని విశ్వసిస్తున్నారని మోదీ గర్హించారు. 'మనమందరమూ సమైక్యంగా ఇటువంటి ఆలోచనలను అరికట్టాలి. దేశ రాజకీయాల నుంచి రేవడి సంస్కృతిని తొలగించాల్సిన అవసరం జరూరుగా ఉందని' ప్రధాన మంత్రి ఘోషించారు.

అదే సందర్భంలో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నగదు హామీలను, ఢిల్లీ, పంజాబ్‌లలో ఉచిత విద్యుత్తు, నీరు సమకూరుస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి తీవ్రంగా విమర్శించారు. రెండు సంవత్సరాలు గడిచేసరికి ఇప్పుడు మహారాష్ట్రలో పాలక కూటమిలో ఉన్న బీజేపీ లడ్కీ బహిన్ పథకానికి చొరవ తీసుకున్నది తామేనని గొప్పగా చాటుకుంటోంది. దాని ద్వారా అందే నగదు సహాయం మహారాష్ట్ర మహిళలకు ఆర్థిక సాధికారత సమకూరుస్తుందని బీజేపీ శ్రేణులు వాదిస్తున్నాయి. ఓటర్లకు లంచాలు ఇవ్వడం, వారికి సాధికారత కల్పించడం మధ్య ఉన్న విభజన రేఖ చాలా పలుచన. ముఖ్యంగా ఒకటి రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అటువంటి పథకాలను ప్రవేశ పెడుతున్న రాజకీయ పార్టీలకు ప్రజలకు ఆర్థిక సాధికారత కల్పించడంలో చిత్తశుద్ధి ఉన్నదని భావించగలమా?

నగదు ఆధారిత సంక్షేమ పథకాలకు ముఖ్యంగా మహిళా ఓటర్లు ఒక కీలక ఓటు బ్యాంకుగా ఉన్నారు. 2023లో మధ్యప్రదేశ్‌లో శివరాజ్ చౌహాన్ తన లడ్లీ బెహనా పథకంతో బీజేపీకి విజయం సాధించారు. ఇప్పుడు మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా నగదు ప్రయోజనాలను అందిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో దేశ వ్యాప్తంగా ప్రతి పేద మహిళ బ్యాంకు ఖాతాలో ఏడాదికి రూ. ఒక లక్ష జమ చేస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. 'మీరు దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారైతే ప్రతి సంవత్సరమూ మీకు రూ. ఒక లక్ష 'ఖటాకట్ ఖటాఖట్ ఆతా రహేగా' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభయమిచ్చారు.

రాహుల్ గాంధీ 'ఖటాఖట్' హామీలు బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ అని బీజేపీ దుయ్యబట్టింది. ఆయన హామీలు అవాస్తవికమైనవని ఆధిక్షేపించింది. మరి అదే బీజేపీ, ఇప్పుడు షిండే సర్కార్ 'ఫటా ఫట్' నగదు బదిలీని ఒక 'రాజకీయ గేమ్ చేంజర్'గా అభినందిస్తోంది. ఎంత నయవంచన! ఉచితాల సంస్కృతి సామాజిక–ఆర్థిక పర్యవసానాలు ప్రశ్నించదగినవి. కార్పొరేట్ కంపెనీల వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను రద్దు చేస్తున్న ప్రభుత్వం అన్నదాతలు అయిన రైతుల పంట రుణాలను మాఫీ చేసేందుకు వెనుకాడడమేమిటి? కష్టకాలంలో పేద మహిళలకు ఆదాయ మద్దతు సమకూర్చడంలో తప్పేమిటి? అసలు సమస్యేమిటంటే ప్రభుత్వ ప్రాథమ్యాలు సరైన విధంగా లేకపోవడమే. నిజమేమిటంటే మహారాష్ట్రలో నగదు సహాయ పథకాన్ని సుపరిపాలన లోటుకు నష్టపరిహారంగా ఉద్దేశించారన్నది ఒక చేదు సత్యం. ఐదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు విద్యా ప్రమాణాలు, ఆరోగ్యభద్రతా సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిధులు సక్రమంగా వినియోగించకుండా ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వాలు గెలవ కష్టసాధ్యమైన ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రత్యక్ష నగదు ప్రయోజనాలను సమకూర్చేందుకు సిద్ధమవుతున్నాయి. నెరవేర్చని హామీలకు గాను ఇటువంటి లబ్ధిని కల్పించి ఎన్నికలలో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇదెలాంటి సుపరిపాలన?

ఓటర్లు సైతం పోటీ చేస్తున్న అభ్యర్థులతో, (వారి నుంచి మరింత ఆర్థిక లబ్ధి పొందేందుకు) బేరసారాలు చేయడంలో అంతకంతకూ ఆరితేరిపోతున్నారు. ఒక నిర్దిష్ట పార్టీ అభ్యర్థి గెలిచిన అనంతరం తన పార్టీకి విధేయంగా ఉంటాడనే నమ్మకం లేనప్పుడు ఓటర్లు ఆ నేతకు ఓటు వేయాల్సిన అగత్యమేమిటి? అంతకంటే ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికే ఓటు వేయడం మేలు కదా అనే ఆలోచనలో ఓటర్లు ఉన్నారు. ముంబై మురికివాడ నివాసి (లడ్కీ బహిన్ లబ్ధిదారు) అయిన ఒక మహిళ నిర్మొహమాటంగా నాతో ఇలా అన్నారు: 'నేను ఎవరికి ఓటు వేసినా, అధికారంలోకి ఎవరు వచ్చినా ఏ ప్రభుత్వమూ ఇప్పుడు లడ్కీ బహిన్ పథకాన్ని ఆపలేదు'. ఇటువంటి ఓటర్లు జిత్తులమారి స్వభావం గలవారని నేతలు అనుకోవచ్చుగాక! మరి ఓటర్లు ఒక ఆకు ఎక్కువే చదివినవారే కాదూ? అంతిమంగా నేతలను వారు తప్పక కంగుతినిపిస్తారు, సందేహం లేదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఉద్యోగ శిక్షణతో యువత సాధికారత

భారత్‌లోని ఒక తృతీయ శ్రేణి నగరంలో– రాష్ట్ర విశ్వవిద్యాలయానికి చెందిన కళాశాల నుంచి రీనా అనే అమ్మాయి కామర్స్‌లో డిగ్రీ చేసింది. ఆమె చదువుకున్న కాలేజీలో ప్లేస్‌మెంట్ సెల్ లేదు. విద్యార్థినిగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచినప్పటికీ చదువు పూర్తయిన తర్వాత ఆమెకు లభించే అవకాశాలు స్వల్పం. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధం కావడం, ఇరుగుపొరుగున ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేయడం (దీనిపై ఆమెకు ఆసక్తి ఉండవచ్చు, లేకపోవచ్చు) లేదా పెళ్లి చేసుకోవడం లాంటి వాటికి ఆమె పరిమితమైపోతుంది. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న యువతలో మూడింట ఒక వంతు మంది (15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్నవారు. వీరిలో సగానికి కంటే ఎక్కువ మంది అమ్మాయిలే) చదువు, ఉద్యోగం, శిక్షణకు దూరంగా ఉన్నారు. ఇప్పటికీ మన దేశంలోని యువత అధిక భాగం ప్రైవేటు సంస్థల్లో నియామకాలకు అందనంత దూరంలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే ప్రారంభించిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకం(పీఎంఐఎస్) మార్కెట్ –ఆధారిత, యువత–కేంద్రీకృత పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది యువత సాధికారతను సాధించేందుకు ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది.



రానున్న ఏఐ యుగంలో విద్య నుంచి ఉపాధి వరకు పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కీలకంగా మారనుంది. పనిచేస్తూనే చదువుకునే, నేర్చుకునే అవకాశాన్ని ప్రతి ఒక్కరికీ ఈ విధానం కల్పిస్తుంది. జీవనసరళిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెంచుకునే నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలను నిర్ణయిస్తాయి. భారతీయ యువతలో నైపుణ్యం పెంచడం, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం, వారి జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా ఉన్న ఈ పథకాన్ని విజయవంతం చేసే దిశగా, మొదటి నుంచీ కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నాయి.

నిర్దేశిత వయసుకు చెందిన కొంతమంది యువతకు 500 కంపెనీల్లో 12 నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు పీఎంఐఎస్ అవకాశాన్ని కల్పిస్తోంది. 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు, అల్పాదాయ కుటుంబాలకు చెందినవారు, మెట్రిక్యులేషన్ నుంచి గ్రాడ్యుయేషన్ (ఐఐటీ గ్రాడ్యుయేట్లు, సీఏలు తదితరులను మినహాయించి) పూర్తి చేసినవారు ఈ పథకానికి అర్హులు. దీని ద్వారా నెలకు రూ.5000 స్టైపెండ్ లభిస్తుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం (రూ.4,500), సంబంధిత సంస్థ (రూ.500) సంయుక్తంగా అందిస్తాయి. అలాగే ఇతర ఖర్చుల కోసం అదనంగా మరో రూ.6,000 లభిస్తుంది. ప్రయోగాత్మక దశలో భాగంగా 2024 ఏడాదికి గాను 1.25 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చాలని, అయిదేళ్లలో కోటి మందికి ఇంటర్న్‌షిప్ అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీని కోసం సంస్థలు తమ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులను ఖర్చు చేసుకోవచ్చు.

ఇంటర్న్‌షిప్ – ఇటు ఉద్యోగార్థులకూ, అటు యాజమాన్యాలకూ పరస్పర ప్రయోజనాన్ని కలిగించేదిగా అనేక అధ్యయనాల్లో తేలింది. పని ఆధారిత అభ్యాస ప్రాధాన్యాన్ని విద్యా పరిశోధకులు, ఆ రంగానికి చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారు. డేవిడ్ కోల్బ్, జాన్ డ్యూయి, కర్ట్ లూయిస్ సహా పలువురు పండితులు ఈ అంశంపై విస్తృతంగా అధ్యయనం చేశారు. పనిచేస్తూ నేర్చుకోవడం శ్రామికశక్తిని తయారు చేయడానికి ఉపకరించే ముఖ్య సాధనంగా అంతర్జాతీయ పరిశోధనల్లో తేలింది. భావవ్యక్తీకరణ, సహకారం, సృజనాత్మకత, నిర్ణయాత్మక ఆలోచనలను ఇంటర్న్‌షిప్‌లు మెరుగుపరుస్తాయి.

పీఎంఐఎస్ ద్వారా లభించే ఇంటర్న్‌షిప్– ఒక అవకాశాన్ని కల్పించేదిగా మాత్రమే కాకుండా, యువ ఔత్సాహికుల్లో గొప్ప మార్పును తెస్తుంది. కార్పొరేట్ ప్రపంచంలోని వాస్తవ పని విధానం అనుభవంలోకి వస్తుంది. ఇందుకు భిన్నంగా కళాశాలల్లో విద్యా బోధన నిర్మాణాత్మకంగానూ, స్థిరంగానూ ఉంటుంది. ఇంటర్న్‌షిప్ ద్వారా వారికి సరిపోయే కెరీర్ మార్గాన్ని గుర్తించి, అభివృద్ధి చేయడంతో పాటు బాధ్యతల నిర్వహణ, సమస్య–పరిష్కారం, నిర్ణయం తీసుకోవడం, సంఘటితంగా పనిచేయడం, సమయపాలనలో సైతం శిక్షణ పొందవచ్చు. ప్రతిభ, నిజాయితీ, అంకితభావం ఉన్నా, చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చేవారు ఉద్యోగాల్లో ప్రవేశించడానికి తొలినాళ్లలో పడే ఇబ్బందులను ఇంటర్న్‌షిప్‌లు తొలగిస్తాయి. ఇంగ్లీషులో సంభాషణా నైపుణ్యాలు, ఈ–మెయిల్ సంప్రదాయాలు, కంప్యూటర్ ఉపయోగించడం, ఎంఎస్ ఆఫీస్‌లో ప్రావీణ్యం లేదా ఇంటర్నెట్‌లో విశ్వసనీయ సమాచారాన్ని శోధించే ప్రాథమిక నైపుణ్యాలను వారు నేర్చుకుంటారు. భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, వృత్తిపరమైన కోర్సుల్లో ప్రవేశించేందుకు ఇంటర్న్‌షిప్ చేయడం తప్పనిసరి. కానీ కొన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, అంతగా ప్రాధాన్యం లేని కళాశాలల్లో కెరీర్ కౌన్సెలింగ్, జాబ్– ఆధారిత వ్యవస్థ లేకపోవడం వల్ల ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం ఎక్కువ శాతం యువతకు దక్కడం లేదు. పీఎంఐఎస్ ద్వారా పెద్ద మొత్తంలో లభించే ఇంటర్న్‌షిప్ సదుపాయాలు మెట్రోయేతర నగరాల్లోని యువతకు సమాన అవకాశాలు అందేలా చేసి ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తాయి. వ్యక్తిగతంగా, కొత్తగా లభించిన ఆర్థిక స్వేచ్ఛ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మరింత మెరుగ్గా పనిచేసేలా, ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు యువతకు స్ఫూర్తిని అందిస్తుంది.

అభ్యర్థికి దీర్ఘకాలిక ఉద్యోగ అవకాశాన్ని కల్పించే విషయంలో అతని నైపుణ్యాలను పరీక్షించడానికి యాజమాన్యాలకు తక్కువ ఖర్చుతో చేసే ప్రయోగమే కాకుండా, ఇంటర్న్‌షిప్ నైపుణ్యాల అంతరాన్ని తగ్గిస్తుంది. సీఎస్ఆర్ లక్ష్యాన్ని కూడా అవి అధిగమించగలుగుతాయి. 12 నెలల పాటు ఇంటర్న్‌కు సంబంధించిన ఐక్యూ, ఈక్యూలను గమనించే అవకాశం వాటికి దక్కుతుంది. 'స్వభావం ఆధారంగా ఉద్యోగం ఇవ్వడం, నైపుణ్యాల కోసం శిక్షణ ఇవ్వడం' అనే వ్యూహాన్ని సంస్థ అమలు చేసుకోవచ్చు.

ఆర్థిక వ్యవస్థ విస్తరణకు, జాతీయ విద్యా విధానం–2020కు అనుగుణంగా పీఎంఐఎస్ ఉంది. యువతకు ఉపాధి, వెనుకబడిన నేపథ్యాలకు చెందిన వారికి సమాన అవకాశాలను వేగంగా అందించే చర్యగా దీన్ని పేర్కొనవచ్చు. యువతకు విద్యానంతర శిక్షణాలయంగా వ్యవహరిస్తూ, 'నైపుణ్య రహిత ఉపాధి' వల్ల ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టాన్ని తగ్గించడంలో ఈ ఇంటర్న్‌షిప్ దోహదపడుతుంది. రానున్న ఏఐ యుగంలో విద్య నుంచి ఉపాధి వరకు ఈ విధానం కీలకంగా మారనుంది. జీవనసరళిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెంచుకునే నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలను నిర్ణయిస్తాయి. దీర్ఘకాలంలో ఉత్పాదక రంగంలో మూలధన–కార్మిక నిష్పత్తిని సైతం ఇది ప్రభావితం చేస్తుంది.

పెద్ద సంఖ్యలో ఇంటర్న్‌లకు సంస్థల్లో అవకాశాలు కల్పించడం, అగ్రశ్రేణికి చెందిన 500 సంస్థల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన యువతను నియమించడం, సంస్థ ఉన్న ప్రదేశానికి మారాల్సి వస్తే స్టైఫండ్ సరిపోకపోవడం లాంటి వాస్తవిక సవాళ్లు ఇందులో ఉన్నాయి. రిమోట్ తరహా పని విధానం, నాన్–మెట్రో కార్యాలయాలు, పరిశ్రమల్లో నియామకాలు, సంస్థలు స్టైపెండ్ పెంచడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

విస్తృత ప్రచారం, కచ్చితమైన అమలు ద్వారా ఉపాధి కల్పనలో పీఎంఐఎస్ ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. భారత్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇది లక్ష్యాలను నిర్దేశించుకుంటుంది. భారతీయ యువతలో నైపుణ్యం పెంచడం, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం, వారి జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా ఉన్న ఈ పథకాన్ని విజయవంతం చేసే దిశగా, ప్రారంభం నాటి నుంచీ కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నాయి.

• వి. అనంత నాగేశ్వరన్
భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు

• దీక్షా సుప్యాల్ బిష్ట్
ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ అధికారిణి

వ్యాపార నిపుణతలో విలువల నిబద్ధత

రతన్ టాటాతో మా మొదటి సంకర్షణ (Interaction) సంతోషదాయకమైనది కాదు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతుంటే నిర్మలమైన గాలి పౌరుల హక్కు అని ఎలుగెత్తుతూ మేము ఒక ఉద్యమాన్ని ప్రారంభించాము. పిఎమ్ 2.5 అనే కణ రూప ద్రవ్యాన్ని డీజిల్ ఉద్గారిస్తుందనే వాస్తవాన్ని వైజ్ఞానిక పరిశోధనలు అప్పుడప్పుడే ధ్రువీకరిస్తున్న కాలమది. 1990ల నడిమి సంవత్సరాలలో అదొక కొత్త విషయం. డీజిల్‌తో నడిచే వాహనాల నుంచి పిఎమ్ 2.5 రేణువులు ఉద్గారమై గాలిలో కలిసి, ఆ కాలుష్య గాలిని పీల్చిన వారి ఊపిరితిత్తులలోకి చొచ్చుకుపోతాయి. పౌరుల ఆరోగ్యం దృష్ట్యా డీజిల్‌తో నడిచే వాహనాలతో వాటిల్లే ఆరోగ్య ప్రమాదాల గురించి నేను, (కీర్తిశేషుడు అయిన) నా సహచరుడు అనీల్ అగర్వాల్ విపులంగా రాశాము. వెన్వెంటనే మాకు టాటా మోటార్స్ కంపెనీ నుంచి ఒక పరువు నష్టం నోటీస్ వచ్చింది. అపనిందలతో తమ వ్యాపార నష్టానికి కారకులమవుతున్నామనేది ఆ హెచ్చరిక సారాంశం. రతన్ టాటా తన ఆటోమొబైల్ ప్రాజెక్టును ప్రారంభించిన రోజులవి. అది డీజిల్‌తో నడిచే వాహనం. తత్కారణంగా ప్రత్యర్థి కంపెనీలు (పెట్రోల్ కార్ల ఉత్పత్తిదారులు) అయిన మారుతి సుజుకి మొదలైన వాటి కంటే నానోకు విశేష స్థాయిలో వ్యాపార అనుకూలత సమకూరే అవకాశమున్నది. ఇదలా ఉంచితే టాటా మోటార్స్ మాకు జారీ చేసిన లాయర్ నోటీసుపై మేము ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. న్యాయస్థానంలో పోరాడడానికి నిశ్చయించుకున్నాం. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో మాకు, టాటా మోటార్స్‌కు మధ్య తీవ్ర న్యాయపోరాటమే జరిగింది. మేము మా వాదనకే దృఢంగా కట్టుబడి ఉన్నాం.

అయితే ఈ న్యాయపోరాటంలో మా పరస్పర ఆగ్రహం నెమ్మదిగా శాంతించింది. అంతిమంగా నేను ఒక వాస్తవాన్ని గ్రహించాను: మేము డీజిల్ కార్లకు వ్యతిరేకంగా ఉద్యమించింది టాటా మోటార్స్ ప్రత్యర్థి కంపెనీల (పెట్రోల్ వాహనాల తయారీదారులు) తరఫున అని తప్పుగా విశ్వసించినందునే రతన్ టాటా మాకు వ్యతిరేకంగా న్యాయపోరాటానికి ఉపక్రమించారు. అలాగే పిఎమ్ 2.5 విషయమై వైజ్ఞానిక పరిశోధనలు ధ్రువీకరిస్తున్న వాస్తవాల ప్రాతిపదికన మేము మా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని నిరూపణ అవడంతో రతన్ మా నిజాయితీని గుర్తించారు. ఆటోమోటివ్ ఇంధనంగా డీజిల్ ప్రజల ఆరోగ్యానికి ఎనలేని హానికారి అవుతుందనే విషయాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. దీంతో మా ఉద్యమం పట్ల ఆయన అభిప్రాయాలు, ఆలోచనలు మారాయి. అయితే టాటా మోటార్స్ తన డీజిల్ కార్ ప్రాజెక్టు నుంచి వెనక్కు తగ్గినట్టుగా భావించనవసరం లేదు. ఆ కంపెనీ ఆ వాహనాల ఉత్పత్తితో ముందుకు సాగింది. మేమూ, డీజిల్ వాహనాలకు వ్యతిరేకంగా మా ఉద్యమాన్ని విడనాడలేదు. మరి ఈ వ్యవహారం ఎలా ఒక కొలిక్కి వచ్చిందో తెలుసా? విరుద్ధ అభిప్రాయాలను ఆమోదించడమనే పాత కాలం మంచి ప్రజాస్వామిక సంప్రదాయాల స్ఫూర్తితో ఆ వివాదం ముగిసింది. రతన్ టాటా తన నానో కార్లను తొలుత ఢిల్లీ ఆటో మొబైల్ ఎగ్జిబిషన్‌లో విడుదల చేశారు. ఆ సందర్భంగా ఆయన నా పేరును ప్రస్తావించి సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే నానో, సునీతా నారాయణ్ ఆమోదం పొందగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు! ఆశ్చర్యపోయాను, వినమ్రంగా రతన్ టాటా విశాల, నిష్పాక్షిక దృక్పథాన్ని అంగీకరించాను.

రతన్ టాటా మరణం పట్ల సంతాపం వ్యక్తం చేయడం ఆయనలాంటి పారిశ్రామికవేత్తలు, వ్యవస్థా నిర్మాణ దక్షులు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన రోజులు వెళ్లిపోయినందుకు విచారపడడమే; అటువంటి ఐశ్వర్యవంతులు తమ వ్యక్తిగత జీవితంలో పొదుపరితనం, నిరాడంబరత పాటించే రోజులు గతించినందుకు బాధపడడమే; వ్యాపారం అనేది కేవలం వ్యక్తిగత లాభాల ఆర్జనకు మాత్రమే కాదని, ప్రజల శ్రేయస్సుకూ అది తోడ్పడాలన్న సమున్నత విలువలు విలుప్తమవుతున్నందుకు విచారించడమే.



రతన్ టాటాతో నా రెండో అనుభవం మరింత వ్యక్తిగతమైనది, మనసును తాకేది. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో ఒకసారి నేను ఒక ఉన్నతస్థాయి విందు సమావేశంలో పాల్గొన్నాను. అత్యున్నత స్థాయి అధికారులు, పారిశ్రామిక దిగ్గజాలు, ప్రభావ ప్రాబల్యాలుగల రాజకీయ నాయకులు ఉన్న సమావేశమది. దేశ జనాభాలోని ప్రతి ఆదాయ వర్గం వారి అవసరాలను తమ ఆటోమొబైల్ కంపెనీ ఎలా తీరుస్తుందో రతన్ టాటా వివరిస్తున్నారు. ఆయన అప్పుడే బ్రిటన్‌లోని ఆటోమొబైల్ దిగ్గజం జాగ్వార్ కంపెనీని స్వాయత్తం చేసుకున్నారు. సంపన్నులు, సెలెబ్రిటీలు, ఉన్నత స్థాయి అధికారులకు మాత్రమే లభ్యమయ్యే కారు అది. మొట్టమొదటిసారి కారు కొనుక్కోదలిచిన వినియోగదారులకు అందుబాటులో ఉండేది నానో. ఆయన మాటల మధ్యలో నేను జోక్యం చేసుకుని ఒక విషయాన్ని చెప్పడాన్ని రతన్ మరచిపోయారని వ్యాఖ్యానించాను. ఆయన కళ్లలో ఏదో కలత పొడసూపడం నాకు స్పష్టంగా కనిపించింది. పర్యావరణ ఉద్యమకారిణిగా నేను ఏదైనా ఇబ్బందికరమైన విషయాలను వెల్లడిస్తానని ఆయన అనుకున్నారు కాబోలు! అయితే నేను ఆయనకుగానీ మరెవరికిగానీ అప్రియమైన విషయాలు ఏవీ చెప్పలేదు. టాటా మోటార్స్ బస్సులు కూడా తయారు చేస్తున్నదని, అవి, కార్ల కంటే ఎంతో ఎక్కువ మందిని వారి గమ్యాలకు చేరుస్తున్నాయని, తమ కంపెనీ తాజాగా సిఎన్‌జితో నడిచే అధునాతన బస్సులను ఉత్పత్తి చేయడం ప్రారంభించిందనే విషయాన్ని ప్రస్తావించడాన్ని రతన్ టాటా మరచిపోయారని నేను అన్నాను. అందరూ నన్ను మెచ్చుకోలుగా చూడడాన్ని గమనించాను. సరే అటువంటి సమావేశాల్లో సంభాషణలు ఎప్పటి మాదిరిగానే సాధారణ విషయాల మీదకు మళ్లాయి. నేను ప్రస్తావించిన విషయం అంతటితో ముగిసినట్టేనని భావించాను.

నేను పొరపడ్డాను. కొద్దిరోజుల అనంతరం టాటా మోటార్స్ అత్యున్నత స్థాయి అధికారి ఒకరు మా కార్యాలయానికి వచ్చారు. మేము నిర్వహిస్తున్న డీజిల్ వ్యతిరేక ఉద్యమ విషయమై ఆయన వచ్చారేమోనని నేను భావించాను అయితే తాను టాటా మోటార్స్ కార్ల తయారీ విభాగం నుంచి గాక బస్‌ల ఉత్పత్తి విభాగానికి చెందినవాడినని ఆ అధికారి చెప్పారు. రతన్ టాటాకు నేను చెప్పిందేమిటని ఆయన ప్రశ్నించారు. ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించగా తాను ఎందుకు వచ్చిందీ వివరంగా చెప్పారు. ఆ విందు సమావేశంలో నేను చేసిన వ్యాఖ్యలు రతన్ టాటాకు విభ్రమం కలిగించాయట. ఆ తరువాత టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్‌కు ఫోన్ చేశారట (మా కార్యాలయానికి వచ్చింది ఆ అధికారే), తనకు కూడా తెలియకుండా తన కంపెనీలో జరుగుతున్న, సునీతా నారాయణ్ ప్రశంసించిన ఆ ప్రశస్త పని ఏమిటనేది. ఆయనకు తెలియలేదు. ఎట్టకేలకు నా వ్యాఖ్యలను ఆయన అర్థం చేసుకుని మెచ్చుకున్నారు. నా వ్యాఖ్యలు చలనశీలత రూపాంతరీకరణం (mobility transformation) ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చడంలో కార్లు కాకుండా బస్సుల పాత్ర, ప్రాధాన్యం గురించి రతన్ టాటాలో కొత్త ఆలోచనలను రేకెత్తించాయని తెలిసింది.

ఆ గొప్ప మనిషి నుంచి నాకు వ్యక్తిగతంగా లభించిన గుర్తింపు, ప్రశంసలను చెప్పుకోవడానికి నేను ఇది రాయడం లేదు. ఆయనలోని గొప్పదనమేమిటో వివరించడానికే ఇది రాస్తున్నాను. ఇతరులు చెప్పేది ఓర్పుగా వినే శక్తి, ఎంత ఇబ్బందికరమైనవి అయినప్పటికీ విరుద్ధ అభిప్రాయాలు, వైఖరులను అంగీకరించే విశాల దృక్పథమే ఆ గొప్పదనం. కొంత మంది ఇతర పారిశ్రామికవేత్తలతో మా అనుభవాల దృష్ట్యా కూడా నేను ఇది మరీ చెప్పుతున్నాను. తమ ఉత్పత్తుల్లో క్రిమిసంహారక మందులు ఉన్నాయని మేము నిరూపించినప్పుడు రెండు బహుళజాతి కంపెనీలు దౌర్జన్యకరంగా, అసహ్యంగా ప్రతిస్పందించాయి. మా శాస్త్రీయ నిరూపణలను ఆ కంపెనీలు పూర్తిగా కొట్టివేశాయి. తాము తప్పు చేయడమనేది జరగదని ఎందుకంటే తమవి అమెరికాకు చెందిన బహుళజాతి కంపెనీలు అనే దురహంకారాన్ని ప్రదర్శించాయి. ఒక కంపెనీ వారయితే మరింత ఆక్షేపణీయంగా ప్రవర్తించారు. మమ్ములను బెదిరించారు, భయపెట్టారు చౌకబారు ఎత్తుగడలకు దిగారు. చివరకు కేసులు పెట్టారు. వారు ఉత్పత్తి చేస్తున్న ఆహారంలో విష పదార్థాలు అధికంగా ఉంటున్నాయని నిరూపించడమే మేము చేసిన తప్పు! మేము మా వ్యక్తిగత ప్రయోజనాలకు పనిచేయడం లేదని, వ్యాపారంలో ఉత్పత్తిదారుల ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమం మధ్య సమతౌల్యత ఉండాలనే ఉద్దేశంతో మేము మా కృషి చేస్తున్నామని వివరించినా ఆ కంపెనీ విన్పించుకోలేదు.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

రతన్ టాటా మరణం పట్ల సంతాపం వ్యక్తం చేయడం ఆయనలాంటి పారిశ్రామికవేత్తలు, వ్యవస్థా నిర్మాణ దక్షులు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన రోజులు వెళ్లిపోయినందుకు విచారపడడమే; అటువంటి ఐశ్వర్యవంతులు తమ వ్యక్తిగత జీవితంలో పొదుపరితనం, నిరాడంబరత పాటించే రోజులు గతించినందుకు బాధపడడమే; వ్యాపారం అనేది కేవలం వ్యక్తిగత లాభాల ఆర్జనకు మాత్రమేకాదని, ప్రజల శ్రేయస్సుకూ అది తోడ్పడాలన్న సమున్నత విలువలు విలుప్తమవుతున్నందుకు విచారించడమే. రతన్ టాటాకు నివాళి అర్పించటం ఈనాటి కొంత మంది కుబేరుల అసభ్య దుబారాలను తిరస్కరించడమూ, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయడమంటే ఒక అభిప్రాయం పట్ల అనంగీకారం కాదనే భావనను మళ్లా మన జీవితాల్లోకి తెచ్చుకోవడానికి మనం సంకల్పించుకోవడం కావాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)



డేంజర్ బెల్స్

ప్రకాశం బ్యారేజీ చుట్టూ ప్రమాద ఘంటికలు

- ఒరుగుతున్న బ్యారేజ్ రెయిలింగ్
- కోతకు గురైన సీతానగరం రహదారి.. కూలిన ప్రహరీ
- కూలిపోయిన కేఈఎం కాల్వ ప్రహరీ
- బ్యారేజీ చుట్టుపక్కల నిర్మాణాలపై వరదల ఎఫెక్ట్
- ఐదేళ్ల పాటు నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ

6



పేదల సేవలో సేవా సమితి

అన్నార్తుల అన్నపూర్ణ

ఆకలి కోసం ఆరాటపడతాం. ఆకలి తీరాక అన్నాన్ని పక్కనపడేస్తాం. కడుపు నిండింది కదా.. అని నిర్లక్ష్యంగా నేలపాలు చేస్తాం. కానీ, అదే అన్నం కోసం అలమటించేవారు ఎందరో ఉన్నారు. పట్టెడు మెతుకులు దొరికితే పొట్ట నింపుకోవొచ్చని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఇలాంటి నిరుపేదల ఆకలి నుంచి పుట్టిందే అన్నపూర్ణ సేవా సమితి. 2014లో జగ్గయ్యపేటలో ఆవిర్భవించిన ఈ సమితి.. వివాహాలు, ఇతర శుభకార్యాల్లో మిగిలిపోయిన ఫలహారాలు, విందు భోజనాలను సేకరించి, పేదలకు పంచి పెడుతుంది. ఒక్క ఫోన్‌చేసి సమాచారమిస్తే చాలు.. సమితి వలంటీర్లు క్షణాల్లో అక్కడికి చేరుకుని మిగిలిపోయిన ఆహారాన్ని సేకరిస్తారు. పేదలకు పంచి పెడతారు. పదేళ్లుగా 200 మంది వలంటీర్లతో ఏటా లక్షమందికిపైనే ఆకలి తీరుస్తున్న ఈ సమితిపై కథనం..

- వేడుకల్లో ఆహార వృథాకు అడ్డుకట్ట
- మిగిలిపోయిన ఆహారం సేకరణ
- ఆకలితో అలమటిస్తున్న పేదలకు పంపిణీ
- ఏటా లక్షమందికిపైగా అందజేత
- జగ్గయ్యపేటలో అన్నపూర్ణ సేవా సమితి
- సేవాతత్పరతకు ప్రముఖుల ప్రశంసలు

8

అర దశాబ్దం తర్వాత అమరావతికి రైల్వేకూత కూసింది. కొత్త రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపటంతో అంతటా ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చేనెలలోనే శంకుస్థాపన జరిగే అవకాశాలుండటంతో ఇప్పటికే ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పరిధిలో భూ సేకరణ పనులు ముమ్మరం చేశారు.



అమరావతికి రైలుకూత

ఐదేళ్ల తర్వాత పట్టాలెక్కనున్న నూతన రైల్వేలైన్

ఎర్రుపాలెం-నంబూరుకు కేంద్రం ఓకేపై హర్షం

నవంబరులో శంకుస్థాపన చేసే అవకాశం - పరిటాలకు మహర్దశ

అమరావతి నుంచి దేశంలోని కీలక ప్రాంతాలకు కనెక్టివిటీ



పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్

పరిటాల వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్ నిర్మించేందుకు ప్రతిపాదించారు. దీనిని ఎన్‌హెచ్-65 వెంబడి ఏర్పాటు చేస్తారు. మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ అనేది.. రైల్వే సరుకు రవాణాతో పాటు జల, రోడ్డు రవాణా సేవలకు కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల 17 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 296 ఎకరాల సేకరణ

అమరావతి రైల్వేలైన్‌కు సంబంధించి జిల్లాలో 296 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటికే ఈ ప్రక్రియ చేపట్టారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో భూములను సేకరించాల్సి ఉంది. ఈ రెండు మండలాల పరిధిలో పరిటాల, గొట్టుముక్కల, నరసింహారావుపాలెం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, అల్లూరు, పెద్దాపురం, గూడెం మాధవరం గ్రామాల్లో భూములు సేకరించాలి.

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అమరావతికి మొత్తం 57 కిలోమీటర్ల సింగిల్ లైన్‌కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుకు రూ.2,245 కోట్లను కేటాయించింది. గతంలో అమరావతిని రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి ఈ రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. అప్పట్లో కేంద్రం కూడా సానుకూలంగా స్పందించి బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. తర్వాత ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు, మరో రెండు లైన్లు కలిపి రూ.2,800 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. ఎర్రుపాలెం నుంచి పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, తాడికొండ, కొప్పవరం, నంబూరు వరకు అమరావతి నూతన రైల్వేలైన్ అలైన్‌మెంట్‌కు రూపకల్పన చేశారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టుల జాబితాలో దీనికి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావటంతో అమరావతి విధ్వంసం మాదిరిగానే రైల్వేలైన్‌ను కూడా పక్కన పెట్టేశారు. ప్రాధాన్యత కలిగిన రైలు ప్రాజెక్టుల జాబితాల నుంచి తొలగించారు. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఈ రైల్వేలైన్‌కు కదలిక వచ్చింది. ఏపీ ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో మళ్లీ చేరింది. 57 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను రూ.2,245 కోట్లతో నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధానంగా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 37 కిలోమీటర్ల దూరం ఉంటుంది. పెదకూరపాడు, సత్తెనపల్లి మార్గాలు కూడా కలిపితే 57 కిలోమీటర్లు అవుతుంది. ప్రస్తుతానికైతే సింగిల్ లైన్ నిర్మాణ పనులు చేపడతారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డబ్లింగ్, ట్రిప్లింగ్‌గా విస్తరించే అవకాశం ఉంది. కొండపల్లి అభయారణ్యానికి ఇబ్బంది లేకుండా అమరావతి రైల్వేలైన్‌ను నిర్మించనున్నారు. పాత ప్రతిపాదన ప్రకారం ఈ లైన్ రిజర్వు ఫారెస్టులోకి కొంతమేర వచ్చింది. ప్రస్తుత అలైన్‌మెంట్‌లో ఎలాంటి వృక్షాలు, అటవీ ప్రాంతాలు దెబ్బతినకుండా రూపొందించారు.

మిగతా 8లో..

పాతవారిదే పెత్తనమా

- ఆర్టీసీలో మాజీల తెరచాటు యత్నాలు
- వైసీపీ హయాంలో వారిదే హడావిడి
- ప్రస్తుత ప్రభుత్వంలోనూ కీలక పోస్టులకు పన్నాగాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిందటి వైసీపీ హయాంలో ఆర్టీసీలోని అస్మదీయులు, అడ్డగోలుగా నడుచుకున్న అధికారులు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా చక్రం తిప్పుతున్నారు. పదవీ వి రమణ చెందినా మళ్లీ సంస్థపై పట్టు సాధించేందుకు పైరవీలు ప్రారంభిస్తున్నారు. మాజీ అధికారులకు క్రియాశీలక పోస్టులు కల్పించేందుకు తెరవెనుక జరుగుతున్న ఈ ప్రయత్నాలను ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయాలన్నీ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

ఆ అధికారులే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలపరిమితి పూర్తయిన అద్దె బస్సులకు సంబంధించి టెండర్లు పిలవాల్సిందిపోయి పాతవారికే అనుమతులిచ్చారు. ఈ విషయంలో ఓ అధికారిపై పెద్ద ఎత్తున ఆరోపణలొచ్చాయి. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలు, చైర్మన్ సిఫార్సులతో ఆ అధికారి టెండర్లు పిలవకుండా పాతవారికే అద్దె బస్సులను కట్టబెట్టేశారని ఈ ఆరోపణల సారాంశం. నిర్దేశిత రూట్లలో కాలపరిమితి పూర్తయిన పర్మిట్లకు సంబంధించి అదే రూట్లలో మళ్లీ అవకాశం కల్పించకూడదు. ఆయా రూట్లవారీగా టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఎవరు తక్కువకు టెండర్లు వేస్తారో వారికి కేటాయించాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా 426 అద్దె బస్సులకు సంబంధించి పర్మిట్లు ముగిసినా పాతవారికే ఇవ్వటం గమనార్హం. ఈ నేపథ్యంలో సదరు అధికారిపై విచారణ జరపాల్సిందిగా ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా, ఆ అధికారికి మంత్రి కార్యాలయం అండదండలందిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. కిందటి ప్రభుత్వానికి పక్కా అభిమానిగా, ఏకపక్షంగా పనిచేసిన మరో అధికారి తిరిగి తన పాత పదవిలో కొనసాగేందుకు ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారు. వైసీపీ హయాంలో చక్రం తిప్పిన మరో అధికారి ప్రస్తుత చైర్మన్ కొణకళ్ల నారాయణ వద్ద ఓఎస్‌డీగా వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన మాజీలకే కీలక పదవులు కట్టబెడితే నిజాయితీ కలిగిన అధికారులు, సీనియర్ల పరిస్థితి ఏమిటో అర్థంకాకుండా ఉంది.



కంచికచర్లలో రియల్ కుదేల్

భారీగా తగ్గిన భూముల ధరలు

- తగ్గిన క్రయవిక్రయాలు
- ఆందోళనలో రియల్ వ్యాపారులు

కంచికచర్ల ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం మందగించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఆకాశాన్నంటిన ధరలు కొద్దిరోజుల నుంచి నేల చూపులు చూస్తున్నాయి. కొనుగోలుదారుల హడావిడి తగ్గటంతో భూములు, స్థలాల క్రయవిక్రయాలు పెద్దగా జరగటం లేదు. మార్కెట్ పుంజుకునే సూచనలు కనిపించకపోవటంతో ఆశగా ఈ రంగంలో పెట్టుబడి పెట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు. కొన్నవి అమ్ముడుపోక, అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : రాష్ట్ర విభజన తర్వాత కంచికచర్ల ప్రాంతంలో 2014-19 మధ్య రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలోని భూముల కంటే ఇక్కడి భూములకు అధిక ధరలు పలికాయి. కంచికచర్ల చుట్టుపక్కల ప్రాంతంలో ఎకరం ధర రూ.కోట్లకు చేరింది. అయినప్పటికీ ఇబ్బడిముబ్బడిగా వెంచర్లు వెలిశాయి. ప్రతి గ్రామంలో వందలాది ఎకరాలు చేతులు మారాయి. అయితే, వైసీపీ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం పడకేసింది. నూటికి 90 శాతం మందికి

మిగతా 8లో..

మద్యేమార్గం

దారి లేనివైపు మద్యం షాపులు కట్టిన ప్రైవేట్ వ్యక్తి

మద్యం ఆదాయాన్ని రుచిమరిగిన వ్యాపారులు షాపుల ఏర్పాటులోనూ అతి తెలివి ప్రదర్శిస్తున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం షాపును ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసి.. దానికి దారి నిమిత్తం ఏకంగా చేపల దుకాణం గోడను పగలగొట్టేశారు. ఆ షాపు ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టారు. ఇప్పుడు అదే బాటలో కొత్త మద్యం వ్యాపారి నడవడం పటమటలంకలోని చేపల మార్కెట్‌లో చర్చనీయాంశమైంది.

- వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహణ
- దారికోసం చేపల మార్కెట్ దుకాణం గోడలు కూల్చివేత
- ఇప్పుడు అదే షాపులో కొత్త మద్యం దుకాణం
- పటమటలంకలో పడవలరేవు వద్ద వ్యాపారి ధనకార్యం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పటమటలంకలోని పడవలరేవు వంతెన వద్ద వీఎంసీకి చెందిన చేపల మార్కెట్ ఉంది. ఈ మార్కెట్ మొత్తం బందరు కాల్వను ఆనుకుని ఉంటుంది. చేపల మార్కెట్‌లో రెండు వైపులా వ్యాపారం చేసుకునేందుకు వీలుగా షెడ్లు ఉన్నాయి. లోపలకు వెళ్లడానికి మధ్యలో సీసీ రోడ్డు ఉంది. ఇక్కడ మత్స్యకారులు చేపలు, రొయ్యలు విక్రయిస్తుంటారు. మార్కెట్ రోడ్డుకు ప్రారంభంలో కుడివైపున రెండు షాపులు ఉండేలా ఒక షెడ్‌ను నిర్మించారు. ఇందులో ఒక షాపులో మాత్రమే వ్యాపారం జరుగుతోంది. దీనికి పక్కన ఉన్న షాపు మాత్రం వెనుక ఉన్న మద్యం దుకాణానికి దారిగా ఉపయోగపడుతోంది.

వీఎంసీ ఆదాయానికి గండి..

మార్కెట్ రోడ్డు ప్రారంభంలో కుడివైపు ఉన్న షెడ్‌కు వెనుక భాగంలో ప్రైవేట్ భవనం ఉంది. ఈ భవనానికి ముందు భాగంలో రెండు షాపులున్నాయి. ఇదికాకుండా షాపు యజమాని చేపల మార్కెట్ వైపున రెండు షాపులను నిర్మించారు. వాస్తవానికి ఈ భవన యజమానికి మార్కెట్ వైపున ఎలాంటి స్థలం లేదు. అటువైపు మార్గం కూడా లేదు. అయినా షాపులను ఏర్పాటు చేసి షెట్టర్లు అమర్చాడు. అయితే, వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఒకటి ఈ షాపులో పెట్టారు. దీనికి దారి కోసం చేపల మార్కెట్ షెడ్‌లో ఒక దుకాణాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ దుకాణానికి ఉన్న గోడలను తొలగించి దారి ఏర్పాటు చేసుకున్నారు. వాస్తవానికి షెడ్‌లో రెండు షాపులను అద్దెకిస్తే వీఎంసీకి ఆదాయం వచ్చేది. అటువంటిది వెనుక వైపు ఉన్న భవనంలోని మద్యం షాపు కోసం మార్కెట్‌లో ఉన్న షాపును దారిగా

మిగతా 8లో..

సైబర్ కట్టడికి సహకరించండి

బ్యాంకు మేనేజర్లతో సీపీ రాజశేఖరబాబు సమావేశం

6

బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు

దరఖాస్తులు

వ్యాపారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు

8

కందిపప్పు, పంచదార ఫుల్

- ఐదేళ్ల తర్వాత రేషన్ డిపోలకు..
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 పైనే..
- రేషన్ దుకాణంలో కిలో రూ.67
- కార్డుదారులకు నవంబరులో సరఫరా
- సీఎంకు డీలర్ల ధన్యవాదాలు

8


రేషన్ డీలర్లకు మళ్లీ నోటీసులు

6

డేంజర్ బెల్స్!



క్రిష్ణా ఈస్ట్ కెనాల్ వద్ద కుంగిన ప్రాంతంలో శాశ్వత రక్షణ చర్యలు వదిలి రేకులతో తాత్కాలిక ఏర్పాట్లు



ప్రకాశం బ్యారేజీ

- ప్రకాశం బ్యారేజీ చుట్టూ ప్రమాద ఘంటికలు
- ఒరుగుతున్న బ్యారేజ్ రెయిలింగ్
- కోతకు గురైన సీతానగరం రహదారి.. కూలిన ప్రహరీ
- కూలిపోయిన కేఈఎం కాల్వ ప్రహరీ
- బ్యారేజ్ చుట్టుపక్కల నిర్మాణాలపై వరదల ఎఫెక్ట్
- ఐదేళ్లుగా నిర్వహణను వదిలేసిన వైసీపీ

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలను అనుసంధానం చేసి, అన్నదాతల అవసరాలను తీర్చడంతోపాటు ఉమ్మడిజిల్లా ప్రజలగొంతు తడుపుతున్న ప్రకాశం బ్యారేజీ చుట్టూ ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. నదిని, నదికి పక్క నుంచి ప్రవహించే కాల్వలను ఆనుకుని ఉన్న ప్రహరీలు కుంగుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో ఈ ప్రహరీలు కూలిపోయాయి. ప్రస్తుత పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. మొత్తం మూడు ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ప్రకాశం బ్యారేజ్ దిగువన ఉన్న వెప్రాన్‌కు చెంతనే సీతానగరం వైపున రైల్వే బ్రిడ్జి దిశగా వెళ్లడానికి సీసీ రోడ్డును నిర్మించారు. బ్యారేజ్ గేట్లను ఎత్తినప్పుడు ఈ రహదారి చెంత నుంచి నీరు దిగువకు ప్రవహిస్తుంది. నదికి పక్కన ఏర్పాటు చేసిన కట్టపై సీసీ రోడ్డును నిర్మించారు. ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడను నిర్మించారు. సీతానగరం కొండలు దాటిన తర్వాత నుంచి రైల్వే బ్రిడ్జి వరకు స్నానాల ఘాట్లు ఉన్నాయి. ప్రకాశం బ్యారేజ్‌కి వరదలు తీవ్రంగా రావడంతో ఇక్కడున్న సీసీ రోడ్డు కోతకు గురవుతోంది. 2019లో రెండుసార్లు ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరదలు వచ్చాయి. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో రికార్డు స్థాయిలో11.45లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇలా వరదలు భారీగా వచ్చినప్పుడల్లా రహదారికి కోత పెరుగుతోంది. దీనితో ఇక్కడున్న రహదారి ఒక వైపునకు కుంగిపోతోంది. దీనిపై నిర్మించిన రక్షణ గోడ వరదల సమయం నుంచి నది వైపునకు ఒరిగిపోయి ఉండేది. తాజాగా ఈ ప్రహరీ కొంతభాగం ముక్కలుగా కూలిపోయింది. సుమారుగా 150 మీటర్ల మేర రక్షణ గోడ పడిపోయింది. కోత పెరగడంతో గోడ కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. జలవనరుల శాఖ అధికారులు మాత్రం ఏదో గుర్తుతెలియని వాహనం రాత్రి సమయాల్లో ఢీకొట్టిందని అనుమానిస్తున్నారు. ప్రహరీ కూలిపోయిన ప్రదేశాలను నది పరిరక్షణ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ప్రకాశం బ్యారేజ్ జేఈ రాజేష్ పరిశీలించారు.

కేఈ కాల్వ దగ్గర అంతే...

ప్రకాశం బ్యారేజ్ నుంచి కాల్వలకు రెండు విధాలుగా నీటిని విడుదల చేస్తారు. ముందుగా వినాయకుడి ఆలయానికి సమీపం నుంచి ప్రవహించే కృష్ణా తూర్పు ప్రధాన కాల్వపై ఉన్న లాక్ నుంచి దిగువన గల డెల్టాకు నీరు ఇస్తారు. తర్వాత సీతానగరం వైపున ఉన్న లాక్ వద్ద నుంచి పశ్చిమ డెల్టాకు నీటిని విడుదల చేస్తారు. ప్రకాశం బ్యారేజ్‌ను ఆనుకుని ప్రవహించే తూర్పు ప్రధాన తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్దకు వచ్చే సరికి మూడు కాల్వలుగా చీలిపోతుంది. ఈ తూర్పు ప్రధాన కాల్వకు ఇరిగేషన్ అధికారులు సేఫ్టీ వాల్‌ను నిర్మించారు. ఈ కాల్వకు వినాయకుడి ఆలయానికి మధ్య నుంచి వీఎంసీ అధికారులు రహదారిని నిర్మించారు. ఈ రహదారి కొత్త లాక్ వద్ద కలుస్తుంది. వినాయకుడి ఆలయం నుంచి లాక్ వరకు రహదారి వెంబడి అధికారులు ఒక గోడను నిర్మించారు. కొన్ని సంవత్సరాలుగా ఈ గోడ శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిలో జనసంచారం తక్కువగా ఉండడంతో వీఎంసీ అధికారులు బహిరంగ మూత్రవిసర్జన బిన్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడ రహదారికి, దానిపై నిర్మించిన గోడకు మధ్య కొన్నిచోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల పగుళ్లు ఉన్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ ఖాళీలు బాగా పెరుగుతున్నాయి. తాజాగా బహిరంగ మూత్రవిసర్జన బిన్‌లు ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఉన్న ప్రహరీ కొంతభాగం కూలిపోయింది. దీనితో వీఎంసీ అధికారులు ఇక్కడ కాల్వకు రహదారికి మధ్య రేకులను అడ్డుగా ఏర్పాటు చేశారు. ఇక్కడ కాల్వ జలవనరుల శాఖ పరిధిలో ఉన్నా, కూలిపోయిన గోడ, దాన్ని ఆనుకుని ఉన్న రహదారి తమ పరిధిలోకి రాదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. దీనికి తక్కువ ఎత్తులో మెట్లుగా నిర్మించిన సేఫ్టీ వాల్ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

ప్రమాదకరంగా రెయిలింగ్..



ప్రకాశం బ్యారేజ్‌పై ఉన్న రహదారికి ఇరువైపులా సిమెంట్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఒక రెయిలింగ్ నది దిగువకు ప్రవహిస్తున్న వైపు ఉంటుంది. మరో రెయిలింగ్ గేట్లకు చెంతనే ఉంటుంది. సందర్శకులు వారాంతాల్లో వాటిని ఆనుకుని ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటారు. శని, ఆదివారాల్లో బ్యారేజ్ పైకి అటు తాడేపల్లి, సీతానగరం, ఉండవల్లి వైపు నుంచి, ఇటు విజయవాడ వైపు నుంచి సందర్శకులు వెళ్తుంటారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో బ్యారేజ్ నిర్వాహణను మొత్తం గాలికి వదిలేసింది. గేట్లు, గొలుసులు, మోటార్ల నిర్వాహణకు చిల్లిగవ్వను విదల్చలేదు. ఆ సమయంలో బ్యారేజ్‌పై ఉన్న ఫుట్‌పాత్ పాడైపోయింది. కొన్నిచోట్ల సిమెంట్ పలకలు ముక్కలైపోయాయి. అదేవిధంగా 39వ నంబరు ఖానా ఎదురుగా వెప్రాన్ వైపున ఉన్న రెయిలింగ్ విరిగిపోయింది. సందర్శకులు ఇక్కడికి వెళ్లకుండా ఇరిగేషన్ అధికారులు అడ్డుగా కర్రలు కట్టారు. బ్యారేజ్‌కు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేసి అప్పటి ప్రభుత్వానికి పంపారు. అయినా సర్కారులో చలనం కలగలేదు. కర్రలు ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉంటున్నాయని భావించి రెయిలింగ్ విరిగిపోయిన భాగంలో సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌పై కొత్త సిమెంట్ పలకలను ఏర్పాటు చేశారు. రెయిలింగ్ మాత్రం నది వైపునకు ఒరిగిపోతోంది.

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

- రాజేష్, ప్రకాశం బ్యారేజ్ జేఈ

సీతానగరం వైపున ఉన్న రోడ్డు ఇటీవల వచ్చిన వరదలకు కోతకు గురైంది. దీనిపై నిర్మించిన ప్రహరీ కూలిపోయింది. ఈ ప్రదేశాన్ని పరిశీలించాం. ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. అదేవిధంగా బ్యారేజ్ పైన ఉన్న రెయిలింగ్‌ను మార్పు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కేఈ కెనాల్ వైపున కూలిపోయిన ప్రహరీ ఇరిగేషన్ శాఖ పరిధిలోకి రాదు. ఇది పూర్తిగా వీఎంసీ పరిధిలో ఉంటుంది.

మెగా డీఎస్సీలో హిందీ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి

ఆటోనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఆధారంగా మోడల్ స్కూల్, వెల్ఫేర్, పీజీటీలో హిందీ ఉపాధ్యాయ నియామకాలు నిర్వహించాలని కోరుతూ కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజులకు ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ జనరల్ సెక్రటరీ, హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గ్రైబువల్లి గురువారం వినతి పత్రం అందజేశారు. మంత్రులు, అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీనిచ్చారని తెలిపారు.

నేటి నుంచి జాతీయ పశుగణన

వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25 నుంచి 21వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనా తెలిపారు. జేసీ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పశుగణన వాల్ పోస్టర్లను, నిబంధనల పుస్తకాలను ఆవిష్కరించి ట్రావెలింగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 25వ తేదీ నుంచి నాలుగు నెలలపాటు పశుగణన నిర్వహిస్తున్నామన్నారు. 241 మంది పశుగణనకర్తలు, 47 మంది పర్యవేక్షకులు పనిచేస్తారని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గణన కర్త ఉంటారని, 20 మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పశుగణన జరుగుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 7,02,900 కుటుంబాలను సర్వేచేసి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. పశుగణన ఆధారంగా నిధులు, వ్యాధినిరోధక టీకాలు, నట్టల వ్యాధి టీకాలు వస్తాయని తెలిపారు. పశు యజమానులు గణనకర్తలకు కచ్చితమైన వివరాలు ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు మళ్లీ నోటీసులు!

మొగల్రాజపురం, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపుల విభజనపై కొందరు డీలర్లు హైకోర్టును ఆశ్రయించడంతో కమిషనర్ ఆదేశాల మేరకు మళ్లీ డీలర్లకు తాజాగా మరోసారి నోటీసులు జారీచేశారు. గతంలో ఇచ్చిన నోటీసులకు అభ్యంతరాలు తెలిపినా పరిష్కరించకుండా ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వడంతో వాటిని రద్దు చేయాలని డీలర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పౌరసరఫరాల కమిషనర్ డీలర్లకు మరోసారి నోటీసులు ఇచ్చారు. 7 రోజుల తరువాత షాపుల విభజన గురించి ప్రభుత్వ ఆదేశాలు, సర్క్యులర్‌లను ఉటంకిస్తూ రూల్ పొజిషన్ తెలుపుతూ విభజనకు ముందు, తరువాత వారి దుకాణాల్లో ఎన్ని కార్డులు ఉన్నాయో ఖచ్చితంగా డీలర్‌లకు తెలిపి ప్రొసీజర్ ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ మేరకు జిల్లాలో కొన్ని మండలాల్లో నోటీసులు జారీచేశారు.

ఎన్టీఆర్ జిల్లా డీఆర్వోగా లక్ష్మీనరసింహం

» వల్లభనేని శ్రీనివాసరావు బదిలీ

విజయవాడ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా ఎం లక్ష్మీనరసింహంను ప్రభుత్వం గురువారం నియమించింది. నరసింహం ప్రస్తుతం సర్వే సెటిల్‌మెంట్-ల్యాండ్ రికార్డుల కమిషనరేట్‌లో ఎస్‌జేడీగా పనిచేస్తున్నారు. కీలకమైన ఎన్టీఆర్ జిల్లాకు ఆయన్ను బదిలీ చేయటం గమనార్హం. ప్రస్తుతం డీఆర్వోగా పని చేస్తున్న వల్లభనేని శ్రీనివాసరావును ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. శ్రీనివాసరావు ఎన్నికల ముందు డీఆర్వోగా వచ్చారు.

అర్హులందరినీ అటల్ పెన్షన్ యోజనలో చేర్చండి

బ్యాంకర్లతో పీఎఫ్ఆర్‌డీఏ చీఫ్ జీఎం ప్రవేష్‌కుమార్

అజిత్‌సింగ్‌నగర్/విజయవాడ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ అటల్ పెన్షన్ పథకంలో చేరేలా బ్యాంకర్లు కృషి చేయాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీఎఫ్ఆర్‌డీఏ) చీఫ్ జనరల్ మేనేజర్ ప్రవేష్‌కుమార్ అన్నారు. గురువారం పీఎఫ్ఆర్‌డీఏ-న్యూఢిల్లీ భాగస్వామ్యంతో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి అటల్ పెన్షన్ యోజనపై విజయవాడ రూరల్ అంబాపురం పరిధి లోని కన్వెన్షన్‌లో అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవేష్‌కుమార్ హాజరయ్యారు. అటల్ పెన్షన్ యోజన అమలులో రాష్ట్రంలోని బ్యాంకులు మెరుగైన పనితీరును కనబరుస్తున్నా యన్నారు. గతేడాది దాదాపు 5.61 లక్షల మందిని పథంక కింద నమోదు చేశారని, ఇదే పనితీరును మునుముందు కూడా కనబరచాలని సూచిం చారు.

27న స్విమ్మింగ్ ఎస్జీఎఫ్ ఎంపికలు

విజయవాడస్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరే షన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్ -19 స్విమ్మింగ్ బాల, బాలికల జట్ల ఎంపికలను ఈనెల 27న ఉదయం 9 గంటలకు బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రవి కాంత ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 1న ఉదయం 9 గంటలకు విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో బాస్కెట్‌బాల్, అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థలో ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపికలు, 2న ఉదయం 9 గంటలకు మేరీ స్టెల్లా కళాశాలలో నెట్‌బాల్ బాల,బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు అర్హతా పత్రాలతో హాజరు కావాలని రవికాంత సూచించారు.

స్వల్ప మార్పులతో ట్రాఫిక్‌కు పరిష్కారం

» వీఎంసీ కమిషనర్‌తో ట్రాఫిక్ అధికారుల భేటీ » డ్రోన్ లైవ్‌లో ట్రాఫిక్‌ను పరిశీలించిన సీపీ

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలను సాఫీగా నడిపించడానికి రూపొందిస్తున్న ప్రణాళికలు పట్టాలు ఎక్కేలోపు స్వల్పమార్పులతో ఫలితాలను సాధించాలన్న ఆలోచనలో పోలీసులు ఉన్నారు. దీనికోసం ట్రాఫిక్ ఏడీసీ ప్రసన్నకుమార్, ట్రాఫిక్ 5 ఇన్‌స్పెక్టర్ బాలమురళీకృష్ణ, వీఎంసీ కమిషనర్ ధ్యాన్‌చంద్‌తో గురువారం భేటీ అయ్యారు. ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి వీఎంసీ అధికారులు ఏం చేయాలన్న దానిపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వీఎంసీ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పోలీసు అధికారులు నగరంలో మొత్తం 7-8 బాటిల్ నెక్ రోడ్లను పరిశీలించారు. మరో పక్క పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఎంజీ రోడ్డులో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద నుంచి డ్రోన్ లైవ్ ద్వారా ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. అక్కడ చేయాల్సిన మార్పులపై కొన్ని సూచనలు చేశారు.

- పీఎన్‌బీఎస్ వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జికి దిగువన పాదచారుల కోసం మార్గం ఏర్పాటు
- కృష్ణలంకలో అమెరికన్ ఆసుపత్రి వైపు నుంచి జాతీయ రహదారి పైకి వచ్చే వాహనాలు, జాతీయ రహదారిపై బెంజ్‌సర్కిల్ వైపు వచ్చే వాహనాలు ఢీ కొట్టుకునే ప్రమాదం ఉంది. అమెరికన్ ఆసుపత్రి వైపు నుంచి వచ్చే వాహనాల కోసం బందరు కాల్వపై ఉన్న వంతెన పక్కన గల ప్రదేశాన్ని విస్తరిస్తారు.
- బెంజ్‌సర్కిల్ దగ్గర జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి వెళ్లడానికి లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనం ముందు ఏర్పాటు చేసిన కటింగ్‌ను మరింతగా విస్తరిస్తారు.
- రామవరప్పాడు రింగ్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌లో కరెన్సీనగర్‌లోకి ఉన్న సర్వీసు రోడ్డును ప్రారంభంలో విస్తరిస్తారు.
- ఇన్నోటెల్ హోటల్‌కు పక్కన ఉన్న ఫ్రీలెఫ్ట్‌ను ఒకేసారి రెండు లారీలు తిరిగేలా మార్పుతారు.
- గన్నవరం వైపు వెళ్లే మార్గంలో అంకాలమ్మ ఆలయం వద్ద నుంచి రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌ను కుదించడం వల్ల జాతీయ రహదారి విస్తీర్ణం కొంత పెరుగుతుంది.
- ట్రెండ్‌సెట్ ముందున్న సర్వీసు రోడ్డు నుంచి జాతీయ రహదారి పైకి వాహనాలు వెళ్లేలా కటింగ్ ఇస్తారు.

అర ఎకరం పొలం అమ్మి.. అమరావతికి రూ.13.5 లక్షల విరాళం

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణం పూర్తి కావాలని, అభివృద్ధి జరగాలని వైద్య విద్యార్థిని వైష్ణవి ఆకాంక్షించారు. అందుకే అర ఎకరం పొలం అమ్మి మరీ రూ.13.50 లక్షలు అమరావతికి విరాళంగా ఇచ్చారు. ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్ కుమార్తె వైష్ణవి వైద్య విద్యార్థిని. చిన్ననాటి నుంచే సేవా భావం అలవాటైన ఆమె...



ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న వైష్ణవి, మనోజ్

మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అమరావతిలో రాష్ట్ర సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణాలకు విరాళం అందజేశారు. దీనికోసం ఆమె అర ఎకరం పొలం అమ్మి రూ.12.50 లక్షలు, మరికొంత బంగారం అమ్మి రూ.లక్ష.. కలిపి మొత్తం 13.50 లక్షలు ఇచ్చారు. వైష్ణవిని, మనోజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా వైష్ణవి ఎకరం పొలం అమ్మి రూ.25 లక్షలు, బంగారు గాజులు అమ్మి రూ.లక్ష, పోలవరం ప్రాజెక్టుకు మరో రూ.లక్ష అందజేశారు. అప్పట్లో ఆమెను అభినందిస్తూ సీఎం చంద్రబాబు వైష్ణవిని అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. 2018లోనూ వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం డాక్టర్ మనోజ్, వైష్ణవి మరో రూ.5లక్షలు చంద్రబాబుకు అందజేశారు.

సైబర్ కట్టడికి సహకరించండి

» సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను కట్టడి చేయడానికి బ్యాంకర్లు పోలీసులకు సహకరించాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీసులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని బ్యాంకర్ల మేనేజర్లతో కమిషనర్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా హడావుడిగా వచ్చి అధిక మొత్తంలో లావాదేవీలు చేస్తున్న వారిపై ఒక కన్నేసి ఉంచాలన్నారు. వారి ఖాతాలను పరిశీలించాలన్నారు. ఆ ఖాతాల నుంచి డబ్బులు ఏ ఖాతాలోకి వెళ్తున్నాయో తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు గురించి వివరించారు. ఎవరైనా ఖాతాదారులు వచ్చి తమకు తెలియకుండా డబ్బులు బదిలీ అయ్యాయని ఫిర్యాదు చేసినప్పుడు అవి ఏ ఖాతాకు వెళ్లాయో వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ నేరాల్లో బాధితుల్లో లక్షలాది రూపాయలను కోల్పోతున్నారని, వారిపట్ల మానవ తాదృక్పథంతో వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. అనుమానాస్పదంగా ఉన్న లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఖాతాల్లో డబ్బులు కోల్పోయిన బాధితులు వచ్చినప్పుడు వారికి 1930 టోల్‌ఫ్రీ నంబరును ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు గుణరాము, పలివెల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

» సీఎంకు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్టు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయన్, పెద్దన్న గౌడ్, నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీకి పెన్షన్ల చెల్లింపు అన్నది గత ప్రభుత్వంలో అసాధ్యమైందని సమయానికి పెన్షన్‌రాక పెన్షనర్స్ చాలా ఇబ్బందులకు గురైయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నెల నెలా పెన్షన్స్‌ను గత ఐదు నెలలుగా సకాలంలో నెల మొదటి తారీఖున పెన్షన్లు ఇస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పాత స్లాబుల ప్రకారం చెల్లించాలని కోరారు. పెన్షనర్లకు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరినట్టు తెలిపారు.

సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్ద కొండచిలువ కళేబరం కలకలం రేపింది. చంద్రబాబు నివాసానికి సమీపంలోని పార్కింగ్ ఏరియాలో మీడియా పాయింట్ కంటైనర్ వద్ద కొండచిలువ ఏదో జంతువును మింగి ఊపిరాడక చనిపోయింది. చచ్చిపడి ఉన్న కొండచిలువను గుర్తించిన మీడియా సిబ్బంది సీఎం భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. అనంతరం కొండచిలువ కళేబరాన్ని అక్కడి నుంచి తొలగించారు.

ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ రాజీనామా ఆమోదం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ జల్లా సుదర్శనరెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. కడప జిల్లాకు చెందిన న్యాయవాది సుదర్శనరెడ్డిని 2021, జూన్ 15న వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో వెలువడిన ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో జూన్ 10న తన రాజీనామాను సమర్పించిన సుదర్శనరెడ్డి వెంటనే ఆమోదించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఆయన రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గురువారం అధికారంగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉద్యోగ భద్రత కల్పించండి

» ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గురువారం ఆయన లేఖ రాశారు. "వైద్య గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, నర్సింగ్, బీ ఫార్మసీ వంటి ఉన్నత విద్యార్హతలున్న వారు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో వైద్యమిత్రలుగా, టీం లీడర్లుగా, జిల్లా మేనేజర్లుగా అసోసియేట్లుగా గత 18 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవను ట్రస్టు పరిధి నుంచి తప్పించి, ఆరోగ్య బీమా అమలు పథకం కింద అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆ ట్రస్టులో పని చేస్తున్న సిబ్బంది తమ ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కాబట్టి వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి" అని రామకృష్ణ తన లేఖలో డిమాండ్ చేశారు.

జెత్వానీ కేసు విచారణ కోర్టు మార్పు

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు విచారణ మూడో ఏసీఎంఎం కోర్టుకు బదిలీ అయింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ విజయవాడలోని నాలుగో ఏసీఎంఎం కోర్టులో జరుగుతోంది. ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం జెత్వానీ కేసు దర్యాప్తును విజయవాడ పోలీసుల నుంచి సీఐడీకి బదిలీ చేసింది. దీంతో సీఐడీ అధికారులు కేసు తమకు బదిలీ అయిందని పేర్కొంటూ నాలుగో ఏసీఎంఎం కోర్టులో మెమో దాఖలు చేశారు. ఈ కోర్టు న్యాయాధికారి రామ్మోహన్ విషయాన్ని తెలియజేస్తూ జిల్లా న్యాయాధికారికి లేఖ రాశారు. జిల్లా న్యాయాధికారి ఈ కేసు రికార్డులను మూడో ఏసీఎంఎం కోర్టుకు అందజేయాలని గురువారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల్లోనూ కోటా

» దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ డిమాండ్

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్, ఏపీ శాఖ అధ్యక్షుడు లెక్కపోగు జయరాజ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన నూతన పారిశ్రామిక విధానంలో ఏపీఐఐసీ ద్వారా తక్కువ ధరకు భూమి, పన్నుల మినహాయింపు, ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలను కలుపుకుంటే ఒక ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులో 80 శాతానికి పైగా రాష్ట్ర ప్రభుత్వ సహకారమే ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోవడం దారుణమన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌తోపాటు రూ.50 లక్షల సబ్సిడీ కూడా ఇస్తున్నారని తెలిపారు.

ఎక్సైజ్ ఈడీగా రాహుల్‌దేవ్ శర్మ

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా డీఐజీ ర్యాంక్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ శర్మను నియమిస్తూ సాధారణపరిపాలనశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఇంద్రధనస్సు సర్వే మెటీరియల్ ఇవ్వండి

లబ్బీపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాలలోపు పిల్లలకు పెండింగ్‌లో ఉన్న టీకాలను గుర్తించి వాటిని అందించేందుకు కేటాయించిన ఇంద్రధనస్సు సర్వే మెటీరియల్‌ని వెంటనే సప్లయ్ చేయాలని లేని పక్షంలో సర్వే నిలుపుదల చేస్తామని ఆశా వర్కర్స్ యునియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. రాణిగారితోట కార్యాలయంలోని సిటూ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో నేటి నుంచి నవంబరు 5 వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఇంద్రధనస్సు సర్వే చేయాలని జిల్లా అధికారులు పిలుపునిచ్చారని, కాని దానికి అవసరమైన మెటీరియల్స్ సప్లయ్ చేయకుండా ఆశా వర్కర్‌లకు వాట్సాప్ ద్వారా ఆ ఫార్మెట్‌లు పెట్టి జిరాక్స్‌లు తీయించుకోమని అధికారులు చెబుతున్నారని అది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 10 రోజులకు జిరాక్స్‌లు తీసుకోవడంతో పాటు కొత్త పుస్తకం కూడా కొనుక్కొని ఫార్మెట్‌లో ఉన్న కాలమ్స్ రాసి సర్వే పూర్తి చేసి ఇవ్వాలని లేని పక్షంలో షోకాజ్ నోటీస్ ఇస్తామని ఆశా వర్కర్‌లపై ఒత్తిడి చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని అన్నారు. తెలుగులో ఉండవలసిన ఫార్మెట్‌లు ఇంగ్లీషులో ఉండటంతో సర్వేకు మరింత ఇబ్బంది ఏర్పడిందని రోజుకు 30 నుండి 80 ఇళ్ళు సర్వే చేయాలని చెబుతున్నారని క్షేత్ర స్థాయిలో ఇది అవ్వటం చాలా కష్టమని అన్నారు. ఈ సర్వేకు అధికారులు రావాల్సి ఉండగా ఆశా వర్కర్ల మీదే మొత్తం పని వదిలేయటం సరైంది కాదని అన్నారు. అనంతరం డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

నందిగం బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ పోలీస్ కస్టడీలో వెల్లడించిన వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని పోలీసుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురువారం హైకోర్టును అభ్యర్థించారు. వాదనల కోసం విచారణను వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన మరియమ్మ హత్య కేసులో బెయిల్ కోరుతూ సురేశ్ హైకోర్టులో పిటిషన్ చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా సురేశ్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. రెండువర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఘటనలో మహిళ మృతి చెందారని, ఘటన జరిగిన నాలుగేళ్ల తర్వాత పిటిషనర్‌ను 78వ నిందితుడిగా చేర్చారని, మొదటి ఎఫ్ఐఆర్‌లో 36మందిని నిందితులుగా చేర్చారన్నారు. వారికి 2021లోనే ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మారిన తరువాత సాక్షులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌పై రాజకీయ కారణాలతో కేసు పెట్టారన్నారు. పోలీస్ కస్టడీ సైతం ముగిసినందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు.



మాజీ ఎంపీ నందిగం సురేశ్ సీఆర్డీఏ భూములను ఆక్రమించి నిర్మించిన పాకలను తొలగిస్తున్న అధికారులు

నందిగం సురేశ్ ఆక్రమణల తొలగింపు

» కార్యాలయం, ఇళ్ల తొలగింపునకు రేపటి వరకు గడువు

తుళ్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఆక్రమణలో ఉన్న సీఆర్డీఏ భూములను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉద్దండ్రాయునిపాలెం సీడ్‌రోడ్ వెంబడి రెండు ఎకరాల్లో సురేశ్ కార్యాలయం, ఆయనను కలవడానికి వచ్చే జనం కోసం మూడు పాకలు నిర్మించారు. అనుచరుల కోసం రెండు ఇళ్లు నిర్మించారు. ఈ ఆక్రమణలను తొలగించేందుకు సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు, తుళ్లూరు సీఐ-1 గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే శుక్రవారం వరకు సమయం ఇవ్వాలని ఎంపీ బంధువులు, అనుచరులు కోరడంతో అధికారులు సమ్మతించారు. పాకలను, ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఇటీవల నోటీసులివ్వడంతో పంచాయతీ అనుమతులున్నాయని హైకోర్టుకు వెళ్లారు. తీరా చూస్తే పంచాయతీ అనుమతులు లేవని తేలింది. అప్పటి కార్యదర్శి ఏడుకొండలు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఆక్రమణల తొలగింపు చేపట్టిన ప్రాంతం సీఆర్డీఏ స్టార్టప్ ఏరియా కిందకు వస్తుందని అధికారులు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131, 140, 151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

రైతుబజార్‌లో సబ్సిడీపై ఉల్లి, టమోటా విక్రయాలు

పటమట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. సామాన్యులు కొనలేని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లలో ఉల్లిపాయలు, టమోటాలను సబ్సిడీ ధరలపై విక్రయిస్తున్నారు. పటమట రైతుబజార్‌లో ఉల్లిపాయలు కేజీ రూ.36లు, టమోటాలు కేజీ రూ. 37 కు విక్రయాలు చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి కరుణాకర్ తెలియజేశారు. ఈ నెల 5 నుంచి సబ్సిడీపై ఉల్లి, టమోటాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చే వరకు సబ్సిడీపై విక్రయాలను కొనసాగిస్తామన్నారు.

పథకం పేరు మారినా పూర్తికాని పనులు

● అప్పుడు నాడు-నేడు, ఇప్పుడు మన బడి-మన భవిష్యత్ ● బీఎస్ఆర్‌కేలో నిధులు లేక ఆగిన పనులు ● రావాల్సిన నిధులు రూ.50 లక్షల పైనే

(మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి)

మొగల్రాజపురం బోయపాటి శివరామ కృష్ణయ్య ప్రాథమికోన్నత పాఠశాలలో వైసీపీ హయాంలో 2022లో నాడు- నేడు రెండో దశలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎన్నికల ముందు వరకు జరిగిన పనులు చివరి దశకు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం తో పాటు నాడు- నేడు కూడా పోయి టీడీపీ ప్రభుత్వం రావడంతో మన బడి- మన భవిష్యత్‌గా పథకం పేరు మార్చుకున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. ఈ పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనుల నిమిత్తం మొత్తం 2కోట్ల45 లక్షల40వేల566 రూపాయలు నాడు- నేడు కింద అంచనాలు వేసి రివాల్వింగ్ ఫండ్ కింద మొదటి విడత రూ.36 లక్షలు ఇచ్చారు. 2022 మేలో పనులు ప్రారంభించారు. ఎన్నికల పేరుతో ఏప్రిల్‌లో పనులు నిలిపివేశారు. వాస్తవానికి వైసీపీ హయాంలోనే నిధుల కొరతతో పనులు ఆగినట్లు సమాచారం. కేటాయించిన దాంట్లో ఇంకా మంజూరు చేయాల్సింది సుమారు రూ.55 లక్షలు. ఈ నిధులు వస్తే మిగిలిన పనులు కూడా పూర్తి చేసేయవచ్చు. కానీ అధికారులు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణం పూర్తయినా రంగులు వేయని గోడలు, తరగతి గదుల్లో గ్రిల్స్ లేని కిటికీలు, రంగులు లేని గోడలు, అసంపూర్తిగా వంటగది నిర్మాణం

● వెయ్యి మందికి పైగా విద్యార్థులు

చుట్టుపక్కల ఐదు డివిజన్ల నుంచి పేద మధ్య తరగతి పిల్లలు ఈ పాఠశాలకు వస్తుంటారు. ప్రస్తుతానికి వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. పెండింగ్ పనులు అన్నీ పూర్తయితే విద్యారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

● చేయాల్సిన పనులు

పనులు పూర్తయిన చోట రంగులు వేయాలి, కొన్ని కిటికీలు బిగించాలి. మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలి, ఆర్‌వో ప్లాంట్‌కు, సైకిల్ స్టాండ్‌కి షెడ్ వేయాలి, ప్రహరి, గేటు పెట్టాలి, పాత్ వే వేయాలి, గ్రీన్ చాక్ బోర్డులు రావాలి, సౌండ్ సిస్టం పెట్టాలి

నిధుల కేటాయింపు	రూపాయల్లో
14 అదనపు తరగతి గదులు	1,51,40,631
ప్రహరీ నిర్మాణం నిమిత్తం	5,64,849
ఎలక్ట్రికల్ వర్క్	8,45,447
గ్రీన్ చాక్ బోర్డులు	2,24,638
తాగునీటి నిమిత్తం ఆర్‌వో ప్లాంట్	5,87,491
వంట షెడ్	3,55,908
టాయిలెట్స్ రన్నింగ్ వాటర్ పనులు	19,32,125
ఫర్నిచర్	12,69,080
పాఠశాల మొత్తం పెయింటింగ్ పనులు	8,48,620
మేజర్, మైనర్ మరమ్మతులకు	27,71,777

విద్యార్థులకు కుళాయి నీళ్లే దిక్కు

తాడికొండ సుబ్బారావు పాఠశాలలో పనిచేయని వాటర్ కూలర్

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)



గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు అంటూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికసదుపాయాల ఏర్పాటు మూన్నాళ్ళ ముచ్చటే అయింది. రాణిగారితోటలోని తాడికొండ సుబ్బారావు పాఠశాలలో కూడా నాడు- నేడులో భాగంగా భవన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇదిలా ఉంటే పాఠశాలలో విద్యార్థుల కోసం నాడు- నేడులో భాగంగానే వాటర్ కూలర్‌ను గత ఏప్రిల్‌లో ఏర్పాటు చేశారు. కేవలం నెలరోజులు మాత్రమే పని చేసిన కూలర్ తరువాత పనిచేయకుండా పోయింది. అప్పటి నుంచి దీనిని మరమ్మతులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు స్కూల్ సిబ్బంది ఎన్నిసార్లు చెప్పినా వారు పెడచెవిన పెడుతున్నారు. దీంతో పాఠశాల విద్యార్థులు మున్సిపల్ వాటర్ తాగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలర్ మరమ్మతులు చేయాలని విద్యార్థులు, స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నవంబరు 16,17 తేదీల్లో ఈషా గ్రామోత్సవం

ఆటోనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రభుత్వ కళాశాల మైదానంలో నవంబరు 16,17 తేదీల్లో 16వ ఈషా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈషా వలంటీర్, ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ గన్నె శివలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యువతరం ఆరోగ్యమైన జీవనశైలి వైపు మళ్లేందుకు ఈ గ్రామోత్సవం ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని వెల్లడించారు. పోటీలో పాల్గొన్న జట్లకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్‌కు 83000 30999ను సంప్రదించాలని కోరారు.

త్వరలో స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తాం

ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో త్వరలోనే స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధి నాల్గవ డివిజన్ గురునానక్ కాలనీలోని గురుద్వార్ మెయిన్ రోడ్డులో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగద్దె రామ్మోహన్‌లు పర్యటించారు. అనంతరం రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె, స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు పట్టుపట్టి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సైడు కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ గురుద్వార్ రోడ్డును సుమారు రూ.35 లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్డుగా నిర్మాణ పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్రసింగ్ సహనీ, పరన్ దీప్ సింగ్, కుల్దీప్‌కౌర్, మన్మోహన్ సింగ్, అరవింద్ సింగ్, కుల్దీప్‌సింగ్, రాజమణి, చలసాని రమణ, కోడూరు అంజనేయులు వాసు, సాంబశివరావు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.



గురుద్వార్ రోడ్లో పర్యటిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె తదితరులు

చెట్లు నరికారు...మోడుపై యాసిడ్ పోశారు

● కృష్ణలంక భ్రమరాంబపురంలో ఘటన ● గుర్తుతెలియని వ్యక్తులు యాసిడ్ పోయడంపై స్థానికుల ఆగ్రహం

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

పర్యావరణ పరిరక్షణకు, మానవాళి మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమని తెలిసినా కొందరు ప్రబుద్ధులు చెట్లను నరికివేస్తూ చాలా పెద్ద తప్పు చేస్తున్నారు. అటువంటి సంఘటన కృష్ణలంక భ్రమరాంబపురంలో జరిగింది .

అయితే అక్కడ చెట్టును నరకడమే కాకుండా మళ్లీ అది చిగురించకుండా యాసిడ్ పోయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భ్రమరాంబపురం కోతమిషన్ రోడ్డులోని వంగవీటి మోహనరంగా విగ్రహం ఎదురుగా రోడ్డుపై కార్పొరేషన్ నాటిన చెట్లు ఉన్నాయి. ఎన్నో సంవత్సరాలుగా చల్లని నీడ ఇస్తున్న చెట్లను గతంలో ఎవరో మొదలు వరకు నరికేశారు.

అయితే కొన్ని రోజులకు ఆ మోడులు మళ్లీ చిగురించడం ప్రారంభించాయి. ఈ సందర్భంలోనే అక్కడ మొదలు వరకు నరికిన ఓ చెట్టును పెరగకుండా గుర్తుతెలియని వ్యక్తులు యాసిడ్ పోస్తున్నారు. దీనిని గమనించిన స్థానికులు పచ్చని చెట్టు పెరగకుండా యాసిడ్ పోయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



పచ్చని చెట్లను నరికిన ప్రాంతం, యాసిడ్ పోయడంతో కాలిన మోడు

యాసిడ్ పోసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెట్లను నరకడమే కాకుండా మళ్లీ పెరగకుండా యాసిడ్ పోయడం చాలా దారుణం. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి. స్థానికంగా విచారణ చేసి మళ్లీ ఆ విధంగా జరగకుండా స్థానికులను అప్రమత్తం చేస్తా.

\- కొండారెడ్డి, కార్పొరేటర్

మోడుకు ఫెన్సింగ్ వేసి కాపాడతాం

చెట్లు నరకడంపై ఎటువంటి అనుమతి తీసుకున్నట్లు తనకు సమాచారం లేదు. యాసిడ్ పోస్తున్న చెట్టు మోడును పరిశీలించి రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. ఇకపై దానిపై దృష్టి సారించి చెట్టు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

\- దానయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్

టాటా మోటార్స్ దేశ్ కా ట్రక్ ఉత్సవ్



మాట్లాడుతున్న వై.వీ ఈశ్వరరావు

ఆటోనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో టాటా హెవీ కమర్షియల్ వాహనాలు వినియోగదారులకు మరింత అందుబాటులోకి వస్తాయని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వై.బీ ఈశ్వరరావు, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమోతు రాజా అన్నారు. గురువారం స్టెల్లా కాలేజీ ఇండోర్ స్టేడియంలో టాటా మోటార్స్, జాస్పర్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో టాటా మోటర్స్ దేశ్ కా ట్రక్ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవ్‌లో ఆధునిక, సాంకేతికత కలిగిన ట్రక్స్, టిప్పర్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టాటా మోటార్స్ ఏరియా మేనేజర్ ఎస్.భరణిధరన్, టెరిటరీ సేల్స్‌మేనేజర్ ప్రసాద్, స్టేట్ సర్వీస్‌హెడ్ ఎల్.రాజేంద్ర ప్రసాద్, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణరావు, టాటాకంపెనీ ప్రతినిధులు, కస్టమర్లు, వినియోగదారులు, ఫైనాన్షియర్స్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భారతీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆసుపత్రి సెంటర్ నుంచి గుణదలకు వెళ్లే పులేటి కాల్వ (పోస్టాఫీస్) రోడ్డులోని మున్సిపల్ వాటర్ పైపును గురువారం నగర పాలక సంస్థ సిబ్బంది మరమ్మతు చేసి లీకేజీని నివారించారు. తాగునీటి పైపు ధ్వంసం అనే శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో స్పందించిన నగర పాలక సంస్థ అధికారులు ఉదయం సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు. ఇది చూసిన స్థానికులు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కూటమి చర్యలు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆటోనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కృషి చేసేది కూటమి ప్రభుత్వమేనని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాడు కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తునే ఆటోడ్రైవర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనారు. ఆటోడ్రైవర్ల జీవనోపాధి మెరుగుపడటానికి బీజేపీ, జనసేన, టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, రాయవరపు అశోక్, మొకర ఆదిబాబు, వీర్ల నాగబాబు, సుంకర దుర్గాప్రసాద్, వెంకట కిషోర్, రమేష్ నాయుడు, నాగబాబు, సురేష్, బాలు, దుర్గారావు పాల్గొన్నారు.



ఆటోస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె

అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ విజేత ఎస్ఆర్ఆర్

గుణదల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీల్లో ఎస్ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీల్లో రెండోరోజు గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మొదటగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నలందపై 31-17 స్కోర్‌తో విజయం సాధించిందని చెప్పారు. ఎస్ఆర్ఆర్ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల, పీబీఎస్ కళాశాల ఏజి అండ్ ఎస్జి కాలేజి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి స్థానాల్లో నిలిచాయని అన్నారు. ట్రోఫీ గెలుపొందిన ఎస్ఆర్ఆర్ కళాశాల టీమ్‌కు ట్రోఫీని అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుతున్నట్లు చెప్పారు. కబడ్డీ పోటీల్లో డీఎస్సీ కబడ్డీ కోచ్ జగదీష్, ఎస్ఆర్ఆర్ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ డి.యుగంధర్ అభినందనలు తెలిపారు.



ఆహారం పంపిణీ చేస్తున్న సేవాసమితి వలంటీర్లు

అన్నార్తుల అన్నపూర్ణ

పదేళ్లుగా 'పేట'లో అన్నపూర్ణ సేవా సమితి సేవలు

వివాహ వేడుకలు, పుట్టినరోజు, పెళ్లిరోజు ఏదైతైనేమి..ఇటీవల కాలంలో ఇళ్లల్లో, ఫంక్షన్ హాళ్లలో నిర్వహించే వేడుకల్లో ఫలహారాలు, విందుభోజనాలు, పాన్‌లకు రూ.లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. కీర్తి, పేరు కోసం ఒకరు 30 రకాలతో విందు భోజనాలు పెడితే పోటీగా మరొకరు 40 రకాలు పెడుతున్నారు. వేడుకలకు వచ్చిన వారు తిన్నంత తినేసి, మిగిలిన ఆహారాన్ని డస్ట్‌బిన్లలో పడేస్తున్నారు. వేడుకల్లో పెట్టే ఆహారం వృథా కాకుండా.. అర్ధాకలితో అలమటించే వారికి ఒక్క రోజైనా కడుపునిండా ఆహారం పెట్టాలనే సంకల్పం నుంచి పుట్టిందే అన్నపూర్ణ సేవా సమితి. తన మిత్రుల ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పారేయడాన్ని చూసిన జగ్గయ్యపేట ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు మహంకాళి జయప్రకాశ్ అన్నపూర్ణ సేవా సమితిని ప్రారంభించారు. వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని 2014 ఏప్రిల్ 2 నుంచి పేదలకు పంచడం ప్రారంభించారు. అర్ధాకలితో అలమటించే వారి పాలిట సమితిని అన్నపూర్ణగా మార్చారు.

- వేడుకల్లో ఆహార వృథాకు అడ్డుకట్ట
- మిగిలిపోయిన ఆహారం సేకరణ
- పేదవాడలకు పంపిణీ.. ఏటా లక్ష మందికిపైగా అందజేత

(ఆంధ్రజ్యోతి- జగ్గయ్యపేట)

వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని అన్నపూర్ణ సేవా సమితి సేకరించి, పంచుతున్నా మొదట్లో తీసుకునేందుకు పేదలు ముందుకొచ్చేవారు కాదు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహంకాళి జయప్రకాశ్ చొరవతో తొలుత పిల్లలు, తర్వాత పెద్దలు తీసుకోవడం ప్రారంభించారు. ఫంక్షన్ల నిర్వాహకులు కూడా పేదలకు ఒక పూట ఆహారం పెట్టినట్టు అవుతుందని జయప్రకాశ్‌ను పిలిచి మిగిలిన ఆహారాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చారు. ప్రారంభించిన తొలినాళ్లలో ఏడాదికి 50 నుంచి 60 రోజులు ఆహార పంపిణీ చేస్తే, పదేళ్ల గడిచేటప్పటికి ఏడాదికి 300 రోజులకు పైగా పంపిణీ చేస్తున్నారు. జయప్రకాశ్ ఆలోచన నచ్చిన స్నేహితులు, తోటి వ్యాపారులు ఆహార పంపిణీలో భాగస్వాములవడంతో కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది.

ఏటా రూ.కోటి విలువైన ఆహారం సద్వినియోగం

పట్టణంలోని మిట్టగూడెం యానాదుల కాలనీలో ప్రారంభమైన కార్యక్రమం, పేదలవాడలన్నింటికీ విస్తరించింది. ఏటా లక్ష మందికిపైగా ఆహారం అందిస్తోంది. రూ.కోటికి పైగా ఆహారాన్ని వృథా కాకుండా పేదల కడుపు నింపుతోంది. పదేళ్లలో రూ.10కోట్ల విలువైన ఆహారం సద్వినియోగమైంది.

ఫోన్ చేసి..సమాచారమిస్తే చాలు

జగ్గయ్యపేటతో పాటు, గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో ఆహారం మిగిలితే సేవాసమితికి ఫోన్‌చేసి సమాచారమిస్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి జగ్గయ్యపేట సరిహద్దుగా ఉండటంతో కోదాడ, హుజూర్‌నగర్, నందిగామ ప్రాంతాలకు కూడా సేవలు విస్తరించాయి. రెండేళ్ల క్రితం నందిగామలో అక్కడి వ్యాపారులు, యువకులు కొందరు జయప్రకాశ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ సేవా సమితిని ప్రారంభించారు.

200 మంది వలంటీర్ల నిస్వార్థ సేవలు

ఆహారం ఉందని ఫోన్ రాగానే సేవాసమితి ప్రతినిధులు ఆహార పరిమాణం మేరకు సొంతంగా సమకూర్చుకున్న సామగ్రితో బైక్‌లపై వెళతారు. పెద్ద మొత్తమైతే ఆటోలు ఇతర వాహనాలు తీసుకెళతారు. ఫంక్షన్ హాలు నుంచి ఆహారం సకాలంలో అందితే నేరుగా వాడలకు వెళ్లి పంచేస్తారు. అర్ధరాత్రి అయితే వాటిని జయప్రకాశ్ ఇంటికి తీసుకెళ్లి జాగ్రత్త చేస్తారు. వేడిగా ఉన్న ఆహారమైతే ఇంట్లో నేలపై వస్త్రం వేసి ఆరబెడతారు. అవి పాడైపోకుండా చూస్తారు. ప్రకాశ్‌తో పాటు ఆయన భార్య, పిల్లలు సహకరించి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఆహార పంపిణీకి సేవా సమితి వలంటీర్లు 200 మంది ఉన్నారు. వారంతా సొంతవృత్తులను, వ్యాపారాలను చూసుకుంటూనే ఈ సేవలు అందిస్తారు. వారిలో 30 నుంచి 50 మంది నిత్యం ఆహార పంపిణీకి సిద్ధంగా ఉంటారు.

పదేళ్లుగా నిరాటంకంగా..

ఆహార వృథాను అరికట్టేందుకు జయప్రకాశ్ క్లీన్‌ప్లేట్ కంటెస్ట్‌ను నిర్వహించారు. తన కుమార్తె కార్యక్రమంలో ఆహారం వృథా చేయకుండా విందు ఆరగించినవారికి బహుమతులు అందించారు. కరోనా సమయంలో వివాహాది శుభకార్యాలు నిలిచిపోవడంతో విత్రుల సహకారంతో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. మిట్టగూడెంలో పేదవిద్యార్థుల కోసం కొంత కాలం పాఠశాలను నడిపారు. వృథా ఆహారంతో పాటు పాతవస్త్రాలను సేకరించి పేదవాడల పిల్లలకు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల వరదల సమయంలో సామాజిక బాధ్యతగా ఆహారం వండించి పంపిణీ చేశారు. పాత వస్త్రాలను సేకరించి అందించారు. పట్టణానికి వచ్చే మతిస్థిమితం లేని వ్యక్తులకు ఆహార పొట్లాలను అందించారు. ఫంక్షన్ల నిర్వాహకుల నుంచి రూపాయి తీసుకోకుండా సొంతంగానే ఆటోలు, రవాణా వాహనాలు, ఆహారం సరఫరాకు ఉపయోగించే పాత్రలు జయప్రకాష్ కొనుగోలు చేశారు. పదేళ్లుగా నిరాటంకంగా సేవలు అందిస్తూనే ఉన్నారు. పదేళ్లుగా తనతోపాటు నిస్వార్థ సేవలు అందించిన సేవాసమితి వలంటీర్లను ఆదివారం సేవాసమితి వ్యవస్థాపకుడు జయప్రకాశ్ ఆధ్వర్యంలో సత్కరించారు.

ప్రముఖుల ప్రశంసలు

ఆహార వృథాను అరికట్టడంతో పాటు, పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ సేవా సమితి గురించి తెలుసుకున్న మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తనవద్దకు పిలిపించుకుని సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, గురుధామ్ వ్యవస్థాపకుడు, తాత్వికుడు గెంటేల వెంకటరమణ, గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకుడు, తాత్వికుడు చిట్టా లక్ష్మీనర సింహశాస్త్రి తదితరులు సేవాసమితి సేవలను ప్రశంసించారు.



మహంకాళి జయప్రకాష్, వలంటీర్లను అభినందిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు(ఫైల్)

ఆహార వృథాను తగ్గించాలన్నదే లక్ష్యం



ఆహార వృథాను అరికట్టాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. పదేళ్ల క్రితం ఆంధ్రజ్యోతి ఆదివారం పుస్తకంలో వచ్చిన ఒక వ్యాసం నన్ను ఆలోచింపజేసింది. సేవాసమితి ద్వారా వృథా అవుతున్న ఆహారాన్ని పేదలకు అందించి వారి ఆకలి తీరుస్తున్న తృప్తే.. పదేళ్లుగా ఈ మహాయజ్ఞాన్ని నడిపిస్తోంది.

- మహంకాళి జయప్రకాష్, అన్నపూర్ణ సేవాసమితి వ్యవస్థాపకుడు

కందిపప్పు, పంచదార ఫుల్

- ఐదేళ్ల తర్వాత రేషన్ డిపోలకు..
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 పైనే
- రేషన్ దుకాణంలో కిలో రూ.67
- కార్డుదారులందరికీ నవంబరులో సరఫరా
- సీఎంకు డీలర్ల ధన్యవాదాలు

(ఆంధ్రజ్యోతి-మొగల్రాజపురం)

ఐదేళ్ల తర్వాత రేషన్‌డిపోలకు ఫుల్లుగా కందిపప్పు, పంచదార వచ్చిం ది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్న క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలు ఇస్తూ కార్డుదారులకు ప్రతినెలా కందిపప్పు, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు అందించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వమొచ్చాక డోర్ డెలివరీ పేరుతో ఎండీయూ వాహనాలు తీసుకొచ్చింది. సరుకుల్లో కోతపెట్టి కార్డుదారులకు బియ్యంతో సరిపుచ్చింది. అడపాదడపా ఒక్కో షాపునకు క్వింటా, అరక్వింటా కందిపప్పు, సగం పంచదార ఇచ్చేవారు. టీడీపీ హయాంలో కందిపప్పు కిలో రూ.40, పంచదార అరకిలో రూ.6.50 ఉండేవి. వైసీపీ ప్రభుత్వం రాగానే కందిపప్పు కిలో రూ.67, పంచదార అరకిలో ప్యాకెట్ రూ.17కు పెంచింది. ధర పెంచినా సరుకులు పూర్తిగా ఇచ్చేవారు కాదు. కార్డుదారులకు సరుకులు లేక డీలర్లకు కమీషన్ రాక ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వమొచ్చాక సీఎం చంద్ర బాబు, మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష నిర్వహించారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు రూ.కిలో 180కి పైగా పలుకుతుండడంతో రాష్ట్రం లోని కార్డుదారులందరికీ కందిపప్పు అందించాలనే లక్ష్యంతో రెండు నెలల క్రితం టెండర్లు పిలిచారు. గత నెల సరఫరాదారుల నుంచి సరుకు రావడం మొదలైంది. ఈనెల 20వ తేదీకే అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు సరు కులు పూర్తిగా తరలించి సిద్ధంగా ఉంచారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 11,31, 103 కార్డులు ఉన్నాయి. ఎన్టీయార్ జిల్లాలో 5,97,815 కార్డులు, కృష్ణాజి ల్లాలో 5,33,288 కార్డులు ఉన్నాయి. నవంబరులలో కార్డుదారులందరికీ కందిపప్పు, పంచదార ఇవ్వబోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంది పప్పు రూ.180 ఉండడంతో సామాన్యుడు ఇబ్బంది పడకుండా రైతు బజా ర్లలో ఇప్పటికే కందిపప్పు కౌంటర్లు తెరచి కిలో రూ.110కే అందిస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత డీలర్ల ఆనందం

కరోనా కాలం నుంచి మోదీ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన కమీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల గోడౌన్ ఖాతాలో వేసింది. ఈ కమీషన్‌తో కంది పప్పు, పంచదార విడిపించుకునే అవకాశం లేక కమీషన్ పూర్తిస్థాయిలో చేతికి రాక డీలర్లు గతంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. తాజాగా సీఎం చంద్రబాబు నిర్ణయంతో డీలర్లు గోడౌన్ ఖాతాలో ఉన్న కమీషన్‌తో ఈనెల కందిపప్పు, పంచదార విడిపించుకుంటున్నారు. ఐదేళ్ల తర్వాత దుకాణాలకు పూర్తిస్థాయిలో సరుకులు వచ్చాయని కందిపప్పు, పంచదార కమీషన్ రూపంలో కాస్తంత ఆదాయం పెరుగుతుందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నారు.

మర్యాదపూర్వకంగా..

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ అనురాధకు ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అభినందనలు తెలిపారు. ఎంజీ రోడ్డులోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనురాధకు పుష్పగుచ్ఛం అందించారు.



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

కంచికచర్లలో రియల్ కుదేల్

(ఐదో పేజీ తరువాయి)

పైగా వ్యాపారులు దెబ్బతిన్నారు. తీవ్రంగా నష్టపోవటంతో తట్టుకోలేక కొంత మంది బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. అలాంటిది ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దగ్గర నుంచి మళ్లీ ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు ఎగబాకాయి. క్రయవిక్రయాలు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అసాధారణంగా పెరిగాయి. ఇతర ప్రాంతాల వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, లాయర్లు, వైద్యులు, ఇతరత్రా మధుపరులు, కొనుగోలుదారుల హడావిడి ఎక్కువైంది.

రాష్ట్ర విభజన తర్వాత..

రాష్ట్ర విభజన తర్వాత పరిటాల బైపాస్ రోడ్డులో ఎకరం రూ.3.65 కోట్లకు చేరింది. కృష్ణానది తీరాన గనిఆత్కూరు వెళ్లే రోడ్డులో అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాల వరకు పరిటాల పరిధిలో ఎకరం గరిష్ఠంగా రూ.2 కోట్లు పలికింది. చెవిటికల్లు రోడ్డులో బత్తినపాడు పరిధి వరకు రూ.1.80 కోట్లు, కొత్తపేట, చెవిటి కల్లు, కునికినపాడు, మున్నలూరు గ్రామాల పరిధిలో కూడా భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఎకరం ధర గరిష్ఠంగా రూ.1.40 కోట్లు పలికింది. కంచికచర్లను ఆనుకుని ఉన్న వీరులపాడు మండలంలో కూడా ధరలు అమాంతం పెరిగాయి. కంచికచర్ల నుంచి మధిర వెళ్లే రోడ్డులో ఎకరం రూ.2 కోట్లు పలికింది. జుజ్జూరు, అల్లూరు గ్రామాల పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన రూ.80 లక్షల నుంచి రూ.1.20 కోట్లకు కొన్నారు. ఇక జాతీయ రహదారి వెంబడి అయితే.. దేవినేని రమణ ఘాట్, మిక్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతంలో ఎకరం రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు బేరం వచ్చినప్పటికీ క్రయ విక్రమాలు జరగలేదు. మూడు నెలలుగా మూడు పూలు, ఆరు కాయలుగా విరాజిల్లిన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు అకస్మాత్తుగా మందగించింది. అరకొర తప్పితే చెప్పుకోదగిన స్థాయిలో క్రయవిక్రయాలు జరగలేదు. ఇతర ప్రాంతాల కొనుగోలుదారులు ఇక్కడకు రావట్లేదు.

రియల్ వ్యాపారుల్లో ఆందోళన

ఎంతో ఆశతో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టిన పలువురు వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భూములను అమ్ముదామంటే కొనేవారు లేకుండాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కొన్న భూములను విక్రయ రిజిస్ట్రేషన్ చేసి తీసుకొచ్చిన అప్పులు చాంతాడులా పెరుగుతున్నాయి. అడ్వాన్సులు చెల్లించిన కొంతమంది మిగతా సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెనుకాడుతున్నారు. వాయిదాలు అడుగుతూ గడువు పెంచుతున్నారు. అలాగని తక్కువ ధరకు అమ్మేందుకు రైతులెవరూ ముందుకు రావట్లేదు. దీంతో పరిస్థితి ఏమిటన్నదీ ఎవరికీ అర్థం కావట్లేదు. కంచికచర్ల మీదుగా వెళ్లే అమరావతి-ఎర్రుపాలెం రైల్వే లైనుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటం, కంచికచర్లను ఆనుకుని వెళ్లే అవుటర్ రింగు రోడ్డుకు మోక్షం కలగటం (ఓఆర్ఆర్), ఇప్పటికే సీఎం చంద్రబాబు గతంలో శంకుస్థాపన చేసిన దాములూరు-వైకుంఠపురం రిజర్వాయర్ కమ్ బ్రిడ్జి కంచికచ ర్లకు సమీపంలో ఉండటం, ఆరులైన్లుగా జాతీయ రహదారి విస్తరణ ప్రతిపాదన కార్యరూపం దాల్చనుండటం, ఇంకా కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు ఏర్పాటు కానుండటం వల్ల రియల్ ఎస్టేట్ రంగం తప్పకుండా పుంజుకుంటుందన్న ఆశాభావంలో రియల్టర్లు, రైతులు ఉన్నారు.

65 ప్లస్ సింగిల్స్ విజేతగా శ్రీనివాసరెడ్డి

- ముగింపు దశకు ఐస్టా టెన్నిస్ టోర్నీ

విజయవాడస్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆకాశమే హద్దుగా చెమటోడ్చి ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ(ఐస్టా)లో పలు రాష్ట్రాల ప్లేయర్లు ట్రోఫీలను, ప్రైజ్‌మనీలను వశం చేసుకున్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న ఐస్టా టోర్నీలో 65 ప్లస్ సింగిల్స్ ఫైనల్స్‌లో శ్రీనివాసరెడ్డి ఫలచంద్రపై 6-2, 6-3 తేడాతో టైటిల్‌ను వశం చేసుకున్నారు. 75 ప్లస్ డబుల్స్‌లో రామకృష్ణ, భాస్కరరావు జోడి శేషసాయి, పీఎస్‌నాయుడు జంటపై 9-4తో గెలిచి డబుల్స్ టైటిల్‌ను వశం చేసుకోగా, 70 ప్లస్ సింగిల్స్‌లో సేతు రాధాకృష్ణమూర్తిపై 6-3, 6-1 తోను, 70 ప్లస్ డబుల్స్‌లో రాంబాబు, సేతు ద్వయం పట్నాయక్, సుందర్ వడివేలుపై 6-0, 6-2తో గెలిచి టైటిళ్లను తమ ఖాతాలో వేసుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో ఐస్టా డైరెక్టర్ రాధాకృష్ణమూర్తి, కన్వీనర్ మల్లికార్జునరావు ట్రోఫీలు, ప్రైజ్‌మనీలు అందజేశారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అమరావతిలో 9 కేంద్రాలు

వన్‌టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత అభివృద్ధికి భూములు ఇచ్చి ప్లాట్లు పొందిన రైతుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏపీసీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు సీఆర్డీయే కార్యాలయంలో ఈ-లాటరీ కార్యక్రమాన్ని రెండో రోజు గురువారం నిర్వహించారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు వారం లోపు రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. భూమిపై ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో రైతులకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. 9 గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీసీఆర్డీయే ల్యాండ్స్ డైరెక్టర్ డీఎల్ఎన్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్‌రాజు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాస నాయక్, తహసీల్దార్ అరుణాదేవి పాల్గొన్నారు.



రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రం అందజేస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్



పతకాలు సాధించిన ఏపీ పారా స్విమ్మర్లు

పారా స్విమ్మింగ్ రాష్ట్ర క్రీడాకారులకు పతకాల పంట

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి 24 పారా స్విమ్మింగ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తా చాటి, 35 పతకాలను సాధించారని ఏపీ పారా స్పోర్ట్సు అసోసియేషన్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గోవా వేదికగా ఈ నెల 22 వరకు ఈ పోటీలు జరిగాయని ఇందులో 16 స్వర్ణాలు, 14 రజతాలు, 5 కాంస్యాలను సాధించారని ఇది చారిత్రక విజయమని కొనియాడారు. పతకాలను సాధించిన స్విమ్మర్లను శాప్ వీసీ, ఎండీ గిరీషా, పారా అసోసియేషన్ సెక్రటరీ వి.రామస్వామి అభినందించారు.

ఫిడే రేటింగ్ చెస్‌లో నీలాష్ సాహా ముందంజ

- మూడోరోజు ఉత్కంఠగా పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా సాగుతున్న భారతీయ నవీన్ క్రీడా ఉత్సవ్(బీఎన్‌కేయూ) తొలి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ నీలాష్ సాహా(2467) ఆరు రౌండ్ల పోరులో ఆరు పాయింట్లతో ముందంజలో నిలిచాడు. మూడో రోజు పోటీలను ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్లూరి భాస్కరరావు, కువైట్‌కు చెందిన బ్రిటిష్ కౌన్సిల్ ఇన్విజిలేటర్ దుగ్గిరాల హరితలు, ఏపీ చెస్ అసోసియేషన్ సీఈవో కేవీ జ్వాలాముఖీలు, ఐకాన్ స్కూల్ డైరెక్టర్ కె రాజేంద్రలు ప్రారంభించారు. పోటీలను షేక్ కాశీం, విత్తనాల కుమార్, చీఫ్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడు పర్యవేక్షిస్తున్నారు.

ముందంజంలో ఉంది..వీరే

ఆరో రౌండ్ పోరులో ఇంటర్నేషనల్ మాస్టర్ శ్రీహరి(2372) తెల్ల పావులతో, నీలాష్ సాహా(2467) నల్లపావులతో పోటీపడ్డారు. వీరిద్దరి మధ్య మ్యాచ్ నాలుగుగంటల పాటు సుదీర్ఘంగా సాగగా, సాహా జయకేతనం ఎగురవేశాడు. వెంకటేష్ ఎంఆర్, శర్వనన్ కృష్ణన్ (తమిళనాడు), కౌత్సవ్ కుందు(వెస్ట్ బెంగాల్) 5.5 పాయింట్లతో కొనసాగుతున్నారు.

విద్యాశాఖ ఎన్టీఆర్ జిల్లా ఏడీ కుమార్ బదిలీ

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎన్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను అన్నమయ్య జిల్లా మదనపల్లె ఉప విద్యాశాఖాధికారిగా నియమించారు. రాష్ట్రంలో 21 మంది విద్యా శాఖాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

దేవాలయాల సందర్శనకు ప్రత్యేక రైలు

ధర్నాచౌక్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దేవాలయాల సందర్శనకు ఇండియన్ రైల్వేస్-భారత్ గౌరవ్ రైలు పథకం కింద సౌత్‌స్టార్ రైల్, టూర్ టైమ్స్ ప్రత్యేక రైలును ప్రకటించిందని టూర్ టైమ్స్ ప్రొడక్ట్ మేనేజర్ విఘ్నేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 5న ప్రారంభమయ్యే ఈ ప్రత్యేక రైలుయాత్రలో కర్ణాటకలోని ప్రముఖ దేవాలయాలను సందర్శించవచ్చని తెలిపారు. తొమ్మిది రోజుల పర్యటనలో వనబృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హొరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రమణ్య, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్కోటేలర్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్‌లలో ఈ రైలును ఎక్కవచ్చని తెలిపారు. థర్డ్ఏసీ రూ.33,000, థర్డ్ఏసీ ప్రీమియం రూ.37,000, సెకండ్ ఏసీ రూ. 40,000గా ప్యాకేజీ నిర్ణయించారని తెలిపారు. వివరాలకు 93550 21516 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

బాణాసంచా దుకాణాలకు దరఖాస్తులు

వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నగరంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్స్ కలిగిన వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మూడు రోజులు విద్యాధరపురం లేబర్ కాలనీలో స్టేడియం కొరకు కేటాయించిన స్థలం, సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు విక్రయదారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయం పనివేళల్లో దరఖాస్తులు పొంది, దాఖలు చేసుకోవాలని ఆయన సూచించారు. అక్టోబరు 28న మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో స్టాల్స్ కేటాయిస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.

మద్యేమార్గం

(ఐదో పేజీ తరువాయి)

మార్చేశారు. వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఈ కథంతా నడిపించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ షాపు నుంచి అన్యాయంగా దారి ఏర్పాటు చేసుకోవడమే కాకుండా మద్యం షాపునకు సంబంధించి నాడు బేవరేజస్ కార్పొరేషన్ నుంచి నెలకు వేలాది రూపాయలను అద్దె రూపంలో వసూలు చేసుకున్నాడన్న విమర్శలున్నాయి.

చేపల మార్కెట్ పర్యవేక్షణ ఎవరిది?

వాస్తవానికి చేపల మార్కెట్లు వీఎంసీ పరిధిలో ఉంటాయి. కొన్ని మార్కెట్ యార్డు పరిధిలో ఉంటాయి. కొన్ని చేపల మార్కెట్లలో మత్స్యశాఖ మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. పటమటలంకలోని చేపల మార్కెట్ ఎవరి పరిధిలోకి వస్తుందో తెలియని పరిస్థితుల్లో ఆ శాఖలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త మద్యం పాలసీ వచ్చాక మొన్నటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు నడిచిన షాపుల్లోనే కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఇచ్చారు. చాలా షాపులను ఇలాగే ఏర్పాటు చేశారు. అలాగే, పటమటలంకలో మద్యం షాపును ఏర్పాటు చేశారు. వైసీపీ హయాంలో ఇక్కడ ఐదేళ్లపాటు మద్యం దుకాణం నడిచిందన్న విషయం స్థానికులకు తెలియకపోవడం గమనార్హం. కొద్దిరోజుల క్రితం మద్యం షాపులకు జరిగిన లాటరీల్లో ఈ షాపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అసలు చేపల మార్కెట్‌కు చెందిన షాపును ప్రైవేట్ భవనంలోని మద్యం దుకాణానికి దారిగా ఎలా ఉపయోగిస్తారన్న ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానం లేదు. మార్కెట్లో మద్యం షాపు ఉందన్న విషయం కూడా తమకు తెలియదని పలువురు అధికారులు చెబుతుండడం విశేషం.

అమరావతికి రైలుకూత

(ఐదో పేజీ తరువాయి)

కృష్ణానదిపై ఐకానిక్ రైల్వేబ్రిడ్జి

కృష్ణానదిపై ఐకానిక్ రైల్వేబ్రిడ్జికి రైల్వే అంగీకరించింది. నదిపై 3.2 కిలోమీటర్ల మేర ఈ బ్రిడ్జిని నిర్మిస్తారు. దీనిని ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తామని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు ప్రకటించారు.

అమరావతి టూ...

అమరావతి రైల్వేలైన్ దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయితో పాటు అన్ని రాష్ట్రాల రాజధానులతో అనుసంధానించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా నగరాలకు మరింత కనెక్టివిటీ ఏర్పడుతుంది. దేశవ్యాప్తంగా మరెన్నో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు అనుసంధానమవుతుంది.

మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం

అమరావతి రైల్వేలైన్ మచిలీపట్నం పోర్టుకు అనుసంధానమయ్యేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీంతో రానున్న రోజుల్లో రాజధానిలో మచిలీపట్నం పోర్టు కీలకపాత్ర పోషించనుంది. ఒక్క మచిలీపట్నం పోర్టుతోనే కాకుండా కృష్ణపట్నం, కాకినాడ పోర్టులకు కూడా అనుసంధానమవుతుంది.

పర్యాటకంగా ప్రాధాన్యం

అమరావతి రైల్వేలైన్ పర్యాటకంగా కూడా ప్రధానపాత్ర పోషించనుంది. పరిటాల ఆంజనేయస్వామి ఆలయంతో పాటు అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలు, ఇతర సందర్శనీయ ప్రాంతాలకు పెద్దసంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశాలున్నాయి.

ఐటీఐలో ఐదో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

భారతీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి, ఐటీఐ కోర్సుల్లో ఐదో విడత అడ్మిషన్లకు, ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా శనివారంలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 28న, ప్రైవేట్ ఐటీఐలో ఈనెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. 9490639639, 7780429468కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.







ఒకరోజు ముందుగానే వస్తున్న పుష్ప2





సుకుమార్ దర్శకత్వంలో అల్లుఅర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రానికి మొదట అనుకున్న విడుదల తేదీ డిసెంబర్ 6. అయితే ఒక రోజు ముందుగా.. అంటే.. డిసెంబరు 5నే థియేటర్లలో సందడి చేయనుంది. నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ విషయాన్ని ఓ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ యెర్నేని మాట్లాడుతూ "ఈ సినిమా యూఎస్ ప్రీమియర్స్ డిసెంబరు 4న ప్రారంభమవుతాయి. లాంగ్ వీకెండ్ కలిసొస్తుందనే ఉద్దేశంతో ఇండియాలోనూ డిసెంబరు 5, గురువారం విడుదల చేస్తున్నాం. అందరి అంచనాలకు మించేలా సినిమా ఉండనుంది" అని చెప్పారు. "అల్లు అర్జున్ ఈ సినిమా కోసం.. తన వంద శాతం ఎఫర్ట్ పెడుతున్నారు. ఆయన బెస్ట్ పర్ఫార్మెన్స్‌ను ఈ చిత్రంలో చూస్తారు. ఈ సినిమాను కొన్న డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో జాతర ఎపిసోడ్ థియేటర్లో పూనకాలు తెప్పిస్తుంది" అని వై.రవిశంకర్ అన్నారు.

ప్రీ రిలీజ్ బిజినెస్ ఇదీ

● 'పుష్ప2' ప్రీ రిలీజ్ బిజినెస్ సుమారు రూ.1000 కోట్లు. ఇందులో ఇప్పటి వరకు అయిన నాన్ థియేట్రికల్ బిజినెస్ రూ.420 కోట్లు

● థియేట్రికల్ రైట్స్ ద్వారా ఏపీ, తెలంగాణ - రూ.220 కోట్లు, నార్త్ ఇండియా - రూ.200 కోట్లు, తమిళనాడు-రూ.30 కోట్లు, కర్ణాటక - రూ.30 కోట్లు, కేరళ- రూ.20 కోట్లు, విదేశీ మార్కెట్-140 కోట్లు బిజినెస్ అయ్యింది.

ఎన్ని థియేటర్లలో..

● విదేశాల్లో అన్ని భారతీయ భాషల్లో కలిపి 3000 లోకేషన్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

● కర్ణాటకలో 500 థియేటర్లలో విడుదలకు ప్లాన్ చేస్తున్నారు. కేజీఎఫ్-2 350 సింగిల్ స్క్రీన్స్, 80 మల్టీప్లెక్స్ థియేటర్లలో రిలీజ్ అయ్యింది. కర్ణాటకలో ఇప్పటి వరకు కేజీఎఫ్, కేజీఎఫ్-2 రూ.90 కోట్లు వసూలు చేసి రికార్డులు సృష్టించాయి. ఇక్కడ తెలుగు సినిమాల్లో బాహుబలి-1 దాదాపు రూ.30 కోట్లు, బాహుబలి-2 రూ.70 కోట్లు, పుష్ప-1 సుమారు రూ.20 కోట్లు వసూళ్లు చేశాయి. అయితే పుష్ప-2 రూ.80 నుంచి 100 కోట్ల వరకు వసూలు చేస్తుందన్న నమ్మకాన్ని కర్ణాటక డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్ వ్యక్తం చేశారు.

● తమిళనాడులో సాధారణంగా రజనీకాంత్, విజయ్, అజిత్ సినిమాలకు మాత్రమే ఓపెనింగ్ రోజు డబుల్ డిజిట్ కలెక్షన్లు వస్తుంటాయి. తాజా చిత్రం 'గోట్'ని 800 స్క్రీన్లలో రిలీజ్ చేశారు. పుష్ప-2ను 539 లోకేషన్లలో 806 స్క్రీన్లలో విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్ మాలి ప్లాన్ చేశారు.

● కేరళలో 24 గంటలూ ఏకధాటిగా షోలు వేయాలని కోరుతున్నామని, తద్వారా విజయ్ సినిమా లియో రికార్డులను బ్రేక్ చేసే అవకాశం ఉంటుందని కేరళ డిస్ట్రిబ్యూటర్ ముకేశ్ మెహతా తెలిపారు. లియో ఓపెనింగ్ డే రికార్డు రూ.12 కోట్లు. దీన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

● నార్త్ ఇండియాతోపాటు పశ్చిమ బెంగాల్‌లో కూడా సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ రెండు ప్రాంతాల్లో కలిపి సుమారు రూ.450 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు వసూళ్లు వచ్చే అవకాశమున్నదని డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడాని ఆశాభావం వ్యక్తం చేశారు.

ధర్మం కోసం పోరాడే యోధుడు



తమిళ హీరో సూర్య నటించిన పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను శివ దర్శకత్వంలో కేఈ.జ్ఞానవేల్, వంశీ, ప్రమోద్ నిర్మించారు. నవంబర్ 14న దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోన్న సందర్భంగా గురువారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శివ మాట్లాడుతూ "దాదాపు వెయ్యేళ్ల క్రితం ఐదు తెగల మధ్య జరిగిన పోరాటమే ఈ సినిమా కథాంశం. సూర్యకు ఈ కథ చెప్పగానే విపరీతంగా నచ్చేసింది. సినిమా గొప్ప విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "మీరు నాపై చూపిస్తున్న ప్రేమ ఎంతో ఆనందాన్నిస్తోంది. తను నమ్మిన ధర్మం కోసం పోరాడే యోధుడి కథ ఇది. టీమ్ ఎఫర్ట్ వల్లే సినిమా అనుకున్న దానికంటే అద్భుతంగా వచ్చింది" అని సూర్య చెప్పారు.

జానీ మాస్టర్‌కు బెయిల్



లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాకు హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. కొరియోగ్రాఫర్ జానీ ఇదే కేసులో కొన్ని వారాలుగా జైల్లో ఉంటున్నారు. తాను మైనర్‌నని, జానీ మాస్టర్ తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆయన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న యువతి చేసిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు జానీపై పోక్సో కేసు నమోదు చేశారు. అయితే, తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తనపై కేసు పెట్టారని, తనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ జానీ మాస్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సీ ప్రతాప్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫిర్యాదుదారు మేజర్ అని, నాలుగేళ్లుగా వారు కలిసి తిరిగినట్లు సాక్షులు పేర్కొంటున్నారని తెలిపారు. ఏడాదిగా దూరంగా ఉన్న తర్వాత చాలా ఆలస్యంగా, జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డు స్వీకరించే ముందు దురుద్దేశంతో కేసు పెట్టారని ఆరోపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ కానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ.. కేసు దర్యాప్తు, ఫిర్యాదుదారు విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని షరతులు విధిస్తూ బెయిల్ మంజూరు చేసింది.



రెట్రో బీట్స్‌తో తస్సాదియ్యా...!

కరుణ కుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్, నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మట్కా'. విజయేందర్ రెడ్డి, రజని తాళ్లూరి నిర్మాతలు. నవంబరు 14న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సెకండ్ సింగిల్ రెట్రో బీట్స్ కలిగిన 'తస్సాదియ్యా' సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇప్పటికే ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. వరుణ్ తేజ్ ఈ పాటలో ఎనర్జిటిక్‌గా కనిపించారు. స్టాట్-ఆన్ స్టైలింగ్‌తో అదరగొట్టారు. వరుణ్ తేజ్ డ్యాన్స్ మూమెంట్స్ కన్నుల విందుగా ఉన్నాయి. నోస్టాల్జియా అండ్ రిఫ్రెష్ వైబ్‌తో పాట అదిరిపోయింది. జి.వి. ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం ఈ చిత్రానికి మేజర్ హైలెట్.

నిర్మాత బూరుగుపల్లి మరోసారి అరెస్టు



హైదరాబాద్ రాయదుర్గం పరిధిలోని సర్వే నంబర్ 46లో 83 ఎకరాల ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసిన కేసులో ఈ నెల 17న అరెస్టు అయ్యి అనారోగ్య కారణాలతో విడుదలయిన నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణను గురువారం ఓయూ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 83 ఎకరాల భూమిని శివరామకృష్ణ కబ్జా చేశారని ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జరీనా పర్వీన్ ఈ ఏడాది ఆగస్టులో సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు భూ కబ్జా కేసు కావడంతో దానిని ఓయూ పీఎస్‌కు బదిలీ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు శివరామకృష్ణను దోషిగా తేల్చడంతో ఈ నెల 17న ఓయూ పోలీసులు ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే అనారోగ్య కారణాలతో శివరామకృష్ణకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. కాగా పోలీసులు మరోసారి ప్రభుత్వం తరుపున న్యాయస్థానంలో వాదనలు వినిపించి శివరామకృష్ణ మంజూరయిన బెయిల్‌ను కొట్టివేయించారు. ఓయూ పోలీసులు గురువారం అయనను మరోసారి అరెస్టు చేశారు.

చేతిలో చెయ్యేసి...



ఇటీవలే విడుదలై సూపర్ సక్సెస్ సాధించిన 'దేవర' సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు బాలీవుడ్ నటి జాన్వీ కపూర్. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'ఆర్‌సీ16'.. వరుణ్ ధావన్‌తో 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారీ' చిత్రాలలో నటిస్తున్నారీ బ్యూటీ. రీసెంట్‌గా బాలీవుడ్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా దీపావళి పార్టీని ముంబైలో ఏర్పాటు చేశారు. ఈ విందులో జాన్వీ తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహీరియాతో కలసి సందడి చేశారు. శిఖర్‌తో, జాన్వీ చేతిలో చెయ్యేసి తీసుకున్న ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పార్టీలో షాహిద్ కపూర్, కార్తీక్ ఆర్యన్, ఆలియా భట్, కాజోల్, త్రిప్తి దిమ్రితో పాటు నాగచైతన్యకు కాబోయే సతీమణి శోభితా ధూళిపాళ్ళ కూడా తళుక్కున మెరిశారు.

అప్‌డేట్స్

ఆసక్తికరమైన కంటెంట్



చంద్రశేఖర్ రాథోడ్ లీడ్ రోల్ పోషించి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్‌పూరి మాట్లాడుతూ "ఈ సినిమా ట్రైలర్, కంటెంట్ ఆసక్తికరంగా ఉన్నాయి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది" అని దర్శకుడు చంద్రశేఖర్ రాథోడ్ అన్నారు.

జగ్జీవన్ రామ్ జీవన చిత్రం



మిలిటరీ ప్రసాద్ ప్రధాన పాత్రలో దిలీప్ రాజా దర్శకత్వంలో చందోలు నాగేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'జగ్జీవన్ రామ్'. మీరాకుమార్ పాత్రలో తాళ్లూరి రామేశ్వరి నటిస్తున్నారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ విడుదల చేశారు. దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'వంద సంవత్సరాల క్రితం జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా నిర్మిస్తున్నాం. జలియన్‌వాలా బాగ్‌లో భారతీయులను అతి కిరాతకంగా చంపిన జనరల్ డయ్యర్‌ను భారత వీరుడు సర్దార్ ఉద్ధమ్ సింగ్ కాల్చి చంపే సన్నివేశం, నాటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని జగ్జీవన్‌రామ్ విభేదించే దృశ్యాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నాం" అని తెలిపారు.

‘బేర్’ పట్టులో స్టాక్ మార్కెట్!

ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు.. రూ.లక్ష కోట్లు వెనక్కి

సెన్సెక్స్, నిఫ్టీ మరింత పతనం?

ఇప్పటికే మదుపరుల సంపద రూ.29 లక్షల కోట్లు హాంఫట్



దేశీయ స్టాక్ మార్కెట్ ‘బేర్’మంటోంది. ఈ నెల ఇప్పటి వరకు సెన్సెక్స్, నిఫ్టీ ఐదు శాతం వరకు నష్టపోయాయి. దీంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) ఏకంగా రూ.29 లక్షల కోట్ల మేర తుడిచి పెట్టుకుపోయింది. స్వల్పమధ్య కాలంలో నిఫ్టీ 50 మరో 1,000 పాయింట్ల మేర నష్టపోయి 23,300 పాయింట్లకు చేరే ప్రమాదం ఉందన్న టెక్నికల్ అనలిస్టుల అంచనాలు, దేశీయ స్టాక్ మార్కెట్‌ను మరింత భయపెడుతున్నాయి.

అన్ని మద్దతు స్థాయిలు బ్రేక్

ప్రస్తుతం నిఫ్టీ 50 సూచీ అన్ని స్వల్ప, మధ్యకాలిక మద్దతు స్థాయిలను బ్రేక్ చేసింది. వంద రోజులు సగటు చలన స్థాయి (డీఎంఏ) అయిన 24,565 పాయింట్ల దిగువకు కూడా పడిపోవడం విశేషం. నిఫ్టీ 50 జీవితకాల గరిష్ఠ స్థాయి 26,277 పాయింట్ల నుంచి.. ఇప్పటి వరకు ఏడు శాతం (1,899 పాయింట్లు) నష్టపోయింది.

నాలుగో రోజూ నష్టాలే

దేశీయ స్టాక్ మార్కెట్‌కు గురువారం కూడా పెద్దగా కలిసి రాలేదు. సెన్సెక్స్ 16.82 పాయింట్ల నష్టంతో 80,065.16 వద్ద, నిఫ్టీ 36.10 పాయింట్ల నష్టంతో 24,399.40 వద్ద ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో ముగియడం వరుసగా ఇది నాలుగో రోజు. ఆరంభంలో కొద్దిపాటి లాభాలతో ప్రారంభమైనా మధ్యాహ్నం నుంచి ఆటో, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టపోక తప్పలేదు.

పేలవమైన ఆర్థిక ఫలితాలు

లిస్టెడ్ కంపెనీలు ప్రకటిస్తున్న సెప్టెంబరు త్రైమాసిక (క్యూ2) ఆర్థిక ఫలితాలు ఏ మాత్రం ఆశాజనకంగా లేవు. ఆర్థిక పునాదులు ఎంత పటిష్ఠంగా ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరం కంపెనీల ఆదాయాలు సగటున 10 శాతానికి మించి పెరిగే అవకాశం లేదన్న అంచనాలు, మార్కెట్‌ను కుంగదీస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 16 శాతం తక్కువ.

అధిక వాల్యుయేషన్స్

గత 11 నెలలుగా కొనసాగిన ర్యాలీతో మంచి కంపెనీల షేర్లతో పాటు కొన్ని చిన్నా చితక కంపెనీల షేర్లూ వాటి స్థాయికి మించి పెరిగాయి. ముఖ్యంగా ఐపీఓ మార్కెట్లో ప్రత్యేకించి ఎస్ఎంఈ కంపెనీల షేర్ల లిస్టింగ్‌లో ఇది స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు ఈ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోంది. మార్కెట్ పతనానికి ఇది కూడా ఒక కారణం.

మార్కెట్ పతనానికి కారణాలు

ఎఫ్‌పీఐల గుడ్‌బై

నిన్న మొన్నటి వరకు విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ)కు దేశీయ స్టాక్ మార్కెట్ లాభాల గని. గత 11 నెలలుగా కొనసాగిన ర్యాలీతో ఈ సంస్థలు పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జించాయి. తాజాగా ఈ సంస్థలకు భారత మార్కెట్ కంటే చైనా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీంతో గత 20 రోజుల్లోనే ఎఫ్‌పీఐలు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి దాదాపు రూ.లక్ష పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. కొవిడ్ సమయంలో కూడా ఈ సంస్థలు ఇంత పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగలేదు. మార్కెట్ పతనానికి ఇదే ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఐపీఓల వెల్లువ

సెకండరీ మార్కెట్ ర్యాలీతో ఈ సంవత్సరం ప్రైమరీ మార్కెట్ కూడా ఊపందుకుంది. ప్రతి వారం ఎంతలేదన్నా సగటున నాలుగైదు పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) నిధుల సమీకరణ కోసం మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించిన మొత్తం రూ.లక్ష కోట్లు మించింది. 2021 తర్వాత ఐపీఓ మార్కెట్‌కు ఇదే గోల్డెన్ పీరియడ్ అని చెప్పాలి. ఆ సంవత్సరం దేశీయ కంపెనీలు ఐపీఓల ద్వారా రికార్డు స్థాయిలో రూ.1.19 లక్షల కోట్లు సమీకరించాయి. లిస్టింగ్ లాభాలు అధికంగా ఉండడంతో రిటైల్ మదుపరులతో పాటు సంస్థాగత మదుపరులు సెకండరీ మార్కెట్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిపి ఆ మొత్తాన్ని ఐపీఓల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

రిలయన్స్‌తో ఎన్‌విడియా జట్టు



భారత్‌లో ఏఐ కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి

టాటా కమ్యూనికేషన్‌తోనూ అమెరికన్ టెక్ దిగ్గజం డీల్

ముంబై: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)తో అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం ఎన్‌విడియా కార్పొరేషన్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా భారత్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు ఇన్నోవేషన్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ఎన్‌విడియా కార్ప్ సీఈఓ జెన్సన్ హువాంగ్ వెల్లడించారు. అలాగే, ఎన్‌విడియా తన ఏఐ చిప్‌లను ఆర్ఐఎల్ సహా పలు భారత కంపెనీలకు సరఫరా చేయనుంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ కోసం రిలయన్స్.. ఎన్‌విడియాకు చెందిన అత్యాధునిక బ్లాక్‌వెల్ ఏఐ చిప్‌లను ఉపయోగించనుంది. అంతేకాదు, ఈ భాగస్వామ్యంలో భాగంగా రిలయన్స్ పలు అప్లికేషన్లను అభివృద్ధి చేసి, కస్టమర్లకు విక్రయించనుందని ముంబైలో గురువారం ప్రారంభమైన “ఎన్‌విడియా ఏఐ సదస్సు 2024’లో పాల్గొన్న సందర్భంగా హువాంగ్ తెలిపారు. ఈ సదస్సు మూడు రోజుల పాటు జరగనుంది.

ఎన్‌విడియా ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, పుణె సహా భారత్‌లోని ఆరు ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ టెక్ దిగ్గజం పలు వ్యాపార సంస్థలు, క్లౌడ్ ప్రొవైడర్లు, స్టార్టప్‌తో కలిసి.. వేలాది అత్యాధునిక జీపీయూలు, హై పెర్ఫార్మెన్స్ నెట్‌వర్కింగ్ అండ్ ఏఐ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్స్ అండ్ టూల్స్‌తో కూడిన యాక్సిలరేటెడ్ కంప్యూటింగ్ స్టాక్ ద్వారా దేశంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించనుంది. రిలయన్స్‌తో పాటు టాటా కమ్యూనికేషన్స్, హీరానందానీ గ్రూప్‌నకు చెందిన యోట్ట డేటా సర్వీసెస్‌తోనూ ఎన్‌విడియా డీల్ కుదుర్చుకుంది. ఈ రెండు కంపెనీల డేటా సెంటర్ల నిర్మాణం కోసం ఎన్‌విడియా హోపర్ ఏఐ చిప్‌లను సరఫరా చేయనుంది.

హిందీ ఏఐ మోడల్ విడుదల: ఎన్‌విడియా హిందీ భాషలో ఏఐ మోడల్‌ను ప్రవేశపెట్టింది. దేశీయ ఐటీ కంపెనీ టెక్ మహీంద్రా ఈ మోడల్‌ను తొలుత వినియోగించుకుందని, దీని సాయంతో ఇండస్ 2.0 అప్లికేషన్‌ను అభివృద్ధి చేసినట్లు ఎన్‌విడియా వెల్లడించింది.

ఏఐ ఎగుమతుల దేశంగా భారత్: అంబానీ

ఎన్‌విడియా ఏఐ సదస్సులో హువాంగ్, అంబానీతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్ ఏఐ పరివర్తన సామర్థ్యం, ఈ రంగంలో మన పాత్రపై చర్చ జరిగింది. ఎన్‌విడియా-రిలయన్స్ భాగస్వామ్యంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధితో దేశీయ ఏఐ సామర్థ్యం పెరగడంతో పాటు ప్రపంచ మేధో విపణిలో భారత్‌ను కీలక దేశంగా నిలబెట్టనుందని అంబానీ అన్నారు. త్వరలోనే భారత్ అతిపెద్ద మేధో విపణిగా అవతరించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతేకాదు, ప్రస్తుతం భారత్ ప్రపంచ దేశాలకు సాఫ్ట్‌వేర్, అంతర్జాతీయ కంపెనీలకు సారథులను (సీఈఓ) ఎగుమతి చేస్తోందని.. త్వరలోనే ఏఐ సేవల ఎగుమతుల దేశంగానూ అవతరించనుందన్నారు.

ఈ ఏడాదిలో 20 రెట్లు పెరగనున్న భారత్ కంప్యూటింగ్ సామర్థ్యం: హువాంగ్

ప్రపంచ కంప్యూటర్ పరిశ్రమకు భారత్ అత్యంత ప్రియమైన దేశమని.. ఐటీ ఇండస్ట్రీకి మూల కేంద్రమని హువాంగ్ అభివర్ణించారు. ఈ ఏడాదిలో భారత కంప్యూటింగ్ సామర్థ్యం 20 రెట్లు పెరగనుందన్నారు. ఏఐ సాంకేతికత వేగంగా పురోగతి చెందుతున్న నేపథ్యంలో ఇండస్ట్రీ అంతర్గత మార్పులకు లోనవుతోందన్నారు. ఇప్పటివరకు సాఫ్ట్‌వేర్ ఎగుమతుల హబ్‌గా ఉన్న భారత్.. ఏఐ ఎగుమతుల్లో అగ్రగామిగా నిలవనుందన్నారు.

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోతోనూ భాగస్వామ్యం: దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోతోనూ ఎన్‌విడియా జత కట్టింది. టీసీఎస్ తన కస్టమర్లు ఏఐ సాంకేతికతను వేగంగా, విస్తృతంగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్‌విడియా భాగస్వామ్యం ద్వారా ఇండస్ట్రీ ఆధారిత పరిష్కారాలు, ఆఫరింగ్స్‌ను విడుదల చేసింది.

46% తగ్గిన లారస్ ల్యాబ్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ ల్యాబ్స్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం ఏకంగా 46 శాతం క్షీణించి రూ.20 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.37 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం యథాతథంగా రూ.1,224 కోట్లుగా ఉంది.

పెరిగిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టాలు

సెప్టెంబరు త్రైమాసికంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) నష్టాలు మరింతగా పెరిగాయి. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నష్టాలు రూ.190 కోట్ల నుంచి రూ.429 కోట్లకు పెరిగాయి. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.2,162 కోట్ల నుంచి రూ.2,598 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ వడ్డీ, ఫైనాన్స్ చార్జీలు రూ.673 కోట్ల నుంచి రూ.1,031 కోట్లకు పెరగటం ప్రభావం చూపించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,470 ▼	72,850 ▼	1,10,000 ▼
ముంబై	78,246 ▼	71,673 ▼	97,493 ▼

కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.800 కోట్ల పెట్టుబడులు

కాకినాడ, అంకలేశ్వర్‌లో కొత్త ప్లాంట్ల ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. రూ.800 కోట్ల పెట్టుబడితో పెద్ద ఎత్తున విస్తరణ కార్యకలాపాలు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, కాకినాడలో గ్రాన్యులేషన్ ప్లాంట్‌ను నెలకొల్పటంతో పాటు గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో పెస్టిసైడ్స్ కోసం ప్రత్యేక ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. విస్తరణలో భాగంగా కాకినాడలోని కాంప్లెక్స్ ప్రత్యేక ఎరువుల తయారీ ప్లాంట్‌లో కొత్తగా ఏటా 7.5 లక్షల టన్నుల సామర్థ్యంతో గ్రాన్యులేషన్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కొత్త లైన్‌తో కాకినాడ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం మొత్తం 30 లక్షల టన్నులకు చేరుకుంటుందని పేర్కొంది. అలాగే సెనెగల్‌లోని బావోబాబ్ మైనింగ్ కెమికల్ కార్పొరేషన్ (బీఎంసీసీ)లో పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది.

క్యూ2 లాభం రూ.696 కోట్లు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికం (క్యూ2)లో కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.7,509 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.696 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.7,031 కోట్లుగా ఉండగా లాభం రూ.762 కోట్లుగా ఉంది.

సైయెంట్ లాభంలో స్వల్ప వృద్ధి

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సైయెంట్ లిమిటెడ్ రూ.177 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం స్వల్పంగా 2.3 శాతం పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రెవెన్యూ మాత్రం 1.8 శాతం క్షీణించి రూ.1,450 కోట్లుగా నమోదైంది. కరెన్సీలో హెచ్చుతగ్గుల కారణంగా రెవెన్యూ స్వల్పంగా తగ్గిందని కంపెనీ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	128
కరీంనగర్	120	ఒంగోలు	128
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	126
కర్నూలు	120	నెల్లూరు	126
విశాఖపట్నం	115	అనంతపురం	126
గోదావరి	130		

రాబోయే 20 ఏళ్లలో 4,000 కొత్త విమానాలు కావాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: భారత విమానయాన పరిశ్రమకు అపార వృద్ధి అవకాశాలున్నాయని, రాబోయే 20 ఏళ్లలో దేశంలోని విమానయాన సంస్థలకు అదనంగా 4,000 విమానాలు అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. అదే కాలంలో దేశంలో కొత్తగా 200 విమానాశ్రయాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం వివిధ విమానయాన సంస్థల వద్ద 800 విమానాలుండగా 1,200 విమానాలకు ఆర్డర్లున్నాయి. గత 10 ఏళ్లలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపై 157కి చేరింది. రాబోయే ఐదేళ్లలో మరో 50 విమానాశ్రయాలు అందుబాటులోకి రానున్నాయి. భారత్ ప్రపంచంలోనే త్వరితగతిన వృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్ అని.. ఈ రంగ అభివృద్ధితో కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయన్నారు.

అదరగొట్టిన అమ్మాయిలు



రాధా యాదవ్ (3/35)

- పడగొట్టిన రాధ, సైమా
- తొలి వన్డేలో భారత్ గెలుపు
- 59 పరుగులతో కివీస్ ఓటమి

భారత్: 44.3 ఓవర్లలో 227 ఆలౌట్ (తేజల్ 42, దీప్తి 41; అమేలియా 4/42, జెస్ 3/49). **కివీస్:** 40.4 ఓవర్లలో 168 ఆలౌట్ (బ్రూక్ 39, గ్రీన్ 31; రాధ 3/35)

అహ్మదాబాద్: బౌలర్లు, ఫీల్డర్లు రాణించడంతో.. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భారత మహిళల జట్టు బోణీ చేసింది. తేజల్ హసాబ్నిస్ (42), దీప్తి శర్మ (41) బ్యాట్‌తో ఆదుకోగా.. రాధా యాదవ్ (3/35), సైమా ఠాకూర్ (2/26) ప్రత్యర్థిని కట్టడి చేశారు. దీంతో గురువారం జరిగిన మొదటి మ్యాచ్‌లో భారత్ 59 పరుగుల తేడాతో కివీస్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 44.3 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. కెర్ సిస్టర్స్ అమేలియా 4 వికెట్లు, జెస్ 3 వికెట్లు పడగొట్టారు. తాత్కాలిక కెప్టెన్ స్మృతి మంధాన (5), షఫాలీ వర్మ (33), హేమలత (3), యాస్తిక (37) అవుట్ కావడంతో.. భారత్ 91/4తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో తొలి మ్యాచ్ ఆడుతున్న తేజల్, జెమీమా రోడ్రిగ్స్ (35) ఐదో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ 40.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. బ్రూక్ (39), మ్యాడీ గ్రీన్ (31) ఐదో వికెట్‌కు 49 పరుగులు జోడించారు. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సైమా.. తాను వేసిన మూడో బంతికే సుజి బేట్స్ (1)ను క్యాచవుట్ చేసింది.

హాకీకి రాణి వీడ్కోలు



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు మాజీ కెప్టెన్ రాణీ రాంపాల్ (29) సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. హరియాణాలోని కుగ్రామానికి చెందిన ఓ రిక్షా కార్మికుడి కూతురైన రాణి.. హాకీలో అత్యున్నత స్థాయికి చేరుకొని ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. గాయాల కారణంగా ఆటకు దూరమైన రాంపాల్ ఆ తర్వాత జట్టులో సుస్థిర స్థానాన్ని సాధించలేక పోయింది. ఈ క్రమంలో 16 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ఆమె ప్రకటించింది. 2021 టోక్యో విశ్వ క్రీడల్లో రాణి సారథ్యంలోని భారత్ నాలుగో స్థానంతో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. రాంపాల్ గౌరవార్థం ఆమె ధరించిన ‘28’ నెంబర్ జెర్సీకి కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్టు హాకీ ఇండియా తెలిపింది. బహుమతిగా ఆమెకు రూ.10 లక్షల నజరానాను అందజేసింది. 14 ఏళ్ల పిన్నవయసులో 2008లో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. 254 మ్యాచ్‌ల్లో 205 గోల్స్ సాధించింది. 2020లో ప్రభుత్వం ఖేల్‌రత్న అవార్డుతోపాటు పద్మశ్రీతో సత్కరించింది.

ధ్యాన్‌చంద్‌కాదు..‘అర్జున లైఫ్‌టైమ్’ పురస్కారం

న్యూఢిల్లీ: ధ్యాన్‌చంద్ పేరిట క్రీడాకారులకు ఇస్తున్న జీవన సాఫల్య పురస్కారం పేరును మారుస్తున్నట్టు కేంద్ర క్రీడాశాఖ గురువారం ప్రకటించింది. ఈ ఏడాదినుంచి ధ్యాన్‌చంద్ అవార్డును అర్జున జీవన సాఫల్య పురస్కారంగా అందజేయనున్నట్టు తెలిపింది. క్రీడా అవార్డుల హేతుబద్ధీకరణలో భాగంగా ఈ మార్పు చేసినట్టు వివరించింది.

వచ్చాడు.. పడగొట్టాడు

7 వికెట్లతో దెబ్బతీసిన సుందర్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259

రచిన్, కాన్వే అర్ధసెంచరీలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 16/1

కివీస్‌తో సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టులో మొదట అతడికి చోటే దక్కలేదు.. తొలి టెస్టు ఓటమి తర్వాత అనూహ్యంగా జట్టులోకి వచ్చాడు..అంతేకాదు.. ఏకంగా కుల్దీప్ స్థానంలోనే బెర్త్ దక్కించుకున్నాడు వాషింగ్టన్ సుందర్. అయినా అతడి ఎంపికపై ఉదయం నుంచి విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ యాజమాన్యం తనపై పెట్టుకున్న అంచనాలను వమ్ము చేయకుండా చెలరేగాడు. కీలక రచిన్ సహా చివరి ఏడుగురు బ్యాటర్లు అతడి స్పిన్ ఉచ్చుకు చిక్కడంతో తొలి రోజే వారి ఆటకు చెక్ పడింది.



సుందర్ (7/59)

పుణె: ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (7/59) తన ఎంపికకు న్యాయం చేశాడు. మూడున్నరేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడుతున్నప్పటికీ సుడులు తిరిగే బంతులతో పటిష్ఠంగా కనిపిస్తున్న న్యూజిలాండ్‌ను కట్టడి చేశాడు. తద్వారా అతడి దెబ్బకు మొదటి రోజు గురువారం కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకు ఆలౌటైంది. కాన్వే (76), రచిన్ రవీంద్ర (65) అర్ధసెంచరీలు సాధించారు. చివర్లో శాంట్నర్ (33) పోరాడే ప్రయత్నం చేశాడు. అశ్విన్ మిగతా 3 వికెట్లు తీశాడు. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్‌ను సైతం కివీస్ బౌలర్లు ఇబ్బందిపెట్టారు. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 16/1 పరుగులు మాత్రమే చేసింది. క్రీజులో యశస్వీ జైస్వాల్ (6 బ్యాటింగ్), గిల్ (10 బ్యాటింగ్) ఉన్నారు. ఆదిలోనే రోహిత్ డకౌటయ్యాడు. పేసర్ సౌథీ ఓవర్‌లో డిఫెన్స్ ఆడే ప్రయత్నం చేయగా.. బంతి ప్యాడ్‌ను తాకుతూ బెయిల్స్‌ను గిరాటేసింది. తొలి రోజు ఆటలో పేసర్‌కు దక్కిన ఏకైక వికెట్ ఇదే.

కాన్వే-రచిన్ నిలకడ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభంలో మెరుగ్గానే ఆడింది. భారత పిచ్‌లపై ఇబ్బందిపడని ఓపెనర్ కాన్వేతో పాటు రచిన్ రవీంద్ర మరోసారి అర్ధసెంచరీతో కీలకంగా నిలిచారు. ఈ ఇద్దరూ క్రీజులో ఉన్నంతసేపు జట్టు పటిష్ఠంగానే కనిపించింది. కానీ స్పిన్నర్లు అశ్విన్, సుందర్ కివీస్ వికెట్లను పంచేసుకున్నారు. తొలి మూడు వికెట్లతో అశ్విన్ కివీస్ పతనానికి ద్వారాలు తీయగా.. ఇక సుందర్ సుడులు తిరిగే బంతులకు మిగతా బ్యాటర్లంతా పెవిలియన్ బాట పట్టారు. కాన్వే తొలివికెట్‌కు లాథమ్ (15)తో కలిసి 32, రెండోవికెట్‌కు యంగ్ (18)తో కలిసి 44 రన్స్ జోడించాడు.

1 — ఓ ఇన్నింగ్స్‌లో ఎక్కువ మంది (5)ని బౌల్డ్ చేసిన ఐదో భారత బౌలర్‌గా సుందర్. గతంలో జాసూభాయ్ పటేల్, బాపు నాదకర్ణి, కుంబ్లే, జడేజా ఈ ఘనత సాధించారు. టెస్టు కెరీర్‌లో 5+ వికెట్లు తీయడం సుందర్‌కిదే మొదటిసారి.

సుందర్ దెబ్బతో.. : రెండో సెషన్‌లో కాన్వే-రచిన్ భారత బౌలర్లపై ఆధిపత్యం చూపారు. మూడో వికెట్‌కు 62 పరుగులు జత చేరాక కాన్వేను అశ్విన్ అవుట్‌చేశాడు. అయితే రచిన్ మాత్రం మిచెల్ (18)తో కలిసి ఎదురుదాడికి దిగాడు. అప్పటికే 13 ఓవర్లు వేసినా వికెట్ తీయలేని సుందర్.. ఓ అద్భుత రిప్పర్ బాల్‌తో రచిన్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆఫ్‌సైడ్‌లో వేసిన బంతి అవుట్‌సైడ్ ఎడ్జ్ తీసుకుంటూ అతడి వికెట్లను పడగొట్టిన తీరు వహ్వా అనిపించింది. అంతే.. అక్కడి నుంచి అంతా సుందర్‌దే హవా. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్‌ను అతనే వెనక్కిపంపాడు. మరోవైపు శాంట్నర్ ఒంటరి పోరాటం చేస్తూ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. సుందర్ 7 వికెట్లలో ఐదుగురు బౌల్డ్ కావడం విశేషం.

చరిత్ర సృష్టించిన అర్జున్

2800 ఎలో రేటింగ్ సాధించిన రెండో ఆటగాడిగా రికార్డు



న్యూఢిల్లీ: తెలుగుతేజం అర్జున్ ఇరిగేసి చరిత్ర సృష్టించాడు. చెస్‌లో 2800 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించిన పిన్నవయస్కుడైన భారతీయుడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. ఇంతకుముందు విశ్వనాథన్ ఆనంద్ మాత్రమే ఈ రేటింగ్ పాయింట్లను సాధించాడు. సెర్బియాలో జరుగుతున్న యూరోపియన్ చెస్ క్లబ్ కప్‌లో ఆల్కలాయిడ్ జట్టుకు ఆడుతున్న అర్జున్ గురువారం ఐదో రౌండ్‌లో దిమిత్రీ ఆండ్రీకిన్ (రష్యా)ను ఓడించడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ప్రపంచ చెస్‌లో 2800 పాయింట్ల మైలురాయిని చేరిన 16వ ఆటగాడు అర్జున్. కాగా ప్రస్తుతం అర్జున్ ఖాతాలో 2802.1 పాయింట్లున్నాయి.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) అశ్విన్ 15; కాన్వే (సి) పంత్ (బి) అశ్విన్ 76; యంగ్ (సి) పంత్ (బి) అశ్విన్ 18; రవీంద్ర (బి) సుందర్ 65; మిచెల్ (ఎల్బీ) సుందర్ 18; బ్లండెల్ (బి) సుందర్ 3; ఫిలిప్స్ (సి) అశ్విన్ (బి) సుందర్ 9; శాంట్నర్ (బి) సుందర్ 33; సౌథీ (బి) సుందర్ 5; ఎజాజ్ (బి) సుందర్ 4; ఓరోక్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 79.1 ఓవర్లలో 259 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-32, 2-76, 3-138, 4-197, 5-201, 6-204, 7-236, 8-242, 9-252, 10-259; **బౌలింగ్:** బుమ్రా 8-2-32-0; ఆకాశ్ 6-0-41-0; అశ్విన్ 24-2-64-3; సుందర్ 23.1-4-59-7; జడేజా 18-0-53-0

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 6; రోహిత్ (బి) సౌథీ 0; గిల్ (బ్యాటింగ్) 10; **ఎక్స్‌ట్రాలు:0, మొత్తం:11 ఓవర్లలో16/1. వికెట్ పతనం:**1-1. **బౌలింగ్:** సౌథీ 3-1-4-1; ఓరోక్ 3-2-5-0;ఎజాజ్ 3-1-5-0; శాంట్నర్ 2-0-2-0.

3 — కివీస్‌తో జరిగిన టెస్టుల్లో ఉత్తమ గణాంకాలు (7/59) నమోదు చేసిన మూడో బౌలర్‌గా అశ్విన్‌తో సమంగా నిలిచిన సుందర్. వెంకట్రాఘవన్ (8/72), ప్రసన్న (8/76) ముందున్నారు.

6 — భారత్‌లో జరిగిన టెస్టుల్లో తొలి రోజు ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు 10 వికెట్లు తీయడం ఇది ఆరోసారి.

విరాట్‌ను కాదని..

కివీస్ తొలి ఇన్నింగ్స్ 25వ ఓవర్ (జడేజా బౌలింగ్)లో ఓపెనర్ కాన్వే ఎల్బీపై భారత్ అప్పీల్ చేసినా అంపైర్ స్పందించలేదు. దీంతో కెప్టెన్ రోహిత్ డీఆర్ఎస్‌కు వెళ్దామనుకున్నాడు. అయితే అదే సమయంలో అక్కడి వచ్చిన విరాట్ రిప్లేకి వెళ్లవద్దంటూ చెప్పబోయేంతలోనే రోహిత్ డీఆర్ఎస్‌కు సిగ్నల్ ఇచ్చేశాడు. దీంతో కోహ్లీ సైలెంట్ అయిపోయాడు. తీరా రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను మిస్ అవుతూ నాటౌట్‌గా తేలింది.

మనోళ్లు గెలిచారుకానీ..

షూటౌట్‌లో పరాజయం

జర్మనీదే హాకీ సిరీస్



న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ చెరో రెండేసి గోల్స్‌తో అదరగొట్టిన వేళ..జర్మనీతో గురువారం ఇక్కడ జరిగిన రెండో హాకీ టెస్ట్‌లో భారత్ 5-3తో విజయం సాధించింది. అయితే రెండు మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్ విజేతను తేల్చేందుకు షూటౌట్ నిర్వహించాల్సి వచ్చింది. షూటౌట్‌లో..వరల్డ్ చాంపియన్ జర్మనీ 3-1తో నెగ్గి ట్రోఫీ దక్కించుకుంది. తొలి టెస్ట్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. ఇక మజ్కోర్ (7, 57ని.) చేసిన గోల్స్‌తో మొదట జర్మనీ ఆధిక్యం ప్రదర్శించింది. ఆపై హెన్రిక్ (60) మరో గోల్ చేశాడు. రెండో అర్ధ భాగంలో సుఖ్‌జీత్ (34, 48), హర్మన్ (42, 43), అభిషేక్ (45) గోల్స్ సాధించడంతో భారత్ విజయాన్నందుకుంది. అయితే షూటౌట్‌లో మనోళ్లు 1-3తో చిత్తయ్యారు. హర్మన్, అభిషేక్, రాహీల్ విఫలంకాగా, ఆదిత్య మాత్రమే గోల్ చేయగలిగాడు.

బెంగాల్ శుభారంభం

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11లో బెంగాల్ వారియర్స్ శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ తొలిమ్యాచ్‌లో బెంగాల్ 32-29తో యూపీ యోధాస్‌పై గెలిచింది. హ్యాట్రిక్ విజయంపై కన్నేసి బరిలోకి దిగిన యోధాస్‌ను మూడు పాయింట్ల తేడాతో బెంగాల్ ఓడించింది. బెంగాల్ రైడర్లు మణిందర్ సింగ్ (8 పాయింట్లు), నితిన్ (7), సుశీల్ (7) సమష్టిగా రాణించి జట్టును గెలిపించారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 37-25 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది.

దక్షిణాఫ్రికా.. దశాబ్దం తర్వాత..!

- బంగ్లాపై 7 వికెట్లతో విజయం

చెలరేగిన రబాడ

మిర్పూర్: పేసర్ రబాడ (6/46) చెలరేగడంతో.. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో సౌతాఫ్రికా 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలో దశాబ్దం తర్వాత ఆసియాలో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆటకు నాలుగో రోజైన గురువారం ఓవర్‌నైట్ స్కోరు 283/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 307 పరుగులకు ఆలౌటై దక్షిణాఫ్రికా ఎదుట 106 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 22 ఓవర్లలో 106/3 స్కోరు చేసి గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106 రన్స్ చేయగా.. దక్షిణాఫ్రికా 308 పరుగులు సాధించింది.

‘ఆరే’సిన సాజిద్

ఇంగ్లండ్ 267 ఆలౌట్

రావల్పిండి: ఆఫ్ స్పిన్నర్ సాజిద్ ఖాన్ (6/128) మరోసారి చెలరేగి ఆరు వికెట్లు పడగొట్టడంతో పాకిస్థాన్‌తో గురువారం మొదలైన మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 267 పరుగులకే ఆలౌటైంది. సాజిద్, మరో స్పిన్నర్ నోమన్ ధాటికి పర్యాటక జట్టు ఓ దశలో 118/6 స్కోరుతో కష్టాల్లో పడింది. అయితే కీపర్ జేమీ స్మిత్ (89), అట్కిన్సన్ (39) ఏడో వికెట్‌కు 105 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ కోలుకుంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన పాకిస్థాన్ తొలి రోజు ఆఖరికి 73/3 స్కోరుతో నిలిచింది. కాగా పాకిస్థాన్ జట్టు తమ పేసర్ ఆమెర్ జమాల్‌తో ఒక్క ఓవర్‌కూడా బౌలింగ్ చేయించలేదు. ఓ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో పేస్ బౌలర్‌తో బౌలింగ్ వేయించకపోవడం టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే. మొదటిసారి 1882లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఇలాగే చేసింది.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 25 అక్టోబరు 2024

దీపం జ్యోతిః పరబ్రహ్మ
దీపం సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యా దీపం నమోస్తుతే



ఆనందరవళి దీపావళి

దసరా సరదాల ఆనంద హేలకు పరాకాష్ఠ. ఆ తరువార 20 రోజులకు వచ్చే దీపావళి... ఆనందరవళి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వేడుక. "ఉపదేశ గ్రంథాలలో భగవద్గీతకు ఎంత ఖ్యాతి ఉందో పండుగలలో దీపావళికి అంతటి ఖ్యాతి ఉంది. భారతదేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పండుగకు ఒక్కో ప్రాధాన్యత ఉంటుంది. కానీ దీపావళిని మాత్రం అన్ని ప్రాంతాలవారు సంతోషంగా జరుపుకొంటారు" అని శ్రీ కంచి పరమాచార్యులు పేర్కొన్నారు. భారతదేశంలోని పశ్చిమ, ఉత్తర ప్రాంతాల ప్రజలు ఈ పండుగను... భాద్రపద మాసంలోని చివరి మూడు రోజులు... 'ధనత్రయోదశి', 'నరక చతుర్దశి', 'దీపావళి'గాను, ఆశ్వయుజ మాసంలోని తొలి రెండు రోజులు... 'బలి పాడ్యమి', 'భాతృ విదియ'గాను జరుపుకొంటారు. వీటిలో ప్రతిదానికీ పౌరాణికమైన, సంప్రదాయికమైన కథలు ఉన్నాయి. నరక చతుర్దశికి తమిళనాడులో ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఆశ్వయుజ అమావాస్య నాడు దీపావళిని 'కాళీ పూజ'గా నిర్వహిస్తారు. 'దీపానాం ఆవళి' అనేది దీపావళికి వ్యుత్పత్తి. అంటే 'దీపాల వరుస' అని అర్థం. దీనికే 'కౌముదీ ఉత్సవం', 'దీపాలికా ఉత్సవం', 'దివ్వెల పండుగ' అనే పేర్లు ఉన్నాయి. చీకట్లను తొలగించి, చైతన్య దీప్తులను విరజిమ్మే ఆనందోత్సవమైన దీపావళిని పరబ్రహ్మ స్వరూపంగా భావన చేశారు ఋషులు.

'దీపం జ్యోతిః పరబ్రహ్మ దీపం సర్వ తమోపహమ్

దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమోస్తుతే' అన్నారు. 'తమసోమా జ్యోతిర్గమయ' అన్నది వేదం. బాహ్యమైన చీకట్లనే కాకుండా... అంతర్గతంగా ఉన్న తమోగుణాన్ని (అవిద్యను, అజ్ఞానాన్ని) తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించి, వెలుగుబాటలో ప్రసరించేదిగా దీపావళిని ప్రస్తుతించారు పూర్వులు. ఈ పండుగకు ఆధ్యాత్మిక, పురాణ, ఇతిహాస, సామాజిక ప్రాధాన్యత ఉంది. ఆది శంకరులు షణ్మతాలను ఏకతాటిపైకి తెచ్చి, పంచాయతన పూజా విధానాన్ని ఏర్పరిచారు. అందులో కాలాగ్ని స్వరూపుడైన స్కందుడికి చోటు కల్పించలేదు. అందుకు ప్రతీకగా జ్యోతి ప్రజ్వలనం అనే విధిని ప్రవేశపెట్టారు. అదే దీపారాధన. ఏ పూజ చేసినా జ్యోతి ప్రజ్వలనంతోనే ఆరంభమవుతుంది. పంచభూతాలలో ముఖ్యమైన అగ్నికి సంకేతం దీపారాధన. సూర్యుడిలో ఉండేది అగ్ని. అది లేకపోతే జగత్తు లేదు. సూర్యారాధనలో అగ్ని ఆరాధన అంతర్భాగం. అలాగే పంచభూత లింగాలలో అరుణాచలేశ్వరుడి (అగ్ని లింగం) ప్రాధాన్యం జగద్విదితం. దీపాన్ని అత్యున్నత గుణాలకు ప్రతీకగా కూడా పూర్వకవులు ఉదహరించిన సందర్భాలు అనేకం. శ్రీరాముణ్ణి 'రఘుకులాన్వయ రత్నదీపం'గా వర్ణించాడు వాల్మీకి. 'లోకైక దీపాంకురాం' అనేది 'శ్రీసూక్తం'లో మహాలక్ష్మీ వర్ణన.

తెలుగు ప్రాంతాల్లో, కర్ణాటకలో రెండు రోజులపాటు... నరక చతుర్దశిని, దీపావళిని జరుపుకొంటారు. తొలి రోజు నరక చతుర్దశి. నరకాసురుణ్ణి సత్యభామా సమేతుడై శ్రీకృష్ణుడు సంహరించిన కథ అందరికీ తెలిసినదే. ఆ రోజు ప్రతి ఇల్లు మంగళతోరణాలతో, రంగవల్లులతో కళకళలాతుడూ ఉంటుంది. అందరూ వేకువజామునే లేచి, అభ్యంగన స్నానాలు ఆచరిస్తారు. ఇష్ట దైవాన్ని పూజిస్తారు. సంధ్యా సమయంలో వీధి గుమ్మానికి ఇరువైపులా ప్రమిదలతో దీపాలను పెడతారు. వాటిని 'యమ దీపం' అంటారు. రెండవరోజు దీపావళి. భారతీయులందరూ జరుపుకొనే ముఖ్యమైన పర్వదినం. తొలినాటి మాదిరిగానే నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం చేస్తారు. నువ్వుల నూనెలో లక్ష్మి, జలంలో గంగ ఉంటారనేది అనాది విశ్వాసం. నూతన వస్త్రాలను ధరించి, పూజా మందిరంలో, తులసికోట దగ్గర దీపాలను వెలిగిస్తారు. ఇష్టదేవతా ప్రార్థన చేస్తారు. సమీపంలోని ఆలయాలను సందర్శిస్తారు. పితృ దేవతలకు తర్పణాలు వదిలే సంప్రదాయం కూడా ఉంది. అనంతరం విందు భోజనాలు చేస్తారు. ప్రదోష సమయంలో ఇల్లు, వాకిలి చిమ్మి, కల్లాపు జల్లి, ముగ్గులు పెడతారు. పూజా మందిరంలో లక్ష్మీ ప్రతిమను ఆరాధించి, వివిధ నైవేద్యాలు పెడతారు. ప్రమిదలలో దీపాలు వెలిగిస్తారు. ఆ దీపాల వరుసలను ప్రతి గుమ్మం ముందు అలంకరిస్తారు. పెద్దలు, పిల్లలు ఆనందోత్సాహాలతో బాణాసంచా వెలిగిస్తారు. ఈ దీపోత్సవం... మహాలయ పక్షంలో భూలోకానికి వచ్చిన పితృ దేవతలు తిరిగి స్వర్గానికి వెళ్ళడానికి వెలుగు చూపించడానికేననే అభిప్రాయం కూడా ఉంది. రాత్రి ఇంటిని శుభ్రపరిచి, పేరుకున్న చెత్తా చెదారాన్ని ఊడ్చి, వీధిలో పడేస్తారు. దీన్ని ఇంటిలో ఉన్న 'అలక్ష్మి'ని ఇంటి నుంచి బయటకు పంపించే ప్రక్రియగా భావిస్తారు. ఆ మరునాటి నుంచి శివ కేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం మొదలవుతుంది.

• అయపిళ్ళ రాజపాప

పర్వదినం

రోజుకో ప్రత్యేకత

దీపావళిని అయిదు రోజుల పాటు జరుపుకొనే ఆనవాయితీ... ప్రధానం గా ఉత్తర భారతదేశంలో ఉంది. వీటిలో ప్రతి రోజూకూ ఓ ప్రత్యేకత ఉంది. ఈ ఉత్సవాలు ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ఆరంభం అవుతాయి. ఆ రోజును 'ధన త్రయోదశి' అంటారు. అమృతం కోసం దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మధించారు. ఆ సాగర మథనంలో... ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మీ దేవి ఉద్భవించింది. కాబట్టి ఈ రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. ఆయుర్దాయాన్ని కోరుతూ యముణ్ణి, ఆరోగ్యాన్ని కోరుకుంటూ ధన్వంతరిని పూజిస్తారు. రెండో రోజైన ఆశ్వయుజ బహుళ చతుతుర్దశిని 'నరక చతుర్దశి' అంటారు. లోక కంటకుడైన నరకాసురుణ్ణి శ్రీకృష్ణుడు వధించిన రోజు ఇది. ఈ రోజున నరకాసురుడి బొమ్మలను దహనం చేసే ఆచారం కొన్ని ప్రాంతాల్లో ఉంది. నరక చతుర్దశి రోజున వెలిగించే దీపాలు పితృదేవతలకు స్వర్గలోక ప్రాప్తి కలిగిస్తాయని పలు గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఆ తదుపరి రోజు.. ఆశ్వయుజ అమావాస్యను 'దీపావళి'గా ఆసేతు హిమాచలం ప్రజలు జరుపుకొంటారు. ఈ రోజున లక్ష్మీపూజ ప్రధానం. లక్ష్మీదేవి దీపం రూపంలో ఉంటుందనీ, కాబట్టి దీపావళి నాడు దీపాలతో అలంకరించిన ఇళ్ళలో లక్ష్మీదేవి కొలువుతీరుతుందనీ భక్తుల విశ్వాసం. లక్ష్మీదేవిని పూజించిన తరువాత... పెద్దలూ పిన్నలు బాణాసంచా కాలుస్తారు. నాలుగో రోజైన కార్తిక శుద్ధ పాడ్యమిని 'బలి పాడ్యమి' అంటారు. బలి చక్రవర్తిని వామనావతారం ధరించిన శ్రీ మహావిష్ణువు పాతాళంలోకి అణగదొక్కాడు. ప్రతి ఏడాది ఈ రోజున... తను పాలించిన భూలోకానికి వచ్చి, ప్రజల యోగక్షేమాలను పరిశీలించడానికి అనుమతించాలని బలి చక్రవర్తి కోరాడు. మహావిష్ణువు ఆ వరాన్ని అనుగ్రహించాడు. బలి భూలోకానికి తిరిగి వచ్చే రోజు కాబట్టి దీనికి 'బలి పాడ్యమి' అనే పేరు వచ్చింది. చిత్రగుప్తుడి జయంతితోపాటు శ్రీకృష్ణుడు గోవర్ధన గిరి ఎత్తిన రోజు కూడా ఇదే. దానికి చిహ్నంగా కొన్ని ప్రాంతాల్లో గోవర్ధన పూజ జరుపుతారు. ఉత్తరప్రదేశ్‌లోని మధురలో గోవర్ధన గిరి పరిక్రమ నిర్వహిస్తారు. అయిదోరోజైన కార్తిక శుద్ధ విదియను 'యమద్వితీయ', 'యమ విదియ', 'భాతృవిదియ' అంటారు. యమ ధర్మరాజును ఆయ సోదరి యమున ఈ రోజున తన ఇంటికి ఆహ్వానించి, విందు భోజనం పెట్టిందనీ, సోదరీమణుల ఇంటిలో భోజనం చేసిన వారికి నరక బాధ ఉండదని, వారు అపమృత్యువు బారిన పడరనీ యముడు వరం ఇచ్చాడనీ పురాణ కథలు పేర్కొంటాయి. 'భాయ్ దూజ్'గా ఉత్తరాదిన దీన్ని పిలుస్తారు. 'భగిని హస్తభోజనం'గానూ వ్యవహరిస్తారు.



గీతాసారం

మానవులకు పరమ శత్రువు

"ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఎవరో బలవంతం చేసినట్టు... దేని ప్రభావానికి ప్రేరేపితుడై పాపాలు చేస్తూ ఉంటాడు?" అని అర్జునుడు అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "రజోగుణం నుంచి ఉత్పన్నం అయ్యేదే కామం. అదే క్రోధంగా రూపుదాల్చుతుంది. అది భోగానుభవాలతో చల్లారేది కాదు. పైగా అంతులేని పాపకర్మలు చేయడానికి



ప్రేరేపించేది కూడా అదే. కాబట్టి దాన్ని పరమ శత్రువుగా భావించాలి" అని చెప్పాడు. ఇక్కడ శ్రీకృష్ణుడు 'కామం' అనే పదాన్ని ఉపయోగించాడు. కామం అంటే కోరిక తాలూకు తీవ్ర రూపం. కర్మతో అనుబంధం కలిగి ఉండడం అనేది రజో గుణానికి ముఖ్య లక్షణం.

కామం అంటే మన జీవితాల్లో సమతుల్యత కోల్పోవడం. మనం సుఖాన్ని పొందడానికి, ఏదైనా వస్తువును సొంతం చేసుకోవడానికి, ఎవరైనా వ్యక్తితో కలిసి ఉండడానికి, అధికారాన్ని, కీర్తిని పొందడానికి చాలా శక్తిని ఖర్చు చేస్తాం. ఈ కోరికలకు శక్తిని అందిస్తున్నప్పుడు... వాటి పర్యవసానాల గురించి మనకు పూర్తిగా అవగాహన ఉండదు. కోరికలు హద్దులు దాటినప్పుడు... వాటి మీద మనకు ఎలాంటి నియంత్రణ ఉండదు. నెరవేరని కోరిక వల్ల క్రోధం ఏర్పడుతుంది. అదే విధంగా... ప్రతి సుఖం వెనుకా ఒక దుఃఖం ఎల్లప్పుడూ దాగి ఉంటుంది. అలా వచ్చే దుఃఖమే క్రోధంగా వ్యక్తమవుతుంది. కోరికలు ఎన్నటికీ సంతృప్తి చెందవు. వాటిని సంతృప్తి పరచడానికి ఎంత ప్రయత్నిస్తే ఎంతగా పెరుగుతూ ఉంటాయి. ధనవంతుడు మరిన్ని సంపదలను కోరుకుంటాడు. శక్తిమంతుడు నిరంకుశమైన శక్తిని కోరుకుంటాడు. వాటిని అణచివేయడం లేదా సంతృప్తిపరచడం అనేవి దీనికి పరిష్కారం కాదు. మనం కామం లేదా భయం అనే కోరల్లో చిక్కుకుపోయినప్పుడు... వాటి పట్ల మరింత అవగాహన పెంచుకోవాలనీ, ఆ అవగాహనే వాటి పట్టు నుంచి మనల్ని విడిపిస్తుందని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సద్బోధ

కనువిప్పు

స్వామి వివేకానంద వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ రాజస్థాన్ ప్రాంతంలోని అల్వార్ పట్టణానికి చేరుకున్నారు. వివేకానందుడి ఖ్యాతిని విన్న స్థానిక ప్రముఖులు ఆయన ప్రసంగాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి నాటి అల్వార్ రాజ్య దివాన్ కూడా హాజరయ్యాడు. ఆంగ్లంలో వివేకానందుడు చేసిన ప్రసంగం ఆయనను ఎంతో ఆకట్టుకుంది. "స్వామి! మీరు మా రాజమందిరానికి వచ్చి, మా మహారాజు మంగళ్‌సింగ్‌ను కలుసుకోవాలి" అని ఆహ్వానించాడు. వి



వేకానందుడు 'సరే' అన్నారు.

మరునాడు ఉదయం దివాన్‌తో కలిసి అల్వార్ రాజమందిరంలో వివేకానందుడు ప్రవేశించారు. రాజా మంగళ్‌సింగ్ విలాసాల్లో మునిగితేలే వ్యక్తి. అతనికి రాజుననే అహంకారం కూడా చాలా ఎక్కువ. దివాన్‌తో కలిసి తన మందిరానికి వచ్చిన వివేకానందుణ్ణి చూడగానే 'ఇతనెవడో కుర్ర సన్యాసి. ఇతనికి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే వయసు, అనుభవం ఎక్కడుంటాయి? అదీ ఇంగ్లీష్‌లో! ఇతనిదంతా ఉత్తుత్తి ప్రదర్శనేనని రుజువు చేస్తాను' అనుకున్నాడు. వివేకానందుడికి స్వాగతం చెప్పి, ఆసనంలో కూర్చోమన్నాడు. ఆ తరువాత స్వామీజీ! నాకు విగ్రహారాధన అంటే పరమ చిరాకు. అది వెనుకబాటుతనానికి నిదర్శనమని నా అభిప్రాయం. కుంకుమ, పసుపు, పూలతో ఒక బొమ్మను పూజిస్తూ, అదే దేవుడని భావించే వాళ్ళను చూస్తే నాకు జాలి కలుగుతూ ఉంటుంది. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి? అని అడిగాడు.

ఆ ప్రశ్నకు వివేకానందుడు నేరుగా సమాధానం ఇవ్వలేదు. పక్కనే టేబుల్ మీద ఉన్న ఒక చిత్రపటాన్ని చూసి "దివాన్జీ! మీరు ఆ చిత్రపటం మీద ఉమ్మెయ్యగలరా?" అని అడిగాడు. ఆ మాట వినగానే దివాన్జీ దిగ్భ్రాంతి చెందాడు. రాజు ఏమంటాడోనని భయంభయంగా చూశాడు. వివేకానందుడి మాటలు వినగానే రాజుకు ఆగ్రహం కలిగింది. దివాన్జీవైపు కోపంగా చూశాడు.

రాజు కోపాన్ని అర్థం చేసుకున్న దివాన్జీ "స్వామీ! మీరేం మాట్లాడుతున్నారు? ఆ చిత్రపటం ఎవరిదో తెలుసా? మా రాజావారి దివంగతులైన తండ్రిగారిది. ఆయన మాకు దైవంతో సమానం" అన్నాడు.

అప్పుడు వివేకానందుడు "రాజా! అది కేవలం ఒక వస్త్రం లేదా కాగితం. దాని మీద పెద్ద రాజావారి బొమ్మ గీశారు. దానికి రంగులు వేశారు. అంతేకదా! ఆ బొమ్మకి ఎముకలు లేవు, రక్త మాంసాలు లేవు, ఆత్మ లేదు. కానీ దాన్ని మీరు దాన్ని మీ తండ్రిగారి ప్రతిరూపంగా భావించుకుంటున్నారు. అది కేవలం రంగులతో వేసిన ఒక చిత్రంగా భావించుకోవడం మీ దృష్టిలోనూ, మీ పరివారం దృష్టిలోనూ అవివేకం. అదే విధంగా దైవ విగ్రహాన్ని దేవుడు కాదని అనడం కూడా అవివేకమే. ఆరాధించే భక్తులకు ఆ విగ్రహం స్వయానా దేవుడు కాదనే సంగతి తెలుసు. కానీ నిర్గుణంగా అంటే రూపం లేకుండా దేవుణ్ణి ఆరాధించడం అనేది సామాన్యమైన మానవులకు చాలా కష్టం. సగుణోపాసన అంటే ఒక రూపంలో దేవుణ్ణి ఆరాధించడం భక్తికి, ఆధ్యాత్మికతకు తొలి మెట్టు. ఈ మార్గంలో ఎంతో సాధన చేసిన తరువాత... దేవుడు నిర్గుణుడని, నిరాకారుడని వారు గ్రహించగలుగుతారు. అప్పటివరకూ ఈ మార్గాన్ని అనుసరించక తప్పదు. అందులో ఎలాంటి తప్పూ లేదు. అది వెనుకబాటుతనం కాదు. మూర్ఖత్వం అంతకన్నా కాదు" అని బదులిచ్చారు.

ఆ మాటలతో రాజా మంగళ్‌సింగ్ కళ్ళు తెరుచుకున్నాయి. తన ముందు ఉన్నది సామాన్యుడైన వ్యక్తి కాదనీ, వయసును మించి జ్ఞానం సంపాదించిన మహనీయుడని గ్రహించాడు. చేతులు జోడించి వివేకానందుడికి నమస్కరించాడు.

లక్ష్మీ కటాక్షం పొందాలంటే...

దీపావళి నాడు లక్ష్మీదేవిని పూజించడం సంప్రదాయం. లక్ష్మీతత్త్వాన్ని గురించి తెలుసుకుంటే... ఈ పండుగలోని అంతరార్థం మనకు తెలుస్తుంది. ఈ సృష్టి పరిణామక్రమానికి ప్రతీక 'లక్ష్మీదేవి' అని గ్రహించాలి. ఆమె శక్తి ద్వారానే మనం పరిణామ దశల్లో అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకుంటాం. ఇది లక్ష్మీతత్త్వంతో మొదలవుతుంది. అమృతం కోసం సాగిన

> మనకు ఉన్నదానిలోనే ఇతరులకు సాయపడే గుణం ఉంటేనే లక్ష్మీదేవి ఆశీస్సులు మనకు లభిస్తాయి. మానవులలో లక్ష్మీతత్త్వం పెంపొందాలంటే... సంతృప్తి, దాతృత్వం, ధర్మ నిరతి, సమతుల్యత తదితర సద్గుణాలు ఉండాలి. వాటిలో లోపం ఉంటే లక్ష్మీకటాక్షం ఉండదు.

అద్భుతమైన మథనంలో... లోకుల అన్వేషణకు ప్రతీకగా సముద్రం నుంచి శ్రీలక్ష్మీదేవి ఆవిర్భవించింది. జీవుల సృష్టి సముద్రం నుంచే ఆరంభమయింది. వాటికి శక్తి సముద్రం నుంచే రావలసి ఉంది. ఆ విధంగా జీవులలో లక్ష్మీతత్త్వ సారం అంతర్గతంగా నెలకొని ఉంటుంది. మనల్ని పోషించేదీ, రక్షించేదీ, భద్రత కల్పించేదీ అదే. ఆటవిక దశ నుంచి ఒక స్థిరత్వాన్ని మానవులకు ఈ తత్త్వమే కలిగించింది. ఇక్కడ లక్ష్మీదేవి గృహలక్ష్మిగా తన పాత్ర పోషిస్తోంది. ఇంటిని, కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ఏర్పరచుకోవడానికి అదే ప్రేరణ కలిగించింది. ఆ తరువాత మనిషి సంఘ జీవిగా రూపుదిద్దుకున్నాడు. రాజ్యం ఏర్పడింది. దీనికి మూలం రాజ్యలక్ష్మీ తత్త్వం.

ఏ ఇంట్లో మహిళలు 'గృహలక్ష్మి'గా గౌరవం పొందుతారో... ఆ ఇంట శ్రీలక్ష్మీదేవి సిరులు కురిపిస్తుంది. అందుకే... 'యత్రనార్యస్తు పూజ్యంతే, రమంతే తత్రదేవతాః' అన్నారు పూర్వులు. ఎక్కడ స్త్రీలను దేవతలుగా బావించి పూజిస్తారో... అక్కడ లక్ష్మీదేవి స్థిరంగా నిలుస్తుంది. 'యాదేవీ సర్వ భూతేషు శాంతి రూపేణ సంస్థితా...' అంటే ఆ శాంతి దేవతే గృహ లక్ష్మి రూపంలో స్థిరపడింది. గృహిణులు తమ ప్రాధాన్యతను గ్రహించినప్పుడు, సహన శక్తి, క్షమాశక్తితో కుటుంబంలో సంబంధ బాంధవ్యాలను మెరుగుపరిచే శక్తి సాధించినప్పుడే... ఆ ఇంట్లో శాంతి సాధ్యపడుతుంది. అలా కానప్పుడు కుటుంబ వ్యవస్థ గాడి తప్పుతుంది.



జీవ పరిణామ దశలో మనం అత్యున్నతమైన మానవులుగా ఉన్నాం. అనుక్షణం భగవంతుడి సంరక్షణలో ఉన్నాం. మనకు సంపదలు సమకూరినప్పుడు... లక్ష్మీ కటాక్షం కలిగిందని భావిస్తాం. మన సూక్ష్మ శరీర వ్యవస్థలో... నాభీ చక్రంలో

సహజయోగ

లక్ష్మీదేవి, మనలోని కుండలిని ప్రయాణించే సుషుమ్న నాడిలో మహాలక్ష్మీదేవి అధిష్ఠాన దేవతలుగా ఉంటారు. లక్ష్మీదేవి మనకు ధనాన్ని ప్రసాదిస్తే, మహాలక్ష్మీ దేవి దాతృత్వ స్వభావాన్ని ప్రసాదిస్తుంది. ఇంటిలో గాలి రావడానికి, గాలి పోవడానికి రెండు ద్వారాలు ఉంటాయి. అలాగే జీవితంలో సమతుల్యత కోసం... ధనం రావడానికి, బయటకు వెళ్ళడానికి రెండు దారులు ఉంటాయి. అంటే ధన సంపాదన ఉండాలి. దానితోపాటే ఇతరులకు చేతనైనంత సాయం చేసే స్వభావం కూడా ఉండాలి. పిసినారితనం లేకుండా, మనకు ఉన్నదానిలోనే ఇతరులకు సాయపడే గుణం ఉంటేనే లక్ష్మీదేవి ఆశీస్సులు మనకు లభిస్తాయి. మానవులలో లక్ష్మీతత్త్వం పెంపొందాలంటే... సంతృప్తి, దాతృత్వం, ధర్మ నిరతి, సమతుల్యత తదితర సద్గుణాలు ఉండాలి. వాటిలో లోపం ఉంటే లక్ష్మీకటాక్షం ఉండదు. మద్యపానం, జూదం లాంటి దుర్వ్యసనాలు, ఉన్నదానితో సంతృప్తి చెందకుండా అత్యాశకు పోవడం, మోసపూరితంగా, అధర్మ మార్గంలో ధనం సంపాదించాలనే దురాశ... ఇవన్నీ లక్ష్మీదేవికి వ్యతిరేకమైన గుణాలు. చాలామంది ధనసంపాదనే అన్ని సమస్యలకు పరిష్కారంగా భావిస్తారు. ధనం కోసం తాపత్రయపడి, రాత్రి-పగలు కష్టపడతారు. ఈ పోటీ ప్రపంచంలో ఇతరుల పిల్లలకన్నా తమ పిల్లలు ఉన్నతస్థాయిలో జీవించాలని కలలుకంటారు. ఈ తాపత్రయంలో పడి... మానవులందరి సంక్షేమం చూసేది ఆ భగవంతుడే అనే విషయాన్ని మరచిపోతారు. అప్పుడు వారి చిత్తం భగవంతుడి నుంచి దూరమవుతుంది. తమ వారసుల కోసం కూడబెట్టాలనుకుంటున్న ధనం మీదకు మరలిపోతుంది. దీనితో భగవంతుడి శక్తిని మరచిపోతారు. అలాకాకుండా ఉండాలంటే... మనం ధర్మబద్ధంగా ఎంత సంపాదించగలమో అంతే సంపాదించి, మన సంక్షేమాన్ని భగవంతుడికి విడిచిపెట్టాలి. ఎల్లప్పుడూ ధనం కోసం ఆందోళన చెందుతూ ఉండకూడదు. "...యోగక్షేమం వహామ్యహం" అన్నాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు. అంటే "నాతో (భగవంతుడితో) యోగం (కలయిక) పొందినట్టయితే, మీ క్షేమాన్ని నేను చూసుకుంటాను" అని అర్థం.

లక్ష్మీదేవి పద్మంలో నిలబడి ఉంటుంది. ఎటూ ఒరిగిపోకుండా సమతుల్యతను కలిగి ఉంటుంది. అదే విధంగా లక్ష్మీతత్త్వాన్ని కలిగి ఉన్న వ్యక్తి సమతుల్యతతో ఉంటాడు. అంటే ఎక్కడా అతి చెయ్యకుండా ఉంటాడు. లక్ష్మీదేవి నాలుగు చేతులలో ఒక చెయ్యి దానం చేసేదిగా, మరో చెయ్యి అభయం ఇచ్చేదిగా ఉంటుంది. మనలోని లక్ష్మీతత్త్వాన్ని స్థిరీకరించుకోవడం కోసం ఉదారంగా ఉండాలి, దానాలు చెయ్యాలి. మన దగ్గర పని చేసేవారికి, మనల్ని నమ్ముకున్నవారికి రక్షణ కల్పించాలి. లక్ష్మీదేవి చేతిలోని కలువపువ్వు... మన హృదయం కమలంలా ఉండాలని సూచిస్తుంది. తామరపువ్వు తనలోని మకరందాన్ని తీసుకోవడానికి వచ్చిన కీటకాన్ని సైతం ఎలా సేదదీర్చుతుందో... మన ఇంటికి వచ్చిన అతిథులను కూడా ఆ విధంగానే ఆదరించాలి. లక్ష్మీదేవి కృప మనమీద ప్రసరించాలంటే... ప్రేమపూరితమైన స్వభావం కలిగి ఉండాలి. ఎదుటి వ్యక్తి నుంచి ఎలాంటి ప్రయోజనాన్నీ ఆశించకూడదు. అటువంటి ప్రేమ జ్యోతిని... అంటే మన ఆత్మజ్యోతిని వెలిగించుకుందాం. ఈ దీపావళికి మనలోపల, బయట ఉన్న అంధకారాన్ని పటాపంచలు చేద్దాం. మనం లక్ష్మీతత్త్వాన్ని పొందాలంటే... మనలో ఆ తల్లి గుణగణాలు ప్రతిఫలించాలి. మన చిత్తం సదా భగవంతుడిపైనే ఉండాలి. దానికి ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన చేయడమే ఉత్తమమైన మార్గం.





డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ

సుభాషితం

పూర్వ జన్మ ఫలం

పురాకృత కర్మ ఫలం ఎంత విశిష్టమైనదో తన నీతిశతకంలోని...

భీమం వనం భవతి తస్య పురం ప్రధానం
సర్వో జనః సుజనతా ముపయాతి తస్య
కృత్స్నా చ భూర్భవతి సన్నిధి రత్నపూర్ణా
యస్యాస్తి పూర్వ సుకృతం విపులం నరస్య అనే శ్లోకంలో భర్తృహరి వివరించాడు.

భువనమున బూర్వ సంభృత పుణ్యరాశి
యగుచు నుదయంబు గాంచిన సుగుణ నిధికి
వనము పురమగు బరులాత్మ జనములగుదు
రవని నిధిరత్న పరిపూర్ణ య్యి ఫలించు
అంటూ దాన్ని తెలుగువారికి అందించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం: పూర్వ జన్మలో చేసిన పుణ్యం మానవుణ్ణి పెన్నిధిలా కాపాడుతుంది. ఏనుగులు, పులులు, సింహాలు లాంటి భీకరమైన మృగాలతో నిండి ఉన్న కీకారణ్యం అతనికి సకల సౌకర్యాలతో నిండిన మహా నగరంలా మారుతుంది. శత్రువులు వారి విరోధాన్ని విడిచి స్నేహితులు అవుతారు. వారికి తామం ఉన్న చోటు సకల సంపదలతో... రత్నగర్భగా మారుతుంది. మరుసటి జన్మల్లో అటువంటి ఫలితాలు పొందాలంటే... ఈ జన్మలో ఎల్లప్పుడూ మంచి పనులు చేయాలి.



అమరావతికి రైల్వే లైన్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలతో ఆయన మాట్లాడారు. రాబోయే నాలుగేళ్లలో అమరావతి రైలు మార్గాన్ని పూర్తి చేస్తామని తెలియజేశారు. "అమరావతి రాజధాని నిర్మాణం అనేది ఏపీ ప్రజల కలల ప్రాజెక్టు. అందుకే.. ఈ నగరాన్ని రైల్వేతో అనుసంధానం చేయాలని నిర్ణయం తీసుకున్నాం. నవ్యాంధ్ర తొలి సీఎంగా అప్పట్లోనే చంద్రబాబు.. అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అది ఇప్పుడు, కూటమి ప్రభుత్వంలో సాకారం అవుతోంది" అని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ రైలుమార్గం నిర్మాణంతో అమరావతికి దేశంలోని అన్ని రాష్ట్రాలతో కనెక్టివిటీ వస్తుందని పేర్కొన్నారు. వాస్తవానికి, రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులను పురోగతిలోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే పలు సమీక్షలు నిర్వహించారు. రైల్వే మంత్రితో అనేక దఫాలు చర్చించారు. వీటన్నింటి ఫలితంగా అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు మధ్య నూతన రైలుమార్గాన్ని కేంద్ర కేబినెట్ ఎకనామిక్ ఎఫైర్స్ కమిటీ ఆమోదం తెలిపింది. 57 కిలోమీటర్ల పొడవున ఈ రైలుమార్గం నిర్మాణం జరగనుంది. దీని వలన 19 లక్షల మానవ పనిదినాలు జనరేట్ అవుతాయని, ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి తెలిపారు.

కొండపల్లికి మినహాయింపు

ఖమ్మం జిల్లా మధిరలోని ఎర్రుపాలెం - నంబూరు (అమరావతి) రైలుమార్గంలో కొండపల్లి రిజర్వు అటవీ ప్రాంతం కలవకుండా జాగ్రత్తలు తీసుకొన్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పరిటాల వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్ నిర్మిస్తామని, దీని వల్ల సరుకు రవాణాకు అదొక హబ్‌గా మారుతుందన్నారు. పర్యావరణహితంగా ఈ రైలుమార్గం నిర్మాణం చేస్తారు. దీని వలన ఆరు కోట్ల కేజీల మేర కార్బన్ ఉద్గారాల నియంత్రణ జరుగుతుందని, ఇది 25 లక్షల మొక్కలతో సమానమని ఆయన పేర్కొన్నారు. రైలు మార్గం పొడవునా పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకొంటామన్నారు.



కృష్ణానదిపై వంతెన నిర్మాణం

అమరావతి రైలుమార్గంలో 3.2 కిలోమీటర్ల పొడవున కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తారు. కొత్తపల్లి - వడ్డమాను గ్రామాల మధ్య దీనిని ఏర్పాటు చేస్తారు. హౌరా - చెన్నై మార్గంలో ఇప్పటికే ఉన్న బ్రిడ్జికి సమాంతరంగా మరొక బ్రిడ్జి అందుబాటులోకి వస్తుంది. ఇది ఎంతో క్లిష్టమైన పని అయినప్పటికీ రైలుమార్గంతో పాటే బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి పేర్కొన్నారు.

సింగిల్ లైన్...160 కిలోమీటర్ల వేగం..

నూతన రైలుమార్గం ప్రస్తుతానికి సింగిల్ లైన్‌గా నిర్మిస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. "ట్రాఫిక్‌ను బట్టి డబ్లింగ్ చేస్తాం. సింగిల్ లైన్ అయినప్పటికీ 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేలా ట్రాక్ నిర్మాణం జరుగుతుంది. ఇందుకు అనుబంధంగా ఉండే సికింద్రాబాద్ - కాజీపేట, విజయవాడ - చెన్నై, బలార్ష - కాజీపేట మార్గాలను కూడా 160 కిలోమీటర్ల వేగాన్ని తట్టుకొనేలా వాటి సామర్థ్యం అప్‌గ్రేడ్ చేస్తాం" అని ఆయన తెలిపారు.

ఇతర రైలుమార్గాలతో సంధానం..

హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా వంటి పెద్ద నగరాలతో అనుసంధానిస్తూ అమరావతి రైల్వే ప్రాజెక్టును చేపట్టనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను కలుపుతూ రైల్వే లైను నిర్మాణం చేయనున్నారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత ప్రయాణ సౌకర్యం కలగడంతోపాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నంబూరు రైల్వేస్టేషన్ విజయవాడ - గుంటూరు/న్యూగుంటూరు సెక్షన్‌లో ఉన్నది. అలానే ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ విజయవాడ - ఖమ్మం సెక్షన్‌లో ఉంది. విజయవాడ - ఖమ్మం సెక్షన్ నుంచి బలార్ష, ఇటార్సీ, నాగ్‌పూర్, భోపాల్, ఢిల్లీకి కొత్త రైల్వే లైన్ అనుసంధానం అయి ఉంటుంది. అంతేకాకుండా అటు గుజరాత్ వైపునకు, ఇటు ఉత్తర్‌ప్రదేశ్‌కు కూడా ఈ మార్గంతో కనెక్టివిటీ ఉంది. నంబూరు రైల్వేస్టేషన్ నుంచి గుంటూరు మీదగా సికింద్రాబాద్, బెంగళూరుకు కనెక్టివిటీ ఉంది. న్యూగుంటూరు మీదగా తెనాలి నుంచి చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం, కన్యాకుమారికి కూడా కనెక్టివిటీ ఉంది. దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు కానుంది.

బిహార్‌కూ భారీగానే..

బిహార్‌లో భారీఎత్తున ట్రాక్ డబ్లింగ్ పనులు చేపట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. బిహార్‌లో రూ. 4,553 కోట్లతో రైల్వే ప్రాజెక్టులను పెద్దఎత్తున నిర్మించనున్నారు. ఉత్తర బిహార్‌కు, ఈశాన్య రాష్ట్రాలకు ప్రయోజనకారిగా ఉండేలా 256 కిలోమీటర్ల పొడవున డబ్లింగ్ పనులు చేపడతారు. నర్కటియాగంజ్-రక్సౌల్-సీతామఢీ-దర్భాంగ;సీతామఢీ- ముజఫర్‌పూర్ మధ్య ఈ పనులు చేపడతారు. ఈ పనులు పూర్తయితే పవిత్ర అయోధ్యను సీతామఢీతో అనుసంధానించడం తేలిక అవుతుంది. దాదాపు 40 వంతెనలను కలుపుతుంది.



అమరావతిలో రైలు మార్గం వెళ్లే మ్యాప్‌ను చూపిస్తున్న రైల్వే మంత్రి

బాబు అనుకుంటే సాధించేవరకు ఊరుకోరు

- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వ్యాఖ్య

అమరావతికి చల్లని కబురు చెప్పడానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ చివరిలో నేతల మధ్య సరదా సంభాషణ సాగింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అశ్వినీ వైష్ణవ్ రైల్వేమంత్రిగానే కాకుండా.. ఐటీ మంత్రిగా కూడా తనను తాను నిరూపించుకున్నారని, అందుకే వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారని చమత్కరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఒరిజినల్ ఐటీ మ్యాన్ చంద్రబాబు నాయుడని కొనియాడారు. విజనరీ ఉన్న వ్యక్తిగా బాబును అభివర్ణించారు. "రైల్వే ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని చంద్రబాబు అన్నారు కదా? సాధ్యమేనా" అని అశ్వినీ వైష్ణవ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. చంద్రబాబు అనుకుంటే సాధించే వరకు ఊరుకోరని నవ్వుతూ సమాధానమిచ్చారు.

అమరావతి పనులకు 2 నెలల్లో టెండర్లు

- 15 రోజుల్లోగా పాత కాంట్రాక్టులు రద్దు
- రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం శుభపరిణామం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ

అమరావతి/న్యూఢిల్లీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలపడం శుభపరిణామం అని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడి ఈ ప్రాజెక్టును పక్కనపడేసిందని చెప్పారు. జగన్ కారణంగా అమరావతి రైతులు పడినన్ని కష్టాలు ఇంకెవరూ పడలేదని, అందుకే ముందుగా వారి సమస్యలపైనే దృష్టి సారించామని పేర్కొన్నారు. మరో 15 రోజుల్లో గత కాంట్రాక్టులన్నీ రద్దుచేసి కొత్తవి పిలుస్తామని అన్నారు. సెక్రటేరియట్ భవనాల నిర్మాణానికి డిసెంబరు నెలఖరుకు, అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణానికి జనవరి నెలఖరుకు టెండర్లు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా దీపావళి కానుక పంపిందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.

ఐకానిక్‌గా కృష్ణా రైలు బ్రిడ్జి

- అమరావతి రైల్వే లైన్‌ను మూడేళ్లలో పూర్తి చేయండి: బాబు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమరావతి రైలుమార్గంలో కృష్ణానదిపై కొత్తగా ఏర్పాటు చేసే రైలు బ్రిడ్జి ఐకానిక్‌గా ఉండేలా చూడాలని కేంద్రాన్ని సీఎం చంద్రబాబు కోరారు. రైల్వేలైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్.... గురువారం ఆన్‌లైన్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, బీజేపీ ఎంపీ, బీజేపీ ఏపీ శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరితో మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... అమరావతి రైలుమార్గం కోసం అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని అశ్వినీ వైష్ణవ్‌కు హామీఇచ్చారు. ఇప్పటికే భూసేకరణకు నోటిఫికేషన్లు కూడా జారీ చేశామన్నారు. దీని దృష్ట్యా ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేయగలిగితే అందరికీ మేలు జరుగుతుందని చంద్రబాబు సూచించారు. అలానే నవంబరు/డిసెంబరు నెలల్లో ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధానమంత్రిని హాజరయ్యేలా చూడాలని కేంద్ర రైల్వే మంత్రిని చంద్రబాబు కోరారు. రాజధానికి రైల్వే కనెక్టివిటీ వల్ల దేశంలోని అన్నీ రాజధానులను అనుసంధానం చేసేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. కాగా, కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతికి అన్ని విధాలా సహకరించిందని ఎంపీ పురందేశ్వరి అన్నారు. అమరావతికి కనెక్టివిటీ పెంచడం ద్వారా ఇక్కడ ఆర్థిక వృద్ధికి అవకాశాలు పెరుగుతాయని ఆమె అన్నారు.

> "10 రోజుల కిందటే ఢిల్లీలో పర్యటించినప్పుడు అమరావతి రైల్వే అనుసంధానం గురించి ప్రధాని మోదీతో మాట్లాడాను. ఇంత తక్కువ సమయంలో ఈ ప్రతిపాదనను ఆమోదించడం హర్షణీయం. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరిస్తాం" - సీఎం చంద్రబాబు

ఏఐ వర్సిటీకి సలహాలివ్వండి

- ఎన్‌విడియా సీఈవోతో మంత్రి లోకేశ్ భేటీ

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) యూనివర్సిటీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రఖ్యాత ఏఐ కంప్యూటింగ్ సంస్థ ఎన్‌విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌ను మంత్రి నారా లోకేశ్ కోరారు. గురువారం ముంబైలో ఆయనతో మంత్రి భేటీ అయ్యారు. ఏపీ పాలనా వ్యవహారాల్లో ఏఐను ఉపయోగించాలనేది తమ ఆలోచనా విధానమని లోకేశ్ తెలిపారు. దీనిపై హువాంగ్ సానుకూలంగా స్పందించారు. భవిష్యత్తులో ఏఐలో రాబోయే విప్లవాత్మక మార్పులను వివరించారు. కాగా, స్పీచ్ రికగ్నైజేషన్, మెడికల్ ఇమేజింగ్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీకి అవసరమైన పవర్ టూల్స్, అల్గారిథమ్‌ను ఎన్‌విడియా అందిస్తోంది.



ఎన్‌విడియా సీఈవో జాన్సన్ హువాంగ్‌ను సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌కి రండి

బెంగళూరులోని ఎంఎన్‌సీలకు లోకేశ్ ఆహ్వానం

- అక్కడి లాజిస్టిక్ సమస్యలను ఎత్తిచూపిన పారిశ్రామికవేత్త పాయ్ పోస్టుకు ప్రతిస్పందన
- జగన్ విధ్వంసం మర్చిపోలేం.. రాలేమన్న పాయ్

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని బహుళ జాతి కంపెనీలను (ఎంఎన్‌సీలు) ఆంధ్రప్రదేశ్‌కు రావాలని మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం ఆహ్వానించారు. బెంగళూరులో అపరిష్కృతంగా ఉన్న లాజిస్టిక్ సమస్యలపై ప్రముఖ కర్ణాటక పారిశ్రామికవేత్త మోహన్‌దాస్ పాయ్ 'ఎక్స్' ఖాతాలో చేసిన ట్వీట్‌కు లోకేశ్ ఇలా స్పందించారు. బెంగళూరులో రోడ్లు, డ్రైనేజీ, రింగ్ రోడ్డు, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని, ఈ విషయంలో ఎంఎన్‌సీలకు అసంతృప్తి ఉన్నదని ఆ ట్వీట్‌లో మోహన్ దాస్ పాయ్ వ్యాఖ్యానించారు. అందుకే నగరం వెలుపలకు విస్తరించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. దీనిపై లోకేశ్ రీట్వీట్ చేస్తూ... ఎంఎన్‌సీలను ఏపీకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఏపీకి వస్తే తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దీనిపై పాయ్ స్పందిస్తూ... ఏపీలో గత ప్రభుత్వం (జగన్) అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, మళ్లీ విశ్వాసం పొందాలంటే సీఎం చంద్రబాబు చాలా ప్రయత్నాలు చేయాలన్నారు. అప్పటి విధ్వంసాన్ని మర్చిపోలేమని, ఇప్పట్లో రాలేమని తెలిపారు.



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా అనురాధ బాధ్యతలు

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా నియమితులైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి ఏఆర్ అనురాధ గురువారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏపీపీఎస్సీ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో సమావేశమయ్యారు..

10 గిగావాట్ల పవర్!

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి లోకేశ్‌కు ప్రతిపాదన చేశారు. గురువారం ముంబైలోని ఆ సంస్థ కార్యాలయంలో మంత్రి లోకేశ్ వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. తమ సంస్థ ఏపీలో 10 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు లోకేశ్‌కు వివరించారు. 2030 నాటికి రాష్ట్రంలో 72 గిగావాట్ల పునరుద్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్య సాధనలో సెరెంటికా భాగస్వామి అవుతుందని మంత్రి వెల్లడించారు.

‘వైసీపీ’ అధికారికి అందలం!

శ్రీశైలం ఈవోగా కీలక పోస్టింగ్!!

- అర్హులైన డిప్యూటీ కమిషనర్లను పక్కన పెట్టి చంద్రశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు
- అధికారులు, టీడీపీ శ్రేణుల విస్మయం
- సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు నేతలు సన్నద్ధం

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు దేవదాయ శాఖలో అర్హత లేకపోయినా కీలక పదవులు నిర్వహించి, వైసీపీ నాయకులతో అంటకాగిన అధికారికి శ్రీశైలం దేవస్థానం ఈవోగా పోస్టింగ్ ఇవ్వడంపై పాలక టీడీపీలో కలకలం రేపుతోంది. అవినీతి, అరాచక పాలనకు ఆయన కేరాఫ్ అడ్రస్ అయినప్పటికీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ఇన్‌చార్జిగా పంపడాన్ని దేవదాయ శాఖలోని డిప్యూటీ కమిషనర్లు (డీసీలు) ఆక్షేపిస్తున్నారు. తమను కాదని.. తమ కంటే కింది కేడర్ అధికారికి కీలక పోస్టింగ్ ఇవ్వడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. సదరు అధికారి పేరు చంద్రశేఖర్‌రెడ్డి. గత శనివారం ఇన్‌చార్జిగా ఈవోగా బాధ్యతలు చేపట్టారు కూడా. ఆయన గతంలో గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా ఉన్నప్పుడు పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు అప్పటి దేవదాయ కమిషనర్ అనురాధకు ఫిర్యాదులు అందాయి. ఆయన అప్పటి ఓ మంత్రితో తనకున్న బంధుత్వాన్ని అడ్డు పెట్టుకుని పైరవీ చేయడంతో అవి బుట్టదాఖలయ్యాయి. వైసీపీ జమానాలో ఆయన గుంటూరు డీసీగా (తనది అసిస్టెంట్ కమిషనర్-ఏసీ స్థాయి అయినప్పటికీ ఈ పదవి దక్కించుకున్నారు) ఉన్న సమయంలో తనకు అధికారం లేకపోయినా కొందరు ఉద్యోగులకు అడ్డగోలుగా పదోన్నతులిచ్చి భారీగా ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. వైసీపీ అధికారంలో ఉండగా టీడీపీ సీనియర్ నేత, ప్రస్తుత పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆధ్వర్యంలో నడుస్తున్న ధూళిపాళ్ల వీరయ్య చౌదరి (డీవీసీ) ట్రస్టు ఆస్పత్రిని ఎలాగైనా మూయించాలన్న అప్పటి సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా అడ్డగోలు నిబంధనలను చూపి చంద్రశేఖర్‌రెడ్డి పలుమార్లు నోటీసులు జారీచేశారు. పాడి రైతులకు రాయితీపై వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆ ఆస్పత్రి స్థలాన్ని ఆఖరికి 22ఏ నిషేధిత భూముల జాబితాలో పేర్కొంటూ నోటీసులిచ్చారు. గుంటూరు కేంద్రంగా 3 ఉమ్మడి జిల్లాల (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) అధికారిగా ఉండి తనిఖీల పేరుతో ఈవోలు, మేనేజర్లను వేధింపులకు గురిచేసి ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. శ్రీశైలం ఇన్‌చార్జి ఈవోగా నియమించకముందు ఆయన ఆ దేవస్థానంలోనే నలుగురు ఏసీలలో ఒకరిగా ఉన్నారు. ఆ నలుగురులోకీ ఈయనే జూనియర్. వాస్తవానికి శ్రీశైలం ఈవో పోస్టుకు డీసీ లేదా ఆర్‌జేసీ కేడర్ అధికారిని నియమించాలి. అక్కడే డిప్యూటీ ఈవో స్థాయిలో ఓ మహిళ డీసీ కేడర్ అధికారిగా ఉన్నారు. వాస్తవానికి ఆమెనే ఇన్‌చార్జి ఈవోగా నియమించాలి. ఆమెను కాదని.. సీనియర్లను పక్కన పెట్టి.. జూనియర్ అయిన చంద్రశేఖర్‌రెడ్డికి పెద్దపీట వేయడంపై దేవదాయ శాఖ అధికారులు సైతం విస్తుపోతున్నారు. వైసీపీ హయాంలో గుంటూరు జిల్లాలో ఈయన తీరును దగ్గరుండి చూసిన టీడీపీ నేతలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు.





కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి దిగుబడులు పోటెత్తాయి. గురువారం మార్కెట్‌కు 43,803 బస్తాల (19,711 క్వింటాళ్లు) దిగుబడులు వచ్చాయి. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మార్కెట్ ముందున్న అశోక్ నగర్ రోడ్డుపై ఉల్లి లోడుతో ఉన్న ట్రాక్టర్లు, లారీలు, ఎద్దుబండ్లు బారులుదీరాయి.

కుటుంబ కలహాలు మామూలే!



- గొడవలు ఏ ఇంట్లో ఉండవు?
- నేను గుర్ల వస్తున్నాననే మా తగాదాలు తెరపైకి తెచ్చారు
- షర్మిలతో వివాదాలపై జగన్ వ్యాఖ్యలు
- సీఎం చంద్రబాబుపై విమర్శలు
- డయేరియా బాధితులకు పరామర్శ

విజయనగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లీ చెల్లితో ఆస్తి వివాదాలను 'సాధారణమైన అంశం'గా వైఎస్ జగన్ తేల్చేశారు. వారిద్దరిపై ట్రైబ్యునల్‌లో కేసు వేయడాన్ని కూడా 'మామూలు విషయం'గానే లెక్కకట్టారు. తాను డయేరియా బాధితులను పరామర్శించేందుకు వస్తున్నానని.. జనం దృష్టిని మళ్లించేందుకే 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. మీడియాలో తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా వార్తలు రాయిస్తున్నారని ఆక్రోశించారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం విజయనగరం జిల్లాలో డయేరియా ప్రభావిత గ్రామమైన గుర్లలో పర్యటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం "రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వాటర్ ట్యాంకులు సకాలంలో శుభ్రం చేయించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. డయేరియా ఘటన నుంచి ప్రజలను మభ్యపెట్టేందుకు అనుకూల పత్రికలు, మీడియాలో నాకు, నా కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆస్తి తగాదాను తెరపైకి తెచ్చారు. కుటుంబ కలహాలు ఏ ఇంట్లో ఉండవు? అవి మామూలే" అని జగన్ వ్యాఖ్యానించారు.

మైకు వదిలేసి...: జగన్ మీడియా ముందుకు చేరుకోగానే.. వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంత చెప్పినా వినకపోవడంతో.. 'మాట్లాడమంటారా.. వెళ్లిపొమ్మంటారా?' అని జగన్ అసహనం వ్యక్తం చేశారు. చివరకు మైకు వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను, ఇతర నేతలు బతిమాలి జగన్‌ను మళ్లీ తీసుకొచ్చారు. జగన్ పరామర్శించేందుకు వీలుగా జనాన్ని, డయేరియా బాధితులను తీసుకొచ్చారు. కనీసం ఫ్యాను ఏర్పాటు చేయలేదు. ఒక దశలో టెంట్ కూడా కూలిపోయింది. వైసీపీ కార్యకర్తలు రచ్చ చేయగా... వారిని అదుపు చేయడంతో విఫలమయ్యారంటూ జగన్ పోలీసులపై చిర్రుబుర్రులాడడం గమనార్హం. మీడియా సమావేశం పెట్టడానికీ కూడా సహకరించరా అని చిందులు తొక్కారు. మరోవైపు... జగన్ కాన్వాయ్ కారు టైర్లు ఓ కానిస్టేబుల్ కాలుపైగా వెళ్లడంతో ఆయనకు గాయాలయ్యాయి.

బొత్స గైర్హాజరు..

చీపురుపల్లి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం అన్న సంగతి తెలిసిందే. స్వయంగా పార్టీ అధినేతే అక్కడ పర్యటనకు వస్తే బొత్స హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. అయితే ఆయన విదేశాలకు వెళ్లారు. నాలుగైదు రోజుల్లో తిరిగి వస్తారని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇంకోవైపు.. విజయసాయిరెడ్డికి తిరిగి పార్టీ విశాఖ పగ్గాలు అప్పగించడం వల్లే ఆయన జగన్ కార్యక్రమానికి దూరంగా ఉన్నారనే గుసగుసలు కూడా వినిపించాయి.

ఆస్తులపైనే మీ ప్రేమ!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోదరి షర్మిల గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 'కుటుంబ కలహాలు మామూలే' అని జగన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. "కుటుంబాల్లో గొడవలు సాధారణమే అని జగన్ చెబుతున్నారు. కుటుంబ కలహాలు సామాన్యమేనంటూ తల్లిని, చెల్లిని కోర్టుకెందుకు ఈడ్చారు. ఇది సామాన్యమైన విషయం కాదు జగన్ సార్" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఎందుకీ బీద ఏడుపులు...

కేవలం ఆస్తులను లాక్కోవడం కోసమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులని, బెయిల్ రద్దు అవుతుందని జగన్ రకరకాల సాకులు చెబుతున్నారన్నారు. ఆయన చెప్పినవేవీ నిజాలు కావని స్పష్టం చేశారు. "సరస్వతీ పవర్‌లో నాకు వాటాలివ్వడంవల్ల బెయిల్ రద్దవుతుందంటూ జగన్ బీద ఏడుపు ఏడుస్తున్నారు. ఇది ఈ శతాబ్దపు జోక్. చట్ట విరుద్ధమని తెలిసినా ప్రేమతో నాకు షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధం" అని షర్మిల పేర్కొన్నారు. 2016లో ఈడీ అటాచ్ చేసినందున షేర్లు బదిలీ చేయకూడదన్న జగన్ వాదనను తోసిపుచ్చారు. "సరస్వతీ కంపెనీ షేర్లను ఈడీ అటాచ్ చేయలేదు. రూ.32 కోట్ల విలువైన కంపెనీ భూమిని మాత్రమే అటాచ్ చేసింది. షేర్లను ఏ సమయంలోనైనా బదిలీ చేసుకోవచ్చు. స్టాక్ మార్కెట్లలో ఉన్న చాలా కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అయినా వాటి ట్రేడింగ్ జరుగుతోంది కదా!" అని షర్మిల ప్రశ్నించారు. సరస్వతీ పవర్ షేర్లను 100 శాతం తనకు బదిలీ చేస్తామని 2019లోనే జగన్ ఎంఓయూపై సంతకం చేశారని షర్మిల తెలిపారు. అప్పుడు బెయిల్ సంగతి గుర్తుకు రాలేదా అన్నారు.



"2021లో క్లాసిక్ రియల్టీ, సండూర్ పవర్‌లో ఉన్న కంపెనీ షేర్లను రూ.42 కోట్లకు కొనుగోలు చేసేందుకు తల్లి వైఎస్ విజయమ్మకు ఎలా అనుమతి ఇచ్చారు? 2021లో జగన్, ఆయన సతీమణి కలిసి విజయమ్మకు గిఫ్ట్ డీడ్ ఇవ్వలేదా? అప్పుడు బెయిల్ రద్దు గుర్తుకురాలేదా?" అని ప్రశ్నించారు.

ఇదీ అసలు విషయం...

మొన్నటి ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయాక జగన్ మనసు మారిందని... ఈ ప్రాజెక్టులను వదులుకోవడానికి ఇష్టపడటం లేదని షర్మిల చెప్పారు. అసలు విషయం ఇదే అన్నారు. "సరస్వతీ పవర్‌ను కూడా భారతీ సిమెంట్స్ కంపెనీ కింద నిర్వహించాలనుకుంటున్నారు. అందుకే షేర్లను బదిలీ చేయలేమని చెబుతున్నారు" అని షర్మిల మండిపడ్డారు.

కుటుంబాన్ని రోడ్డుమీదకు లాగి మాపై నిందలా?

- తల్లి, చెల్లికి ఇవ్వాల్సిన ఆస్తిపై ఎవరైనా ఆంక్షలు పెడతారా?
- జగన్ లాంటి చిల్లర వ్యక్తితో రాజకీయాలు చేస్తాననుకోలేదు: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటా ఇవ్వకుండా వైసీపీ అధినేత జగన్ తన తల్లీ, చెల్లిని రోడ్డుకు పడేశారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. అలాంటి వ్యక్తి తమను నిందిస్తున్నారన్నారు. "రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రజలంతా మంచిగా మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో గతంలో జరిగిన విధ్వంసం గురించీ చర్చించుకుంటున్నారు. చీకటి జీవోలతో నాడు పాలన సాగించారు. ఆ జీవోలపై విచారణ చేయిస్తున్నాం. గత పాలకుల అరాచకాలన్నీ బయటకు వస్తున్నాయి" అని చంద్రబాబు పేర్కొన్నారు. తల్లి, చెల్లితో గొడవలు పెట్టుకుని వాటిలోకి తమను లాగుతున్నారని ఆయన ఆగ్రహించారు. "తండ్రి సంపాదించిన ఆస్తిని తల్లికి రానివ్వకుండా చేస్తున్నారు. తల్లి, చెల్లికి ఇవ్వాల్సిన ఆస్తిపై ఆంక్షలు పెడతారా ఎవరైనా?. 2004లో జగన్ ఆదాయం ఎంత? ఇన్ని లక్షల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి?" అని ప్రశ్నించారు. కేంద్రం అమరావతికి డబ్బులిస్తామంటే ఆనాడు వద్దన్నారని, ప్రజావేదిక కూల్చారని, తాను తల్చుకుంటే ఇప్పుడు కూల్చలేనా అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యక్తితో రాజకీయాలు చేస్తానని తాను ఎప్పుడూ అనుకోలేదనీ అన్నారు. వైసీపీలో ఉండేవారు కూడా ఆ పార్టీ పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడేలా ఆనాడు జగన్ పాలన సాగిందన్నారు. విలువల్లేని మనుషులతో సమాజానికి చేటు అని, చెత్త టీవీ, చెత్త పేపరులో నోటికొచ్చింది రాసుకుంటున్నారని ఆగ్రహించారు. గత ఐదేళ్లు తనను బయటకు రానివ్వలేదని, కానీ తాను జగన్‌ను తిరగనిస్తున్నామన్నారు. తెనాలి బాధితురాలి కేసులో.. వైసీపీలో చేరి తన కొడుకు చెడిపోయాడని నిందితుడి తల్లే తెలిపారన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు ముందుకు సాగలేదనీ, ఏపీకి ఉండే కనెక్టివిటీపై అశ్రద్ధ చేశారని విమర్శించారు. దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించబోతున్నామని చంద్రబాబు చెప్పారు. సామాన్యులు, నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో ఉంచాలని నిర్ణయించామని, ప్రకృతి సంపదను దోచేశారని, ఇసుక సరఫరా లేకపోవడంతో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడ్డారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 108 కొత్త ఇసుక రీచ్‌లకు అనుమతి ఇస్తున్నామని, గత ఐదేళ్లలో గాడి తప్పిన పనులను గాడిన పెడుతున్నామన్నారు. అమరావతి-అనంతపురం హైవే అలైన్‌మెంట్‌ను ఆనాడు మార్చేశారని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. "ప్రస్తుతానికి అమరావతి-కడప, గిద్దలూరు-అమరావతి పనులు పూర్తి చేశాక భవిష్యత్తులో ఇంకా ఏమిచేయాలో ఆలోచిస్తాం. ఏపీ అంటే కరువు, తుఫాను అని గతంలో అనేవారు. ఆ భావనలో ఇప్పుడు మార్పువచ్చింది. అభివృద్ధికి మారుపేరుగా ఆంధ్రప్రదేశ్ ఉంది" అని చంద్రబాబు తెలిపారు.

తల్లి, చెల్లిపై జగన్ కేసు పెడతారని..

ముందే ఊహించాం

- విజయలక్ష్మి, షర్మిలకు రక్షణ కల్పిస్తాం: అనిత



విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిలపై కేసు పెడతారని ముందే ఊహించామని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గురువారం విశాఖ, విజయనగరంలో విలేకరులతో మాట్లాడారు. ఆస్తుల పంపకం వ్యవహారంతో తల్లి, చెల్లిపై జగన్‌కు ఎంత ప్రేమ ఉందో వెల్లడైందని చెప్పారు. రాష్ట్రంలో 'అమ్మ, చెల్లి వద్దు' అనే సినిమా నడుస్తోందన్నారు. సొంత చెల్లికి న్యాయం చేయని వారు రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు ఎలా విలువిస్తారని ప్రశ్నించారు. సీఎం కుర్చీకోసం సొంత బాబాయినే హత్య చేయించారని ఆరోపించారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో విజయలక్ష్మికి, షర్మిలకు రక్షణ కల్పిస్తామన్నారు.

తల్లి, చెల్లిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు

- వారిపై కేసు పెట్టడం, తండ్రిని కేసులో ఇరికించడం ఎక్కడా చూడలేదు: సోమిరెడ్డి

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా సరెండర్ చేసుకోవడానికి జగన్ సొంత తల్లి, చెల్లినే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తండ్రిని ఈడీ కేసులో ఇరికించి, ఆస్తి కోసం తల్లి-చెల్లిపై కూడా కేసు పెట్టడం ఎక్కడా చూడలేదన్నారు. అలాంటి జగన్ నోట తల్లీ, చెల్లీ అనే మాటలు వినలేకపోతున్నామని తెలిపారు. గురువారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. వైఎస్ కుటుంబం ఆస్తుల జోలికి తాము వెళ్లడం లేదని, జగన్ క్రూర మనస్తత్వం గురించే మాట్లాడుతున్నామన్నారు. 'సరస్వతి పవర్‌కు ప్రభుత్వ భూమి ఇచ్చిన తర్వాత ఆరేళ్ల పాటు ప్రారంభించలేదు. రెండేళ్లలో ప్రారంభించకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూకేటాయింపులు రద్దు చేయవచ్చు. అలాగే సీఎంగా ఉన్నప్పుడు సరస్వతి పవర్‌కు ఇచ్చిన భూమి లీజు 30 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచి మరో చట్టవిరుద్ధ కార్యక్రమానికి తెరదీశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు కేటాయించిన భూమిని రద్దు చేయాలని మా నాయకుడు, సీఎం చంద్రబాబును కోరుతున్నాం' అని చెప్పారు. జగన్ అనుభవిస్తున్న ఆస్తి ప్రజలదన్నారు. ఆయన అంగీకరిస్తే సరస్వతి పవర్‌కు చెందిన 1,500 ఎకరాలను మూడు భాగాలు చేసి ఒక భాగం రైతులకిచ్చి, మిగిలిన రెండు భాగాలు జగన్, షర్మిలకు పంచుతామని చెప్పారు.

అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ఓకే

- న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ
- ఏపీ హైకోర్టు 'న్యాయమూర్తులు'గా కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్



కుంచం మహేశ్వరరావు | చల్లా గుణరంజన్ | టీసీ ధనశేఖర్

అమరావతి, న్యూఢిల్లీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా కుంచం మహేశ్వరరావు, టీసీ ధనశేఖర్, చల్లా గుణరంజన్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. వీరి నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ హైకోర్టులో న్యాయవాదులుగా ఉన్న కుంచం మహేశ్వరరావు, టి. చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్‌లను ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని ఈ నెల 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 26 మంది ఉన్నారు. ఈ ముగ్గురు నియామకంతో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరింది. ప్రస్తుతం ఏపీ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జి.నరేందర్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫార్సు చేసింది.

రహదారి సమస్యలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పనులకు ఉచితంగా ఇసుక
- గ్రావెల్ అనుమతులు సులభతరం: సీఎం చంద్రబాబు



రాష్ట్రంలోని హైవే ప్రాజెక్టులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉన్నతాధికారులు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లు, భూసేకరణ, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 129 ప్రాజెక్టులతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న రూ.30వేల కోట్ల రహదారి ప్రాజెక్టులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా పూర్తయ్యేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ కీలక అధికారులతో సమన్వయం చేసుకొనేలా ప్రభుత్వం సత్వర కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తుందని చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణంపై ఆయన గురువారం సమీక్షించారు. భూ సేకరణ, ఇతర సమస్యలతో 260కి.మీ. పరిధిలో రూ.4,766 కోట్ల విలువైన 11ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నట్లు సీఎంకు అధికారులు నివేదించారు. ఆయా శాఖల మధ్య సమన్వయం, సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని సమీక్ష సమావేశంలో చంద్రబాబు ప్రకటించారు. భూ సేకరణ సమస్యలు 3నెలల్లో పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో నేషనల్ హైవే, అటవీ, రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉంటారని తెలిపారు. దీనితో పాటు అన్ని సమస్యలను ఒకే వేదికపై తెలిపేందుకు, వెంటనే పరిష్కారం చూపేందుకు ప్రత్యేకంగా ఒక వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులకు అవసరమైన ఇసుకను కాంట్రాక్టు ఏజెన్సీలు ఉచితంగా తీసుకెళ్లవచ్చని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అలాగే గ్రావెల్ అనుమతులను మరింత సులభతరం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. రహదారి ప్రాజెక్టుల్లో భారీ వంతెనల నిర్మాణాల వద్ద వాటర్‌షెడ్ తరహాలో నీటిని నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. దానివల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

రూ.32.69 కోట్లతో పీపీపీ రోడ్లపై అధ్యయనం

- కన్సల్టెంట్లతో చేయించాలని నిర్ణయించిన ప్రభుత్వం
- ఏడు ప్యాకేజీలుగా రహదారి పనులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర రహదారులను పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయడానికి కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్ల ద్వారా అర్హత కలిగిన కన్సల్టెన్సీలను ఎంపిక చేయాలని ఏపీఆర్‌డీసీ చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు (జీవో 318) జారీ చేసింది. ఈ అధ్యయనానికి అయ్యే ఖర్చు రూ.32.69 కోట్లుగా ఖరారు చేశారు. రాష్ట్రంలో ప్రధాన రహదారులను పీపీపీ విధానంలో విస్తరించి, అభివృద్ధి చేయాలని ఆర్‌అండ్‌బీని సీఎం చంద్రబాబు రెండు నెలల క్రితం ఆదేశించారు. దీనిలో భాగంగా ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నేతృత్వంలోని బృందం గుజరాత్, అసోం సహా పలు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి పీపీపీ రహదారులపై అధ్యయనం చేసి వచ్చింది. ఇప్పుడు కన్సల్టెన్సీలను ఎంపిక చేసి వాటితో పీపీపీ రహదారుల సాధ్యాసాధ్యాలు, ఇతర సాంకేతిక అంశాలపై అధ్యయనం చేయించాలని సర్కారు నిర్ణయించింది. ఐపీడీఎఫ్ స్కీమ్ కింద ఏడు ప్యాకేజీల్లో 1,307 కి.మీ. మేర రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడు ప్యాకేజీల్లో పేర్కొన్న రహదారుల అభివృద్ధికి సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల పరిశీలనతో పాటు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ల తయారీపై కన్సల్టెన్సీలను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవనున్నారు.

శ్రీకాకుళంలో 6 లేన్ల ఎలివేటెడ్ కారిడార్

- రణస్థలం వద్ద 252.42 కోట్లతో ఏర్పాటు: గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ ఆధునీకరణ, అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.252.42 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని, రహదారి భద్రత మెరుగవుతుందని చెప్పారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఏఐతో చెక్: గడ్కరీ

ట్రాఫిక్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడానికి, జరిమానాలను కచ్చితంగా విధించేలా చూడటానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర వినూత్న పద్ధతులు ఉపయోగించనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌ఫ్రా టెక్ ఎక్స్‌పో 12వ ఎడిషన్‌ను ఉద్దేశించి గురువారం ఆయన ప్రసంగించారు. అధునాతన ఇంజనీరింగ్ పద్ధతులు, చట్టాల అమలు, ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకోకుండా రోడ్డు భద్రతను సాధించలేమని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.